


ww.voodyam.com
Estd :1999

# వుదయం




ఆదివారం, అక్టోబర్ 19, 2025 | గుంటూరు | సంపుటి : 12 | సంచిక : 246 | వెల : రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM TELUGU DAILY

/VOODAYAM Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal

## పౌరులను కొట్టడం అలవాటుగా

# మార్చుకున్నారా..?

### చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు : ఏపీ హైకోర్టు


- పోలీసుల తీరుపై హైకోర్టు తీవ్ర అసహనం
- పౌరులను కొట్టడం అలవాటుగా మార్చుకున్నారని వ్యాఖ్య
- 2016 నాటి కేసులో 8 ఏళ్లయినా దర్యాప్తు పూర్తికాలేదని అసహనం
- కోర్టు ఆదేశాలతోనే ఫైనల్ రిపోర్ట్ దాఖలు



**అమరావతి అక్టోబర్ 18 వుదయం బ్యూరో :** రాష్ట్రంలో పోలీసుల వైఖరిపై ఏపీ హైకోర్టు తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేసింది. పౌరులను అక్రమంగా నిర్బంధించడం, వారిపై దాడి చేయడం పోలీసులకు ఒక అలవాటుగా మారిందని ఘాటుగా వ్యాఖ్యానించింది. నిందితులపై హత్య కేసు లేదా దొంగతనం కేసు నమోదు చేసినా, చట్టప్రకారం నడుచుకోవాలే తప్ప, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అధికారం పోలీసులకు లేదని స్పష్టం చేసింది.కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామానికి చెందిన గొల్ల జయపాల్ యాదవ్‌ను 2016లో సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని తీవ్రంగా కొట్టారని, ఆ దెబ్బల కారణంగా బాధితుడు ఎనిమిదేళ్లు గడిచినా ఇప్పటికీ సరిగా నడవలేని దుస్థితిలో ఉన్నాడని కోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. తనను చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని జయపాల్ 2016లో ఫిర్యాదు చేస్తే, ఇన్నేళ్లయినా ఆ కేసులో తుది నివేదిక దాఖలు చేయకపోవడంపై న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పోలీసుల పనితీరును ఉదహరిస్తూ న్యాయమూర్తి మరో ఘటనను గుర్తుచేశారు. "ఇటీవల హైకోర్టులో పనిచేసే డ్రైవర్‌పై మంగళగిరి సీఐ దాడి చేశారు. మేము జోక్యం చేసుకుని జిల్లా ఎస్పీని పిలిపించి మాట్లాడితే తప్ప కేసు నమోదు చేయలేదు. ఆ తర్వాత స్వయంగా డీజీపీతో మాట్లాడటంతో దర్యాప్తు అధికారిని నియమించి, ఆ సీఐని వీఆర్‌కు పంపారు. రాష్ట్రంలో పోలీసుల పనితీరు ఈ విధంగా ఉంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జయపాల్ కేసులో కర్నూలు ఎస్పీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌ను కోర్టుకు హాజరుకావాలని ఆదేశించిన తర్వాతే, ఈ నెల 14న పోలీసులు సంబంధిత కోర్టులో తుది నివేదిక దాఖలు చేశారని న్యాయమూర్తి పేర్కొన్నారు. కేసును మూసివేయాలని పోలీసులు భావిస్తే, ఆ విషయాన్ని కోర్టుకు తెలిపి, న్యాయస్థానం ఆమోదం పొందాలని సూచించారు. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేస్తూ, తుది నివేదిక కాపీని పిటిషనర్‌కు అందజేయాలని ఆదేశించారు. అదే సమయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌కు కోర్టు హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# మోడీ మౌనమేలా..?


- కాంగ్రెస్ విమర్శలు



రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశం నుంచి భారత్ ఇక చమురు కొనుగోలు చేయదని మళ్లీ ప్రకటించారు. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రధాని మోదీ పై కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తుంది. అధ్యక్షుడి మాటలపై మౌనం వహించడాన్ని తీవ్రంగా తప్పుబడుతుంది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈమేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గిస్తుందని తన మంచి స్నేహితుడు (మోదీని ఉద్దేశిస్తూ) తనకు హామీ ఇచ్చాడంటూ ట్రంప్ పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. 'ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశానంటూ, రష్యా ఇంధన కొనుగోళ్లను భారత్ తగ్గిస్తుందంటూ ట్రంప్ చెప్పినప్పుడల్లా.. ఆయన మంచి స్నేహితుడు అకస్మాత్తుగా మౌనీ బాబా అయిపోతారు' అంటూ రమేశ్ విమర్శలు చేశారు. ఉక్రెయిన్‌లో యుద్ధం ముగించే అంశంపై చర్చలు జరిపేందుకు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ వైట్‌హౌస్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన రష్యా నుంచి భారత్ ఇక చమురు కొనుగోలు చేయదని పేర్కొన్నారు. ఇప్పటికే వాటిని తగ్గించుకుందని వ్యాఖ్యానించారు. ఇంతకుముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రకటనలే చేశారు. ఈ చమురు కొనుగోళ్లు ఆపేయడంపై తనకు మోదీ నుంచి హామీ వచ్చిందంటూ ట్రంప్ పేర్కొన్నారు. అయితే, భారత్ వాటిని ఖండించింది. ఇరువురి నేతల మధ్య అలాంటి సంభాషణ జరగలేదని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే భారత వినియోగదారుల ప్రయోజనాల మేరకే ఇంధన కొనుగోలు ఎంపికల్లో ప్రాధాన్యం ఉంటుందని తేల్చిచెప్పింది.

# కుదిపేసిన సెక్స్ కుంభకోణం

- రాయల్ టైటిల్ వదులుకున్న ప్రిన్స్



అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణం కేసు పత్రాలలో దేశ మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ సహా దాదాపు 200 మంది ధనవంతులు, శక్తిమంతుల పేర్లు ఉన్న విషయం తెలిసిందే. ఈ పత్రాలలో బ్రిటన్ యువరాజు ఆండ్రూ పేరు కూడా ఇటీవల బయటకువచ్చింది. ఈ నేపథ్యంలో ప్రిన్స్ ఆండ్రూ తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను వదులుకున్నారు. బ్రిటన్ రాజు చార్లెస్ ఒత్తిడి మేరకు ఆయన తన బిరుదును వదులుకున్నట్లు సమాచారం. ఇకపై తన బిరుదును, తనకు లభించే గౌరవాలను ఉపయోగించనని ప్రిన్స్ ఆండ్రూ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. బ్రిటన్ రాజు చార్లెస్‌తో, తమ కుటుంబసభ్యులతో చర్చల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. తనపై వస్తున్న ఆరోపణల వల్ల రాజ కుటుంబ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

# చిన్న చొరవ.. పెద్ద సామాజిక మార్పు

- ఈలలు వేసి.. కర్రలు తిప్పుతారు
- వారణాసి ఉమెన్ గ్రీన్ ఆర్మీ



ఒక చిన్న చొరవ పెద్ద సామాజిక మార్పునకు దారి తీసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో రవిమిశ్ర, మరో అయిదుగురు యువకులు కలిసి ఏర్పాటుచేసిన 'గ్రీన్ ఆర్మీ' సాంఘిక సంస్కరణ బృందంగా మారింది. గ్రామాల్లో పరిశుభ్రత, చైతన్యం కోసం ఏర్పడిన ఈ ఆర్మీ యూపీ గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చే ఉద్యమంగా మారింది. బనారస్ యూనివర్సిటీ నుంచి పట్టభద్రుడైన రవిమిశ్ర సివిల్ సర్వీసులకు వెళ్లాలన్న తన కల సాకారం కాకపోవడంతో సమాజసేవ వైపు మళ్లారు. 2015లో వారణాసి సమీప ఖుషియారీ గ్రామానికి చెందిన 25 మంది మహిళలతో గ్రీన్ ఆర్మీని సిద్ధం చేసి.. వారికి ప్రత్యేక చీరలు, కర్రలు, ఈలలు ఇచ్చారు. సూర్యోదయానికి ముందే నిద్ర లేచే ఈ మహిళలకు ఊరి శివారుల్లో పహారా కాసి గ్రామస్థులు బహిరంగ మలవిసర్జనకు వెళ్లకుండా చూసేలా విధులు అప్పగించారు. ఈ ఉద్యమం క్రమంగా 22 జిల్లాల్లోని 80 గ్రామాలకు విస్తరించి, 2,200 మంది మహిళలు సభ్యులుగా చేరారు. స్థానిక పోలీసులు వీరిని 'పోలీస్ మిత్ర' అని పిలుస్తున్నారు. గ్రామాల్లో గృహహింస, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకూ వీరు సహకరిస్తున్నారు. చెప్పులు, నార సంచుల తయారీ యూనిట్లతో ఈ మహిళలు ఉపాధి సైతం పొందుతున్నారు. వీరి కృషిని గుర్తించిన ప్రధాని మోదీ అభినందన లేఖను పంపారు. యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ రాజ్‌భవన్‌కు పిలిచి రూ.21 లక్షల సహాయనిధిని అందజేశారు.

## ధాన్యం అమ్మిన

# 48 గంటల్లోనే నగదు

- ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు లబ్ధి
- అన్నదాతలకు తక్కువ ధరకే వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి: మంత్రి నిమ్మల



**పాలకొల్లు:** జీఎస్టీ తగ్గింపుతో ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు లబ్ధి చేకూరుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మంత్రి అచ్చెన్నాయుడితో కలిసి పాల్గొన్నారు. రైతులతో మంత్రులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపుతో రైతులు పెద్దఎత్తున లబ్ధి పొందుతున్నారని చెప్పారు. వ్యవసాయ యంత్రాలు తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఏడాది కాలంలోనే సూపర్ సిక్స్ హామీలు అమలు చేశాం. రైతులకు అన్నదాత సుఖీభవ కింద మొదటి విడతగా రూ.7 వేలు జమ చేశాం. గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ.1,640 కోట్ల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించింది. అన్నదాతలకు ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే నగదు చెల్లించాం. 80 శాతం రాయితీపై విత్తనాలను అందించాం. జగన్ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ శాఖను పూర్తిగా మూసివేసి మోసం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలను నిర్వీర్యం చేశారు" అని నిమ్మల రామానాయుడు విమర్శించారు.

# దీపావళికి శుభవార్త ఆశిస్తున్నాం

- ఉద్యోగ సంఘాల నేతలు



అమరావతి: ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రుల స్థాయిలో తొలిసారి జరిగిన సమావేశం ఇది. ఈ దీపావళికి ప్రభుత్వం నుంచి శుభవార్త ఆశిస్తున్నామని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటుతోపాటు పెండింగ్ డీఏలు చెల్లింపులు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ విధానం, దశల వారీగా సమస్యల పరిష్కారం వంటి వాటికి ఇవాళ మంత్రివర్గ ఉపసంఘంతో జరిగిన సమావేశం ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌ల నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఓ కార్యాచరణ రూపొందించే విధంగా కసరత్తు చేపట్టారు. గత ప్రభుత్వ విధానాలకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపడాన్ని నేతలు స్వాగతించారు.

## 19 నుంచి 24 వరకు మంత్రి

# లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటన



అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్ ఆదివారం నుంచి ఈ నెల 24 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఆ దేశంలోని అధునాతన వర్సిటీల్లో బోధనా పద్ధతులపై అధ్యయనం చేయనున్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం చేయాలని రోడ్ షోలు నిర్వహించనున్నారు. విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. ఇందులో దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించనున్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, పాలసీ రూపకర్తలు, విద్యావేత్తలు పాల్గొననున్నారు.


### ఉక్రెయిన్ యుద్ధంపై దృష్టి

ఇక, హంగేరీలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీకి ట్రంప్ సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇందులో జెలెన్‌స్కీ కూడా పాల్గొంటారా అనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ట్రంప్ తెలిపారు. అయితే, అలా జరిగితే అది మంచి సమావేశం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఇదిలాఉండగా.. యుద్ధం ముగింపునకు సమయం ఆసన్నమైందని ట్రంప్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ పేర్కొన్నారు. కీలక అంశాలపై ఇద్దరం చర్చలు జరిపామన్నారు.

## పాకిస్థాన్, అఫ్గాన్ మధ్య

# ఘర్షణలు

### ఆపడం నాకు చాలా తేలిక: ట్రంప్



కాల్పుల విరమణ అనంతరం పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ మధ్య ఘర్షణలు భగ్గుమన్నాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాటి మధ్య సంఘర్షణలను ఆపడం తనకు తేలికన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కలిసి ట్రంప్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాక్- అఫ్గాన్ మధ్య నెలకొన్న ఘర్షణల గురించి ప్రస్తావించారు. అఫ్గాన్‌పై పాక్ దాడి చేసిందనే విషయం తనకు అర్థమైందన్నారు. ఈ సంఘర్షణను పరిష్కరించాల్సి వస్తే.. అది తనకు చాలా సులభమన్నారు. అదే సమయంలో తాను యూఎస్‌ను పాలించాలన్నారు. అయినప్పటికీ.. యుద్ధాలను ఆపడం అంటే తనకు చాలా ఇష్టం అని వ్యాఖ్యానించారు. ఎందుకంటే ప్రజల ప్రాణాలు కోల్పోకుండా ఆపడం తనకు నచ్చుతుందన్నారు. ఈసందర్భంగా తాను ఇప్పటికే లక్షల మంది ప్రాణాలు కాపాడానని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా తాను ఎనిమిది యుద్ధాలు కొనసాగకుండా ముగించానని ట్రంప్ ఉద్ఘాటించారు. ఇదే క్రమంలో భారత్- పాక్ మధ్య ఘర్షణలను కూడా తానే ఆపానంటూ మరోసారి ప్రకటించుకున్నారు. ఎన్నింటిని ఆపినా తనకు నోబెల్ బహుమతి రావడం లేదని నిరాశ వ్యక్తంచేశారు. ఈ ఏడాదికి గాను నోబెల్ శాంతి బహుమతి అందుకున్న వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాదో గురించి కూడా ట్రంప్ ఇక్కడ ప్రస్తావించారు. ఆ అవార్డు ఒక అందమైన మహిళకు దక్కిందన్నారు. అయినా.. తాను ప్రాణాలను కాపాడటం మీదే శ్రద్ధ వహిస్తానన్నారు. పాక్- అఫ్గాన్‌ల మధ్య 48 గంటల కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కాల్పుల విరమణ పొడిగింపు, సమస్య పరిష్కారానికి ఇరుపక్షాలు దోహాలో సమావేశం కానున్నట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే ఇరుదేశాల బలగాల మధ్య ఘర్షణలు చోటు చేసుకోవడం గమనార్హం. పాక్టికా ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో పాక్ వైమానిక దాడులకు పాల్పడినట్లు తాలిబన్లు తెలిపారు. ఈ దాడుల నేపథ్యంలో ఇరుపక్షాల మధ్య ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం వీగిపోయిందన్నారు.

**యుద్ధం ఆపండి: జెలెన్‌స్కీతో భేటీ అనంతరం ట్రంప్**

ఉక్రెయిన్-రష్యాల యుద్ధం ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కట్టుబడి ఉన్నారు. ఈ క్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అనంతరం ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాలు వెంటనే యుద్ధం ముగించాలని పిలుపునిచ్చారు. యుద్ధం ముగింపు అంశంపై వైట్‌హౌస్‌లో జెలెన్‌స్కీతో ట్రంప్ సుదీర్ఘంగా చర్చలు జరిపారు.

# నింగిలోకి శాటిలైట్ల ప్రయోగం



అమరావతి: గుంటూరు జిల్లా తాడేపల్లి సమీపంలోని వడ్డేశ్వరం కేఎల్ వర్సిటీలో శనివారం ఉదయం మూడు శాటిలైట్లను నింగిలోకి ప్రయోగించారు. వర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం (ఈసీఈ)లోని 34 మంది విద్యార్థులు.. సీహెచ్ కావ్య, కె.శరత్‌కుమార్ అధ్యాపక బృందం ఆధ్వర్యంలో వీటిని రూపొందించారు. లాంచ్‌ప్యాడ్‌గా గ్రీన్‌ఫీల్డ్ క్యాంపస్‌లోని క్రికెట్ మైదానాన్ని ఉపయోగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొన్నారు. ఈ శాటిలైట్‌ను క్రెడిట్‌కార్డు పరిమాణంలో పికో బలూన్ నమూనాతో తయారు చేశారు.

# నైపుణ్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళాసాధికారత కేంద్రం లో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు...ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అన్ని రంగాల్లో శిక్షణ ఇచ్చి నిపుణులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో 2015లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి అనేక మంది యువతకు శిక్షణ ఇస్తే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపి ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ను నిర్వీర్యం చేయడమే కాకుండా, నైపుణ్యాభివృద్ధి సంస్థలో భారీ కుంభకోణం జరిగిందంటూ తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబు ను అరెస్ట్ చేశారన్నారు...అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతి యువకులకు ఉచిత శిక్షణలు ఇప్పూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఎన్.టీ.ఆర్ మహిళా నైపుణ్యాభివృద్ధి మరియు సాధికారత కేంద్రం జిల్లా మేనేజర్ అంజనీ భూషణ్, టీడీపీ బీ.సీ కన్వీనర్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వొకేషనల్ కళాశాలలో "స్వర్ణ ఆంధ్ర

– స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం



కర్నూలు,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): కర్నూలు, బి-క్యాంప్, ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో మూడవ శనివారం సందర్భంగా "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసంగిస్తూ స్వచ్ఛత పట్ల ప్రతి పౌరుడి బాధ్యతను గుర్తుచేసే ఉద్దేశ్యంతో కార్యక్రమం నిర్వహించడమైనదని, విద్యార్థులు "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" తీసుకుని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలని , ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" ఉద్యమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కలిగించడం ప్రధాన లక్ష్యమని, విద్యార్థులలో స్వచ్ఛత అలవాటు పెంపొందితే సమాజం అభివృద్ధి చెందుతుందని , విద్యార్థులు తమ ఇళ్లలో, పరిసరాల్లో, గ్రామాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రిన్సిపాల్ సూచించారు. "పరిశుభ్రమైన పర్యావరణం ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల లెక్చరర్స్ , విద్యార్థులు, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసారు. కార్యక్రమం లో కళాశాల లెక్చరర్స్ మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు .

# 74 ఏళ్ల మహిళను తిరిగి నడిపించిన వైద్యులు

- వెన్నెముకలో దీర్ఘకాలంగా కంప్రెషన్ ఫ్రాక్చర్లు
- 19 స్క్రూలతో 6 గంటల పాటు సుదీర్ఘ శస్త్రచికిత్స
- కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్సతో కోలుకున్న వృద్ధురాలు



కర్నూలు,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):గుంతకల్లుకు చెందిన 74 ఏళ్ల సాలమ్మ అనే వృద్ధురాలు గత కొన్ని నెలలుగా తీవ్రమైన నడుం నొప్పితో అసలు నడవలేకపోతున్నారు. రెండు కాళ్లలోకి కూడా నొప్పి వ్యాపించడంతో ఐదునిమిషాల కంటే కూర్చోవడం, నిలబడడం కూడా ఆమెకు కష్టమైపోతోంది. ఐదేళ్లుగా ఆమెకు అప్పుడప్పుడు నొప్పి వచ్చేది. ఏడాది నుంచి చిన్న చిన్న దూరాలు నడిచేవారు. మూడు నెలలుగా పూర్తిగా మంచానికే పరిమితం అయ్యారు. ఎక్కడికైనా వెళ్లాలంటే వీల్ ఛైర్ వాడక తప్పని పరిస్థితి ఏర్పడింది.ఇలాంటి స్థితిలో ఆమెను కుటుంబసభ్యులు కర్నూలు కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ ఆమెను పరీక్షించి, శస్త్రచికిత్స చేసిన కన్సల్టెంట్ స్పైన్ సర్జన్ డాక్టర్ షేక్ మన్నన్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను తెలిపారు. "ఆమెకు అన్నిరకాల పరీక్షలు, ఎంఆర్ఐ స్కానింగ్ లాంటివి చేసిన తర్వాత.. చాలాకాలం నుంచి ఆమెకు వెన్నెముకలోని డి11, డి12 భాగం వద్ద దీర్ఘకాలంగా కంప్రెషన్ ఫ్రాక్చర్లు ఉన్నాయని తేలింది. దీనివల్ల ఆమెకు మిగిలిన భాగాలు కూడా అరిగిపోతూ క్రమంగా వెన్ను వంగిపోయి గూని రావడం మొదలైంది. ఇది ఎల్4–ఎల్5, ఎల్5–ఎస్1 వద్ద ఉంది. దీంతో ఆమె వెన్నెముకకు శస్త్రచికిత్స చేసి పరిస్థితిని నయం చేయాలని నిర్ణయించాం. ఇందుకోసం ఆరు గంటల పాటు సుదీర్ఘమైన, సంక్లిష్ట శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ఈ ప్రక్రియలో భాగంగా ఏకంగా 19 స్క్రూలను ఉపయోగించి, ఆమె వెన్నెముకను మళ్లీ నిటారుగా చేశాం. అంతకుముందు వంగిపోయిన వెన్నెముక మొత్తాన్ని సరిచేసి, దాన్ని మళ్లీ సాధారణ స్థితికి తీసుకురాగలిగాం. ఐదు రోజులు మాత్రమే ఆస్పత్రిలో ఉన్నారు. తర్వాత ఆమె పరిస్థితి బాగుండడంతో డిశ్చార్జి చేశాం. సాలమ్మకు చేసిన శస్త్రచికిత్సల్లో పూర్తిగా టైటానియం, డ్యూయల్ థ్రెడెడ్ స్క్రూలు ఉపయోగించాం. వీటిని ఇక తీయాల్సిన అవసరం ఉండదు. వాటివల్ల ఇన్ఫెక్షన్ ఉండదు, ఎంఆర్ఐ తీయడానికి కూడా వీటితో ఎలాంటి ఇబ్బంది ఉండబోదు. రెండేళ్ల తర్వాత అవసరం అయితే వాటిని తీసేయొచ్చు కూడా. శస్త్రచికిత్స తర్వాత సాలమ్మ పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. ఆమె ఇప్పుడు దాదాపు గంటకు పైగా చాలా సులభంగా కూర్చోగలుగుతున్నారు. కాళ్లనొప్పులు పూర్తిగా తగ్గిపోయాయి. లేచి తిరుగుతున్నారు కూడా. అయితే, ఆమె ఎముకలు బాగా బలహీనంగా ఉండడంతో రెండు నెలల పాటు నడవొద్దని సూచించాం. అంతవరకు ఆమెకు మందులు ఇచ్చి, ఎముకలకు బలం వచ్చేలా చూస్తున్నాం. ప్రస్తుతం ఆమె గుంతకల్లులోని తమ ఇంట్లో ఫిజియోథెరపీ చేయించుకుంటున్నారు. కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలో ఉన్న అత్యాధునిక శస్త్రచికిత్స పరికరాల కారణంగా ఎలాంటి సంక్లిష్టమైన కేసులకైనా ఇక్కడ పూర్తి పరిష్కారం దొరుకుతుంది" అని డాక్టర్ షేక్ మన్నన్ వివరించారు.

# "సూపర్ జి.ఎస్.టి. సూపర్ సేవింగ్స్" పోటీల్లో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి,, విద్యాశాఖామంత్రి

- అవార్డు పొందిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ఖుషి మహమ్మద్ ను అభినందించిన
- ప్రిన్సిపల్ కళాశాల బోధన బోధ నేతర సిబ్బంది

కడప,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):"సూపర్ జి.ఎస్.టి.- సూపర్ సేవింగ్స్" పోటీల్లో సత్తా చాటిన కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి) (ఆర్ట్స్ కళాశాల) మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఖుషి మహమ్మద్ ను ప్రిన్సిపాల్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందిస్తూ పత్రికా ప్రకటన చేసారు. ఈ నెల 16వ తేదీన కళాశాల తరపున మన దేశ గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ లను కలిసి కర్నూలులో జరిగిన "సూపర్ జి.ఎస్.టి.-సూపర్ సేవింగ్స్" విజయోత్సవాల్లో పాల్గొని, ఆ



పోటీల్లో తన సత్తా చాటి, వారిచేత ఉత్తమ విద్యార్థిగా అభినందనలు పొందిన ఖుషి మహమ్మద్ ను (మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని) కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.రవీంద్రనాథ్ అభినందించారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు కలిసి ఆ విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.రమేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమణ రావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ 24 న ఏఐఎస్ఎఫ్ మొదటి జిల్లా మహాసభను జయప్రదం చేయండి

### -జిల్లా కార్యదర్శి సిపి నాగేంద్ర కుమార్



కడప ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ మొదటి జిల్లా మహాసభ అక్టోబర్ 24 జయప్రదం చేయాలని అని జిల్లా కార్యదర్శి సిపి నాగేంద్ర కుమార్ కరపకాన్ని విడుదల చేయడం జరిగినది. పోరుమామిళ్ల నియోజకవర్గం బి కోడూరు మండలం విద్యార్థు లను కరపత్రం రిలీజ్ చేసి సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు పడుతున్నటువంటి కష్టాలు ప్రభుత్వాన్ని ఏమాత్రం పట్టించుకో కుండా నడుచుకోవడం అన్యాయం అని తెలిపారు పి పి పి పేరుతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం ఏమాత్రం న్యాయమని అన్నారు ఫ్లీజ్ రిమాండ్మెంట్ విడుదల చేయకుండా పేద విద్యార్థులకు ఆడుకోవడం ఏమన్నా న్యాయమా అని అన్నారు. జీవో నెంబర్ 77 నుంచి వచ్చి పేద విద్యార్థుల న్యాయం చేశారు విద్యాశాఖ మంత్రి యువకులం పాదయాత్రలో మేము అధికారంలోకి వస్తాను విద్యారంగా సమస్యలు అన్ని పరిష్కరిస్తామని చెప్పి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన ఏమాత్రం పట్టించుకోవడం ఇప్పటికైనా విద్యార్థులు పడుతున్నటువంటి కష్టాలు దృష్టిలో పెట్టుకొని నడుచుకొనవాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్యత విద్యార్థులను చైతన్యవంతులుగా చేసి కార్యక్రమాలు చేపడతామని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎన్ఎస్ఎస్ స్పెషలిటీ మూడవరోజు సాంకేతిక అక్షరాస్యత పై అవగాహన సదస్సు




కడప ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులతో కడప నగరంలోని రైల్వే కాలనీ మేరీ నగర్ లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సాంకేతికత అక్షరాస్యతపై కాలనీ వాసులకు విద్యార్థులు డిజిటల్ పేమెంట్ ఫోన్ పే, వాట్సాప్, యూట్యూబ్, కంప్యూటర్, ఈ-మెయిల్ ఇంటర్నెట్,సోషల్ మీడియా మొబైల్ ఇంటర్నెట్ డిజిటల్ పరికరాలను సరిగ్గా ఉపయోగించడం గురించి కాలనీవాసులకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించడమైనదని ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ చెప్పలి రాజరావు తెలిపారు శనివారం సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ విద్య సాంకేతిక పరిజ్ఞానం ఈ గవర్నెన్స్ గ్రామీణ ప్రాంతాల్లో అలవర్చుకోవాలని తెలపడం అయినది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు కాలనీవాసులు పాల్గొనడం జరిగినది.

# పర్యావరణానికి హాని కలిగించే వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి



కర్నూలు ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): పర్యావరణానికి హాని కలిగించే వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి పేర్కొన్నారు.శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరం లోని ఏ క్యాంప్ మున్సిపల్ పార్క్ లో జిల్లా కలెక్టర్ మొక్కను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాయు కాలుష్యం వల్ల మానవ ఆరోగ్యం తో పాటు పర్యావరణంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.. అందువల్లే రాష్ట్ర ప్రభుత్వం "క్లీన్ ఎయిర్" (స్వచ్ఛమైన గాలి) అన్న థీమ్ తో ఈ వారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని కలెక్టర్ పిలుపు ఇచ్చారు. పరిశ్రమల నుండి వెలువడే వాయువులు, వాహనాల నుండి వెలువడే పొగలు, వ్యర్థాలను కాల్చడం వంటి ప్రక్రియల ద్వారా వాయు కాలుష్యం ఏర్పడుతుందని,వీటిని తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. దగ్గరి ప్రదేశాలకు వెళ్ళడానికి కాలి నడక, సైక్లింగ్ ను అలవాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, ఇంచార్జ్ ఎస్ ఈ శేష సాయి తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన జీఎస్టీపై రవాణాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ



జగ్గంపేట,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం జగ్గంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాకినాడ రవాణాశాఖ ఇన్ స్పెక్టర్ కాశీవిశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జగ్గంపేటలోని అన్ని ద్విచక్ర వాహనాల షోరూం యాజమాన్యం, సిబ్బందితో కలిసి తగ్గిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. జగ్గంపేట శ్రీ వినాయక మోటార్స్ హీరో షోరూం నుండి మెయిన్ రోడ్డు వరకు ఈ ర్యాలీ జరిగింది. ద్విచక్ర వాహనాలపై గతంలో ఎంతమేర జీఎస్టీ ఉండేది, ప్రస్తుతం ఎంత జీఎస్టీ తగ్గిందనే దానిపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హీరో షోరూం వెలమర్తి సూర్యచంద్రరమేష్, నక్కిన దొరబాబు, హోండా షోరూం రొంగల వెంకటరమణ, సుజుకి పి.శ్రీనివాస్, టీవీఎస్ శ్రీధర్, బజాజ్ రామకృష్ణ, లంక వసంత్, గెద్ద దుర్గాప్రసాద్, స్వామి, రాము, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్యకరమైన జీవనం

### -ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



అవనిగడ్డ అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం అవనిగడ్డలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. ఉపాధి పథకం ఆధ్వర్యంలో కాలుష్య రహిత వాతావరణానికి సైకిలింగ్ ఆవశ్యకత ప్రచారం చేస్తూ చేపట్టిన సైకిల్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల కొనుగోలుపై జీఎస్టీ తగ్గింపు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించే బైక్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకటగిరి, టీడీపీ మోపిదేవి మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, తహసీల్దార్ కే.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీఓ మరియాదేవి, ఎంఈఓలు అన్నపరెడ్డి పిచ్చియ్య, సనకా శ్రీకాంత్, రవాణా శాఖ అధికారి లోకనాథ ప్రసాద్, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వీఏసీఎస్ చైర్మన్ యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు, పంచాయతీ ఈఓ తోట శ్రీనివాసరావు, డాక్టర్ వంగర శేషగిరి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ దీవి శ్రీను, రెడ్ క్రాస్ ప్రతినిధులు, ఉపాధి సిబ్బంది, జీఎస్టీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వాయు కాలుష్య నిర్మూలనలో సైకిల్ వాడకం కీలకం

- నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్



కర్నూలు ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): వాయు కాలుష్య నిర్మూలనలో సైకిల్ వాడకం కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ నుండి రాజ్ విహార్ వరకు 'క్లీన్ ఎయిర్' అంశంపై సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అలాగే నగరపాలక కార్యాలయంలో సైకిల్ వాడడం వలన కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకత, స్వచ్ఛమైన వాతావరణం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర వంటి అంశాలపై వివరించారు. అధికారులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలతో కలిసి కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వాయు కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, ఢిల్లీ లాంటి మహా నగరాల్లో కాలుష్య నివారణకు చేపట్టిన చర్యలు ప్రజలందరూ గమనించాలన్నారు. వ్యక్తిగతంగా సైకిల్ వాడకాన్ని అలవాటు చేసుకుంటే వాహనాల వలన ఉత్పత్తి అయ్యే కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని, ఇది కేవలం పర్యావరణానికి మాత్రమే కాదు, వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా ఎంతో మేలును చేస్తుందని తెలిపారు. ప్రతి పౌరుడు సైకిల్ వాడకానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమాజాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా మార్చడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ యన్.చిన్నరాముడు, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, డిసిపి వెంకటరమణ, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, సిఎంఎం భాస్కర్ రెడ్డి, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల విజయోత్సవ మహా సభను జయప్రదం చేయండి

- ఈనెల 25వ తేది న మహాసభను ప్రతి ఒక్కరు మాదిగ జాతి బిడ్డలు జయప్రదం చేయండి
- ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు



కర్నూలు, అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):కర్నూలు జిల్లా రాజ్ విహార్ సెంటర్ అంబేద్కర్ భవనం నందు అక్టోబర్ 25వ తేదీన నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ లో జరగబోయే ఏపీ ఎమ్మార్పీఎస్ 12వ వార్షికోత్సవం మరియు ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ మహాసభ కరపత్రాలు ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేయడం జరిగింది. అనంతరం విలేకర్ల సమావేశంలో సూరిబాబు, ధరూర్ గోపి, భైరాపురం రాజు మాట్లాడుతూ నంద్యాలలో జరగబోయే ఎమ్మార్పీఎస్ విజయోత్సవ మహాసభ కు కర్నూలు జిల్లా నుండి పెద్ద ఎత్తున జన సమీకరణ సేకరించి గ్రామ, మండల,జిల్లా నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని 12వ వార్షికోత్సవం మరియు ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ విజయవంతం చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్. ఎం. డి. ఫరుక్ మైనార్టీ%ఁ% న్యాయశాఖ మంత్రివర్యులు, నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి , మాదిగ సామాజిక వర్గానికి చెందిన కోడుమూరు నియోజకవర్గ శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి , పత్తిపాడు నియోజకవర్గ శాసనసభలు డాక్టర్ బూర్ల రామాంజనేయులు , సింగనమల నియోజకవర్గం శాసన సభ్యురాలు బండారు శ్రావణి , మడకశిర నియోజకవర్గ శాసనసభ్యులు యం. ఎస్. రాజు , నందికొట్కూరు నియోజకవర్గం శాసనసభ్యులు గీత్త జయసూర్య పాల్గొంటారని తెలపడం జరిగిగింది. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు,రెడ్డి పోగు రాజశేఖర్, బడదల దస్తగిరి,తిరుమలేశు,మీసాల దాసు రావు,ఇసాక్ తదితర ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పాలుగోన్నారు.

# తనపై విమర్శలు చేసిన వారి విధంగా పార్టీలు మారినని

### -టిడిపి అసంతృప్తి నేత మబ్బుల్లా



కడప,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):తనపై విమర్శలు చేసిన వారి విధంగా తాము పార్టీలు మారనని, మరణించే వరకు టీడీపీలో కొనసాగుతానని టీడీపీ అసంతృప్తి నేత మాబుల్లా తెలిపారు.కడపలోని టీడీపీ మైనార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇతర అసంతృప్తి నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. తాను వైసీపీ నేతలు అంజద్‌బాష, రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి ఉన్న ఫోటోను చూపించి సందర్భాన్ని తెలుసుకోకుండా మాట్లాడటం తగదన్నారు. 2018లో రంజాన్ మాసంలో తాను కువైట్‌లో ఉన్న సమయంలో వైసీపీ నేతలు ఇఫ్తార్ విందుకు వచ్చి వైసీపీ కండువా వేసుకుంటే మీ ఆతిథ్యాన్ని స్వీకరిస్తామని చెప్పడంతో అప్పటికప్పుడు ఆ పార్టీ కండువా వేశారన్నారు. అయితే కార్యక్రమం ముగిసిన తర్వాత వైసీపీ కండువా తీసివేస్తూ తాను టీడీపీలోనే ఉంటానని, మరణించేవరకు పార్టీని వీడేది లేదని వారికి స్పష్టం చేశానన్నారు. తనను విమర్శించిన టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్‌తోపాటు ఆయన తండ్రి ఖాసింఖాన్ రాజకీయ చరిత్ర అందరికీ తెలిసిందేనని తెలిపారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కార్పొరేటర్లు తొలుత రాజీనామా చేసి మాట్లాడాలన్నారు. వైసీపీ నేతలు టీడీపీని భ్రష్టు పట్టించేందుకు ఆయా నేతలను టీడీపీలోకి పంపినట్లు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. దివంగత వైఎస్సార్ సీఎం అయ్యాక తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని, ఆయన మరణం తర్వాత వైఎస్ జగన్ వద్దకు వెళ్లలేక టీడీపీ కండువా కప్పుకుని నేటి వరకు కొనసాగుతున్నానని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ 47వ డివిజన్ ఇంచార్జ్ జనార్దన్ రెడ్డి, మాజీ షాప్ డైరెక్టర్ జయచంద్ర, డైరెక్టర్ వహీద్ ఆసిఫ్, 31, 32, 35, 39 డివిజన్ల ఇన్చార్జిలో ఆరిఫ్ ఖాన్, ఆజాద్ అహ్మద్, చాంద్ భాషా, మహమ్మద్, తదితర అంసతృప్తి నేతలు పాల్గొన్నారు.

# జాతీయం – అంతర్జాతీయం

## భారత్, అఫ్గన్‌తో ఏకకాలంలో రెండు యుద్ధాలకు రెడీ..



దాయాది పాకిస్థాన్ మరోసారి కవ్వింపులకు దిగింది. అఫ్గనిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ప్రస్తుతం కొనసాగుతోన్న ఘర్షణలను భారత్‌తో ముడిపెట్టింది. సరిహద్దుల్లో భారత్ కపటంగా వ్యవహరించే అవకాశాలున్నాయని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ కారుకూతలు కూశారు. అఫ్గన్‌తో సరిహద్దుల్లో ఉద్రిక్తతల వేళ ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాక్ రక్షణ మంత్రికి.. ఇండియాతోనూ ఉద్రిక్తతలు పెరిగితే ఎలా? అనే ప్రశ్న ఎదురయ్యింది. దీనికి 'అవును.. దీన్ని కొట్టిపారేయలేం. ఏకకాలంలో రెండు యుద్ధాలను ఎదుర్కొడానికి మేము సిద్ధంగా ఉన్నాం... దీనికి మా దగ్గర వ్యూహాలు ఉన్నాయి. ప్రస్తుతం వాటి గురించి నేను చర్చించను" అని పాకిస్థాన్ రక్షణ మంత్రి అసిఫ్ సమాధానం ఇచ్చారు. ఈ క్రమంలోనే భారత్‌పై పాక్ మంత్రి నోరుపారేసుకున్నారు. సరిహద్దుల్లో భారత్ డర్టీ గేమ్స్ ప్లే చేస్తుందని పిచ్చివాగుడు వాగారు. అలాగే పాకిస్థాన్‌లోని అఫ్గన్ శరణార్థులపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'వారివల్ల మా దేశానికి ఎలాంటి ప్రయోజనం లేకపోగా ఉగ్రవాద చర్యలకు తెగబడుతున్నారు. పాకిస్థాన్‌లో అక్రమంగా నివసిస్తున్న అఫ్గన్లను గుర్తిస్తున్నాం. తక్షణమే వారు మా దేశాన్ని వీడాలి" అని హెచ్చరించారు. భారత్‌పై పాకిస్థాన్ రక్షణ మంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. తాలిబన్లను ముందుండి భారత్ నడిపిస్తోందని ఆరోపణలు చేశారు. సరిహద్దుల్లో అఫ్గన్, పాక్ పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇరు దేశాలకు ప్రాణనష్టం సంభవించింది. తాలిబన్ మంత్రి తొలిసారి భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో కాబూల్ సహా అఫ్గన్‌లోని పలుచోట్ల పాకిస్థాన్ వైమానిక దాడులు చేసింది. దీనికి ప్రతీకారంగా అఫ్గన్ సరిహద్దుల్లోని పాకిస్థాన్ సైనిక స్థావరాలపై తాలిబన్లు విరుచుకుపడ్డారు. అయితే, అఫ్గన్ విదేశాంగ మంత్రి ఢిల్లీలో ఉన్నారని, భారత ఆదేశాల ప్రకారమే తమపై దాడులు జరిగాయని దాయాది ఆరోపించింది. తమపై తాలిబన్లతో భారత్ పరోక్షంగా యుద్ధం చేయిస్తోందని ఖ్వాజా ఆసిఫ్ విమర్శించారు.

## మడగాస్కర్ అధ్యక్షుడిగా ఆర్మీ కల్నల్ మైఖేల్ రాండ్రియానిరినా ప్రమాణస్వీకారం



సైనిక తిరుగుబాటుతో అధికారాన్ని చేజిక్కించుకున్న ఆర్మీ కల్నల్ మైఖేల్ రాండ్రియానిరినా మడగాస్కర్ కొత్త ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయనను న్నారు. మడగాస్కర్ రాజ్యాంగన్యాయ స్థానం శుక్రవారం ఒక వేడుకలో కల్నల్ మైఖేల్ రాండ్రియానిరినా నియామకాన్ని అధికారికంగా ఆమోదించింది. దేశ ఉన్నత రాజ్యాంగ న్యాయస్థానంలో ప్రమాణ స్వీకారం చేస్తారని రాష్ట్రమీడియా ఒక ప్రకటనలో తెలిపింది. విద్యుత్, నీటి కొరతపై యువత చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘర్షణల్లో 22మంది మరణించగా, సుమారు 100మందికి పైగా గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి నివేదించింది. ప్రజా తిరుగుబాటుతో సైన్యం అధికారాన్ని స్వాధీనం చేసుకోవడంతో మాజీ అధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా దేశం నుండి పారిపోయిన సంగతి తెలిసిందే. విధులను విడిచిపెట్టడంతో రాజోలీనాను అభిశంసించిన గందరగోళ పరిస్థితుల్లో .. మూడు రోజులకే సైన్యాధికారి అధ్యక్ష పదవి చేపట్టడం గమనార్హం. మూడువారాల యువత ప్రభుత్వ వ్యతిరేక నిరసనల తర్వాత దేశాన్ని సైన్యం స్వాధీనం చేసుకోవడాన్ని ఐక్యరాజ్యసమితి ఖండించింది. మడగాస్కర్‌ను ఆఫ్రికన్ యూనియన్ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. సైనికులతో తన ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ దేశాన్ని విడిచిపెట్టిన అధ్యక్షుడు ఆండ్రీ రాజోలినా ప్రస్తుతం ఎక్కడ ఉన్నదీ వివరాలు తెలియదు.

## దేశంలో మావోయిస్టు ఉగ్రవాదాన్ని త్వరలోనే అంతం చేస్తాం



న్యూఢిల్లీ: భారతదేశం త్వరలోనే మావోయిస్టు ఉగ్రవాదం నుంచి పూర్తి విముక్తి పొందుతుందని, ఇది తన వ్యక్తిగత గ్యారెంటీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మావోయిస్టుల హింస ముగింపు దశకు చేరుకుందని ఆయన స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. దశాబ్దాలుగా అభివృద్ధిని అడ్డుకుంటూ, పేద గిరిజనులు, రైతులు, గ్రామస్థుల ప్రాణాలను బలిగొంటున్న మావోయిస్టు హింసపై ప్రధాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొందరు బాధితులు ఢిల్లీ వచ్చి, తమ గోడును వినిపించుకోవడానికి ఏడు రోజులు పడిగాపులు కాశారని గుర్తుచేశారు. వారిలో కాళ్లు, చేతులు కోల్పోయిన వారు కూడా ఉన్నారని చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో 'అర్బన్ నక్సల్స్' రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకుని మావోయిస్టుల దారుణాలను కప్పిపుచ్చారని మోదీ ఆరోపించారు. ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల వల్ల మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గిందని ప్రధాని తెలిపారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా 125 జిల్లాల్లో ఉన్న మావోయిస్టుల ప్రభావం, ఇప్పుడు కేవలం 11 జిల్లాలకే పరిమితమైందని వివరించారు. వాటిలో కూడా అత్యంత తీవ్రంగా ప్రభావితమైనవి కేవలం 3 జిల్లాలు మాత్రమేనని స్పష్టం చేశారు. గడిచిన 72 గంటల్లోనే 303 మంది నక్సలైట్లు లొంగిపోయారని, వీరిలో రూ.1 కోటి వరకు రివార్డు ఉన్న కీలక నేతలు కూడా ఉన్నారని వెల్లడించారు. "వీరంతా సాధారణ నక్సలైట్లు కాదు. వారంతా ఇప్పుడు రాజ్యాంగంపై నమ్మకంతో జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నారు" అని మోదీ అన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, భద్రతకు పెద్దపీట వేయడం వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు.

## ఒకేసారి 24 మంది ట్రాన్స్‌జెండర్ల ఆత్మహత్యాయత్నం

ఒకేసారి 24 మంది ట్రాన్స్‌జెండర్లు ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఈ దిగ్భ్రాంతికరమైన సంఘటనలో ఇండోర్ లో చోటు చేసుకుంది. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి చెందిన 24 మంది ఫ్లోర్ క్లీనర్‌ను తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మూడు నెలల క్రితం జర్నలిస్టులుగా నటిస్తూ ఒక ట్రాన్స్‌జెండర్ వ్యక్తిపై అత్యాచారం చేసి, బ్లాక్‌మెయిల్ చేసినట్లు ట్రాన్స్ జెండర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్షయ్ కుమావున్, పంకజ్ జైన్ అనే ఇద్దరు వ్యక్తులపై అత్యాచారం, దోపిడీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. అయితే పోలీసు అధికారులు మాత్రం వారి ఫిర్యాదులపై సరిగ్గా స్పందించలేదు. అధికారిక ఫిర్యాదు చేసినప్పటికీ, తాము ఆలస్యంగా స్పందించడంతో నిందితుల నుంచి తాము వేధింపులు ఎదుర్కొన్నామని బాధితులు ఆరోపించారు. అలాగే వారు సామూహికంగా వెళ్లి పోలీసులను తమ ఫిర్యాదులపై ఎందుకు స్పందించలేదని నిలదీశారు. అయితే పోలీసులు సమాధానం వారిని నిరాశకు గురిచేసింది. దీంతో తమ వారికి జరిగిన అన్యాయానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. 24 మంది ట్రాన్స్‌జెండర్లు తమతో తెచ్చుకున్న ఫ్లోర్ క్లీనర్ లిక్విడ్ తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశారు.

## కొత్త బిల్లు తీసుకొచ్చిన సెనెట్ అమెరికాలో ట్రక్కు డ్రైవర్లకు ఇంగ్లీష్ కష్టాలు

అమెరికా రోడ్లు అంటేనే పెద్ద పెద్ద ట్రక్కులు, వేగంగా దూసుకుపోయే వాహనాలు. అక్కడి రోడ్లు మొత్తం గుంతలు లేకుండా ఉండటంతో రయ్‌మంటూ దూసుకెళ్తుంటాయి. దీంతో ట్రక్కు డ్రైవర్లకు సరికొత్త కష్టాలు వచ్చాయి. ఇంగ్లీష్ రాకుండా బాధపడుతూ ఉండే ట్రక్కు డ్రైవర్లకు అమెరికాలో ఇప్పుడు కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. అయితే.. ఇటీవల ఫ్లోరిడా టర్న్‌పైక్ మీద జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదం.. ఇప్పుడు దేశం దృష్టిని మొత్తం అటు వైపు తిప్పింది. ఆ యాక్సిడెంట్‌కు అసలు కారణం ఏంటని అధికారులు ఆరా తీయగా.. అసలు ఆ ప్రమాదం చేసిన ట్రక్కు డ్రైవర్‌కు సరిగా ఇంగ్లీష్ రాదు అనే విషయం బయటికి వచ్చింది. రోడ్డు మీద ఉండే ట్రాఫిక్ గుర్తులు అర్థం చేసుకోలేక.. వాటిని కమ్యూనికేట్ చేయలేక పోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని తేలింది. ఈ ఘటనను అమెరికా సెనెట్ తీవ్రంగా తీసుకుంది. ట్రక్కు డ్రైవర్లకు ఇంగ్లీష్ భాషలో పట్టు ఉండాల్సిందేనని కొత్త బిల్లు తెచ్చింది. అంటే ఇక నుంచి ఇంగ్లీష్‌తో ఆడుకోవడానికి లేదు అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చేసింది. ఈ బిల్లు పాస్ అయితే.. దేశవ్యాప్తంగా కమర్షియల్ ట్రక్కు డ్రైవర్లు అందరూ మళ్లీ ఇంగ్లీష్ టెస్టులు రాయాల్సి వస్తుంది. ఈ టెస్ట్‌లో ఫెయిల్ అయితే.. అప్పటికప్పుడే అవుట్ ఆఫ్ సర్వీస్ అనే బోర్డు తగిలించేసి.. వారిని బండి నడపకుండా ఆపేస్తారు. అంటే వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తారు.

అయితే ఇది డ్రైవర్లపై వివక్షలా కొంతమందికి అనిపించవచ్చు.. కానీ ఇండస్ట్రీ లీడర్స్, సెనెటర్లు మాత్రం దీన్ని ఒక భద్రతా పరమైన విషయంగా చూస్తున్నారు. హైవేపై వెళ్తున్నపుడు.. పక్కన భారీ ట్రక్కు నడుపుతున్న డ్రైవర్‌కు ట్రాఫిక్ సైన్‌బోర్డులు ఏవి అర్థం కాకపోయినా.. యాక్సిడెంట్ జరిగితే పోలీసులు, అంబులెన్స్, ఫైర్ సిబ్బందితో మాట్లాడేందుకు భాష రాకపోతే అలాంటి పరిస్థితుల్లో ప్రాణాలకే ప్రమాదం కదా అంటూ ఈ బిల్లును సమర్థిస్తున్నవారు చెబుతున్నారు. బేసిక్ కమ్యూనికేషన్ స్కిల్స్, రోడ్డు నియమాలను అర్థం చేసుకోవడానికి ఇంగ్లీష్‌ను ఒక నాన్ నెగోషియబుల్ సేఫ్టీ అవసరంగా మార్చేశారు.

## జపాన్ మాజీ ప్రధాని తోమిచి మురయామా కన్నుమూత





శుక్రవారం జపాన్ మాజీ ప్రధాని తొమిచి మురయామా (101) కన్నుమూశారు. ఈ విషయాన్ని జపాన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ వెల్లడించింది. మురాయామా గత కొన్నిరోజులుగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. ఆయన నైరుతి జపాన్‌లోని తన స్వస్థలమైన ఒయిటాలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు జపాన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ అధిపతి మిజుహెూ ఫుకుషిమా ప్రకటనలో తెలిపారు. కాగా, తోమిచి మురయామా జపాన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ అధినేత. ఆయన జూన్ 1994 నుంచి జనవరి 1996 వరకు సంకీర్ణ ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు. రెండవ ప్రపంచ యుద్ధాన్ని ముగించిన జపాన్ బేషరతుగా లొంగిపోయి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా.. 1995 ఆగస్టు 15న తన దేశ దురాక్రమణకు గురైన ఆసియా బాధితులకు క్షమాపణలు చెబుతూ తొమిచి ప్రకటన చేశారు. ఈ ప్రకటన ద్వారా ఆయన ప్రసిద్ధి చెందారు. 2013 వరకు ఉన్న ప్రధానులు తోమిచి సంప్రదాయాన్ని కొనసాగించారు. యుద్ధ సమయంలో ఆసియా బాధితులకు అప్పటి ప్రధానులు క్షమాపణలు చెప్పారు. కానీ 2013లో అప్పటి ప్రధాని షింజో అబే మాత్రం పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పడం ఆపేశారు. దీనిపై ఆయన పలు విమర్శలు ఎదుర్కొన్నారు.

## మొజాంబిక్‌లో ఘోర ప్రమాదం బోటు బోల్తా పడి ముగ్గురు భారతీయుల మృతి



మొజాంబిక్‌లోని బీరా పోర్టు తీరంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భారతీయులతో ప్రయాణిస్తున్న ఒక బోటు బోల్తా పడటంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. ఈ దురదృష్టకర సంఘటనను మొజాంబిక్‌లోని భారత హైకమిషన్ అధికారికంగా ధ్రువీకరించింది. సముద్రంలో లంగరు వేసి ఉన్న ఒక ఆయిల్ ట్యాంకర్‌లోకి సిబ్బందిని తరలించేందుకు 14 మంది భారతీయులతో ఒక బోటు బయలుదేరింది. శుక్రవారం బీరా పోర్టు సమీపంలో ఈ సిబ్బంది బదిలీ ప్రక్రియ జరుగుతుండగా, అనుకోని రీతిలో బోటు నీటిలో బోల్తా పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఆరుగురు భారతీయులను సురక్షితంగా కాపాడగలిగారు. వీరిలో ఒకరు ప్రస్తుతం బీరాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, మిగిలిన ఐదుగురు క్షేమంగా ఉన్నారని భారత హైకమిషన్ వెల్లడించింది. అయితే, ఈ ప్రమాదంలో ముగ్గురు భారతీయులు మరణించినట్లు పేర్కొంది. గల్లంతైన మరో ఐదుగురు సిబ్బంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపింది. "ఈ దురదృష్టకర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. మృతుల కుటుంబాలతో మేం టచ్‌లో ఉన్నాం. వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాం" అని భారత హైకమిషన్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక ప్రకటనలో పేర్కొంది. గల్లంతైన వారిని గుర్తించేందుకు స్థానిక సముద్రయాన ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నామని, హైకమిషన్‌కు చెందిన ఒక కాన్సులర్ అధికారి బీరాలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది.

### దర్బార్ బదిలీ పద్ధతిని పునరుద్ధరించనున్న ఒమర్ అబ్దుల్లా

జమ్మూ: దర్బార్ బదిలీ పద్ధతిని పునరుద్ధ రించనున్నట్లు జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రకటించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాల మేరకు నాలుగేళ్ళ పై నుండి ఈ పద్ధతిని నిలిపి






వేశారు. ఖర్చులు తగ్గించుకునేందుకే ఈ పద్ధతిని నిలిపివేసినా దీనివల్ల జమ్మూ ప్రాంతంలోని వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు కొంతమేరా దెబ్బ తిన్నాయి. 1872లో అప్పటి కాశ్మీర్ మహారాజు గులాబ్ సింగ్ ఈ దర్బార్ మూవ్‌ను ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి కింద సివిల్ సెక్రటేరియట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు వేసవి కాలంలో శ్రీనగర్ నుండి, శీతాకాలంలో జమ్మూ నుండి పనిచేస్తాయి. కానీ 2021లో దీన్ని లెఫ్టినెంట్ గవర్నర్ పాలనా యంత్రాంగం నిలిపివేసింది. దీనివల్ల దాదాపు రూ.200కోట్లు ఖజానాకు ఏటా మిగులుతున్నాయని పేర్కొంది. అయితే తాను అధికారంలోకి వస్తే ఈ పద్ధతిని మళ్లీ తీసుకువస్తానని ఒమర్ అబ్దుల్లా గతంలో హామీ ఇచ్చారు. గతేడాది డిసెంబరులో ఒమర్ దీనిపై స్పందిస్తూ, దర్బార్‌మూవ్‌ను పునరుద్ధరిస్తామని, జమ్మూకు గల ప్రాముఖ్యతను తగ్గిపోవడాన్ని అనుమతించబోమని చెప్పారు. డిప్యూటీ ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి కూడా ఈ ఆలోచనకు మద్దతిచ్చారు. దీనివల్ల జమ్మూ ఆర్థిక వ్యవస్థకు లాభాలు వుంటాయని అన్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో కేబినెట్ ఈ పద్ధతి పునరుద్ధ రణకు సిఫార్సు చేసిందని ముఖ్యమంత్రి చెప్పారు. ఆమోదం నిమిత్తం ఫైల్‌ను లెఫ్టినెంట్ గవర్నర్‌కు పంపారు.

### హిందూ యువతులపై కుట్ర జరుగుతోందన్న ఎమ్మెల్యే గోపీచంద్ పడాల్కర్

ముంబై: హిందూ అమ్మాయిలు జిమ్‌కు వెళ్లకూడదని మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే గోపీచంద్ పడాల్కర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. బీడ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, కళాశాలలకు వెళ్లే హిందూ



అమ్మాయిలు జిమ్‌లకు వెళ్లవద్దని, ఇంటి వద్దనే యోగా సాధన చేయాలని సూచించారు. హిందూ యువతులపై కుట్ర జరుగుతోందని, ఎవరిని విశ్వసించాలో వారికి తెలియని పరిస్థితి నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ అమ్మాయిలపై ఒక పెద్ద కుట్ర జరుగుతోంది. ఈ విషయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. ఎవరైనా బాగా మాట్లాడుతున్నారని లేదా మంచి వ్యక్తి అని మోసపోవద్దు. జిమ్‌లలో శిక్షణ ఇచ్చేవారు ఎవరు అనే విషయాన్ని గమనించాలి.

## ఎవరి సిద్ధాంతాలు వారికి ఉన్నప్పటికీ, ఉద్యోగులు నిబంధనలు పాటించాలని వ్యాఖ్య

బెంగళూరు: ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసిందని, వారిని సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయని వచ్చిన వార్తలను కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ధృవీకరించారు. తన శాఖలో ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ఉద్యోగులకు నోటీసులు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఎవరి సిద్ధాంతాలు వారికి ఉండవచ్చని, కానీ ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆరెస్సెస్, బీజేపీ జన సమీకరణ పేరుతో సమాజాన్ని విషపూరితం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ప్రాంగణాల్లో ఇక నుంచి ఎలాంటి సమావేశాలను నిర్వహించరాదని కర్ణాటక మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సంస్థల సమావేశాలు నిర్వహించకూడదని తాను ముఖ్యమంత్రికి లేఖ రాశానని ఖర్గే తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలకు సంబంధించిన కొత్త నిబంధనలను అమల్లోకి తెస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఇక నుంచి ఎలాంటి సమీకరణాలకు, సమావేశాలకైనా ముందస్తుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని అన్నారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహాత్మాగాంధీ వంటి గొప్ప వ్యక్తులనే ఆరెస్సెస్, బీజేపీ వాళ్లు లెక్కచేయనప్పుడు ఇక తాను ఎంత అని ప్రశ్నించారు. ప్రధాన అంశాల నుంచి దారి మళ్లించేందుకు బీజేపీ వ్యక్తిగత దాడులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. తనను వ్యక్తిగతంగా నిందించడానికి బదులు ఆరెస్సెస్ తరపున ఎందుకు మాట్లాడుతున్నారో బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరెస్సెస్ తరపున మాట్లాడేందుకు వాళ్లెవరు తనను తాను సమర్థించుకోలేదా అని ప్రశ్నించారు. ఆరెస్సెస్ కార్యక్రమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రభుత్వ అధికారులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు తటస్థంగా ఉండటాన్ని తప్పనిసరి చేస్తూ కర్ణాటక స్టేట్ సివిల్ సర్వీసెస్ రూల్స్–2021ను అమలు చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆయన కోరారు. ఇది తాను పెట్టిన నిబంధన కాదని, కర్ణాటక సివిల్ సర్వీసెస్ నిబంధన అని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ సంస్థలతో సంబంధం ఉన్న ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనరాదనే ఆ నిబంధన చెబుతోందని అన్నారు.

## డిజిటల్ అరెస్టుల పట్ల సుప్రీం తీవ్ర ఆందోళన

న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్టుల కేసులు పెరిగిపోతుండడం పట్ల సుప్రీం కోర్టు శుక్రవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముంబయి ఇడి అధికారి హెూదాలో ఫోర్జరీ చేసిన సీల్‌ను కలిగివున్న అరెస్టు ఉత్తర్వులను, ఫోర్జరీ చేసిన జ్యుడీషియల్ అధికారుల నిఘా ఉత్తర్వులను కూడా వారు చూపించడం పట్ల కోర్టు నివ్వెరపోయిందని బెంచ్ పేర్కొంది. ఫోర్జరీ చేసిన కోర్టు ఉత్తర్వులతో, డిజిటల్ అరెస్టు పేరుతో సాగిస్తున్న దురాగతాలను సుమోటోగా తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం దీనిపై కేంద్రం, సిబిఐ, హర్యానా ప్రభుత్వాల నుండి స్పందన కోరుతూ నోటీసులు జారీ చేసింది. 27న తదుపరి విచారణ చేపట్టేలోగా దర్యాప్తు స్థితిగతులపై నివేదికను అందజేయాలని ఆదేశించింది. హర్యానాలోని అంబాలాకు చెందిన 70ఏళ్ల మహిళ రాసిన లేఖ నేపథ్యంలో కోర్టు జోక్యం చేసుకుంది. సిబిఐ, ఇడి, జ్యుడీషియల్ అధికారులమని చెప్పుకుని కొంతమంది ఫోన్, వీడియో కాల్స్ చేసి, తనను, తన భర్తను డిజిటల్ అరెస్టు చేసి దాదాపుగా కోటిన్నర రూపాయిలు కాజేయడాన్ని ఆమె ఆ లేఖలో వివరించారు. ఫోర్జరీ చేసిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను చూపించారు. తమ జీవితకాలంలో దాచుకున్న మొత్తాలను వివిధ బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేసేలా ఒత్తిడి తీసుకొచ్చారని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. సాధారణ పరిస్థితుల్లో అయితే దర్యాప్తును వేగవంతం చేయాలనే రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేసే వారమని, ఈ కేసులో సుప్రీం కోర్టు పేరుతో అనేక బూటక జ్యుడీషియల్ పత్రాలను ఆ



మోసగాళ్ళు సంపాదించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా కఠిన కార్యాచరణ వుండాలని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల పోలీసు అధికారులు సంఘటితంగా కృషి చేయాలని పేర్కొంది.

## టీవీకే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదు..



న్యూఢిల్లీ: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి భారీ షాక్ తగిలింది. టీవీకే పార్టీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదని.. కేంద్ర ఎన్నికల సంఘం .. మద్రాస్ హైకోర్టుకు వెల్లడించింది. ప్రస్తుతం కరూర్ తొక్కిసలాటకు సంబంధించిన కేసు విచారణ జరుగుతుండగా.. టీవీకే పార్టీ గుర్తింపును రద్దు చేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా మద్రాస్ హైకోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. కొన్ని రోజుల క్రితం తమిళనాడులోని కరూర్ జిల్లాలో జరిగిన విజయ్ ప్రచార ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకోగా.. 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ నేపథ్యంలోనే విజయ్ టీవీకే పార్టీ గుర్తింపు రద్దు చేయాలని.. దీంతోపాటు రాజకీయ పార్టీల ప్రచార సభల్లో మహిళలు, చిన్నారులు పాల్గొనకుండా కఠిన ఆంక్షలు విధించాలని.. పలువురు మద్రాస్ హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు అయ్యాయి. వీటిని మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ.. జస్టిస్ జీ అరుల్ మరుగణ్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ఇక ఈ కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు తప్ప.. ఈ కేసులన్నింటినీ విచారణ జరిపేందుకు ఓ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా వాటన్నింటిని హైకోర్టు పాలనా వ్యవహారాల విభాగం ముందు ఉంచాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఇక టీవీకే పార్టీ గుర్తింపు రద్దు విషయానికి వస్తే.. ఇప్పటికీ ఆ పార్టీకి హెూదా లేనందున ఆ పిటిషన్ నిలబడదని ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ వెల్లడించారు.

## సంపాదకీయం

# ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఇసి

బీహార్‌లో భారత ఎన్నికల సంఘం(ఈ.సి.ఐ) ప్రారంభించిన ప్రత్యేక సమగ్ర పరిశీలన (సర్)ను సందర్భాన్ని బట్టి చూస్తే విపత్కర ప్రభావాలు చూపబోతుందని చెప్పడం దిగ్భ్రాంతి కలిగించవచ్చు.అయితే ఇప్పుడు ఆ ప్రభావాలేమిటో బహిర్గతమవుతున్న పరిస్థితి. జూన్25న ఈ ప్రక్రియను ప్రారంభించి కొద్దిరోజుల్లోనే దాని అసలు లక్ష్యం ఓటర్ల జాబితాల ప్రక్షాళనను మించి ఇంకా చాలా వుండబోతోందని స్పష్టమైంది. ఆ కసరత్తులో మూడు ప్రత్యేక లక్షణాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. మొదటిది ఈ ప్రక్రియలో అతను లేక ఆమె ఓటర్ల జాబితాలో తన పేరు వుంచాలంటే పౌరులు నిరూపణకు తమ ఆధారాలను తామే సమకూర్చుకునే బాధ్యత తీసుకోవాలి. గతంలోనైతే ఓటర్ల జాబితాల పున:పరిశీలన బాధ్యత ఇ.సి.ఐ నియమించిన ఎన్యూ మరేటర్లు నిర్వహించేవారు. కానీ ప్రస్తుత సందర్భంలోనైతే ఇప్పుడున్న లేక కాబోతున్న ఓటర్లు ఒక ఫారం సమర్పించడమే గాక ఇ.సి.ఐ నిర్దేశించిన పదకొండు పత్రాల్లో ఏదో ఒకటి చూపిం చాల్సి వుంటుంది. అధికార పత్రాల అందుబాటు స్థాయి చాలా తక్కువలోనే వుండే నేపథ్యంలో ఈ ప్రక్రియ పున:పరిశీలనకు గాక తొలగింపునకూ, తీసివేతకూ ఉద్దేశించబడిందని తేలిపోయింది. రాజ్యాంగం, తర్వాత వరుసగా అనేక సుప్రీంకోర్టు తీర్పులు గుర్తించిన సార్వత్రిక ఓటు హక్కు అనే సూత్రానికి తిలోదకాలు ఇస్తున్నట్టు అర్థమైంది. రండవ ప్రశ్న ఈ.సి.ఐ ఓటరు పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు బలవంతాన లాక్కుంటున్నదా? రాజ్యాంగం 326వ అధికరణం ప్రకారం ఓటరు హక్కుకు సంబంధించి పౌరసత్వంపై యథాలాపంగా చేసిన ప్రస్తావన ఆధారంగా ఈ వాదన తీసుకురాబడింది. పౌరసత్వం వుండాలనే ముందస్తు షరతుకు మినహాయింపు లేదు గానీ దాన్ని నిర్ధారించే బాధ్యత మాత్రం ఈ.సి.ఐది కాదు. ఈ విషయంలో హోం మంత్రిత్వ శాఖకు బాధ్యత అప్పగించబడింది. ఏమైనా 'సర్' తతంగం ఈ అవసరాన్ని తేలిగ్గా ఏకపక్షంగా తోసిపారేసింది. ఇక చివరగా కాలవ్యవధి. పెద్ద సంఖ్యలో వలస కార్మికులు జీవనోపాధి కోసం రాష్ట్రం వదలివెళ్లే బీహార్ వంటి రాష్ట్రంలో ఇచ్చిన ఈ కాలవ్యవధి చాలా స్వల్పం. అనేక ప్రాంతాల్లో వరద పరిస్థితుల వంటివి వుండగా వర్షా కాలంలో ఈ కసరత్తుకు అతి స్వల్ప వ్యవధి మాత్రమే లభించింది. బూత్‌స్థాయి అధి కారులు (బి.ఎల్.ఓ)లకు శిక్షణ లేని పరిస్థి తులలో ఇంత నిశితమైన ప్రక్రియ పూర్తి కావడం నిజంగానే అసంభవం. కనుకనే ఈ విషయంలో వచ్చిన తుది ఫలితం ఏమాత్రం ఆశ్చర్యం కలిగిం చేదిగా లేదు. 81 లక్షల మందికి పైగా ఓటర్లు తుది జాబితాలో పేరు పొందలేకపోయారు. 1.38 కోట్ల మంది ఓటర్ల చిరు నామాలు అనుమానాస్పదంగా వున్నాయన్నారు. తొమ్మిది లక్షల మందికి పైగా మహిళా ఓటర్లు తమ ఓటుహక్కు కోల్పోయారు. 14 లక్షల మందికి పైగా ఓటర్లకు ఒకటికి మించిన ఎపిక్ కార్డులున్నట్టు తేలింది. 100 మందికి పైగా ఓటర్లు వున్న ఆవాసాలు 2258 వున్నాయి. కనుక ఇది పారదర్శకంగా జరిగిందనడానికి ఎలాంటి ఆధారం లేదు. ఫిర్యాదులు లేని స్వచ్ఛమైన జాబితా ఎంతమాత్రం కాదు ఇది, తుది ఓటర్ల జాబితాలు తీవ్ర సందేహాలకు నిలయంగా మారాయి. బీహార్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి మేలు చేసేందుకే ఈ తతంగం ఉద్దేశించబడిందని మొదటి నుంచి స్పష్టమవుతూనే వుంది. ఎందు కంటే గతంలో ఈ ఎన్నికలు హోరాహోరీ పోటా పోటీగా జరిగాయి. ఈసిఐ తలపెట్టిన 'సర్'ను బలపర్చేందుకు రంగంలోకి దిగింది బీజేపీ మాత్రమే. సహజం గానే ప్రతిపక్షాలు, ఆందోళన చెందిన పౌరులు గట్టిగా ఎదిరించేందుకు ముందు కొచ్చారు. దీన్ని చక్క దిద్దేందుకు రాజ్యాంగం ఇచ్చిన ప్రతి వేదికనూ వాడుకోవడానికి ప్రయత్నించారు. రాజకీయ పార్టీలూ పౌర సంఘాలు దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్లు ఇప్పటికీ సుప్రీంకోర్టు విచారణ లోనే వున్నాయి. అత్యున్నత న్యాయస్థానం ఈ.సి.ఐ ఆధార్ కార్డు అనే 12వ పత్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పరిమిత మధ్యంతర ఉత్తర్వు ఇచ్చినప్పటికీ విస్తారమైన సమస్యలు మిగిలే వున్నాయి. ఓటర్ల సంఖ్య భారీ ఎత్తున తగ్గిపోయింది. ఈ.సి.ఐ ప్రయత్నమంతా మోసపూరితంగా వుందనేది ఇప్పుడు కండ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. 2025 బీహార్ ఎన్నికలలో 'సర్' ప్రక్రియ చేపట్టడం అంటే.. 2003లో జరిగిందే మరోసారి జరుగుతున్నది తప్ప ఎంతమాత్రం అసాధారణం కాదని, ఈ.సి.ఐ ముందు నుంచీ వాదిస్తూ వచ్చింది. అయితే అప్పటి మార్గదర్శకాలను వెల్లడించాలని కోరగా ఎన్నికల సంఘం అందించలేదు. ఇందుకు సంబంధించి నాటి అధికార పత్రాలు అందుబాటులో లేవన్నది అపరిపక్వతను బయట పెట్టుకోవడమే గాక వ్యవస్థా గతమైన అసమర్థతను కూడా వెల్లడించుకుంది. అయితే వారు పచ్చి అబద్ధాలకు పాల్పడ్డారనేది ఇప్పుడు తేటతెల్లమైపోయింది. ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (ఎ.డి.ఆర్) సుప్రీం కోర్టుకు నాటి ఈ పత్రాలను సమర్పించడాన్ని బట్టి ఇది అబద్ధమని తేలింది. 2003 ఆదే శాలు వేల పేజీలున్నాయి. ఈ కసరత్తు చేపట్టే తరుణంలో మూడు కోణాలలోనూ ఈ.సి.ఐ ఎలాంటి మోసానికి పాల్పడిందో ఇప్పుడు సంపూర్ణంగా తెలిసిపోయింది. ఇంకా ఏమైనా గజిబిజి అంటూ వుండి వుంటే నరేంద్ర మోడీ దళపతి అయిన హోంమంత్రి అమిత్ షా దాన్నీ లేకుండా చేశారు. పౌరులు కాని వారిని గుర్తించి తొలగించి పంపించేయ డానికే 'సర్' ద్వారా ప్రయత్నం జరిగిం దని ఆయన చెప్పేశారు. ఈ వాదనను సమర్థిం చుకోవడం కోసం ఆయన దేశ ముస్లిం జనాభాలో సాపేక్షంగా వచ్చిన స్వల్ప పెరుగుదలను నొక్కి చెప్పారు. ఈ పెరుగుదలకు కారణం సంతానోత్పత్తి రేటు పెరగడం గాక పెద్ద ఎత్తున జరిగిన చొరబాట్లేనని ఆయన మరీమరీ చెప్పారు. దేశంలో ముస్లిం జనాభా 24.6 శాతం చొప్పున పెరిగితే హిందూ జనాభా 4.5 శాతం చొప్పున తగ్గిపోతూ వస్తోందని ఆయన లెక్కలు చెప్పారు. ఈ వాదన ఆధారం గానే ఆయన పార్టీ ప్రభుత్వం చొర బాటుదార్లను గుర్తిస్తానంటున్నది. ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లు తొలగించడానికి చేయవలసింది మొత్తం చేస్తుంది. ఉత్తరోత్తరా వారిని స్వదేశాలకు పంపించేస్తుంది అన్నారు. 'సర్' నేపథ్యమేమిటో ఆయన స్పష్టంగానే ఏకరువు పెట్టారు. అయితే పహల్గాంలో ఉగ్రవాదులను పట్టుకోవడంలో విఫలమైనట్టే ఆయన మంత్రివర్గం చొరబాటుదారులను స్పష్టంగా ఎత్తిచూపడంలోనూ ఘోరంగా విఫలమైంది. ఆ విధంగా విఫలమైన కారణంగా ఆయన ఇప్పుడు ఇసిఐ భుజాల మీద తుపాకి పెట్టి కాల్చాలని ప్రయత్నిస్తున్నారు. భారీ సంఖ్యలో న్యాయమైన భారతీయ ఓటర్ల పేర్లు తొలగించబడినా సరే 'సర్'ను ఎవరూ ఏ మాత్రం వ్యతిరేకించరాదని ఆయన చాలా మొండిగా కరుగ్గా చెబుతున్నారు. భారత దేశంలో జనాభా తీరుతెన్నుల గురించి 'ప్యూ' అధ్యయన కేంద్రం వెలువరించిన నివేదిక మతాల వారీ జనాభా వివరాలను పొందుపర్చింది. భారత దేశంలో మొత్తంగా జననాల రేటు తగ్గడమే కాదు. 2015లో ఈ తగ్గుదల దాదాపు అభివృద్ధి చెందిన సంపన్న దేశాలతో సమానంగా వుంది. ఇక భారతీయ ముస్లింలలోనూ జననాల రేటు ఒక మహిళకు 4.4 వుంటే ఇప్పుడు 2.6కు తగ్గి పోయింది.

# గాజాలో మారణహోమం ముగిసినట్టే



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్. 9849328496.

అక్టోబర్ 7, 2023న హమాస్ దాడి తర్వాత ప్రారంభమైన ఇజ్రాయిల్–గాజా యుద్ధం రెండు సంవత్సరాలు దాటినా, గాజాలోని 2.3 మిలియన్ల పాలస్తీనా ప్రజల జీవితాలు భయంకరమైన మానవతా సంక్షోభంలో మునిగిపోయాయి. ఇజ్రాయిల్ సైనిక చర్యలు, నిరంతర బాంబు దాడులు, సరిహద్దు మూసివేతలు వల్ల ఆహారం, నీరు, ఔషధాలు, విద్యుత్ లాంటి ప్రాథమిక అవసరాలు లభించక, వేలాది మంది పిల్లలు, మహిళలు, వృద్ధులు మరణిస్తున్నారు. ఐక్యరాష్ట్ర సమితి (యూఎన్) నివేదికల ప్రకారం, 2025 అక్టోబర్ నాటికి 67,000కి పైగా పాలస్తీనావాసులు మరణించారు, ఇందులో 30% పిల్లలు. ఆకలి, నీటి కొరత, వ్యాధుల వల్ల మరణాలు మరింత పెరిగాయి. ఇజ్రాయిల్ అధికారికంగా ఆహారం, నీరు, ఔషధాలను అడ్డుకోవడం, అమెరికా ఆయుధ సరఫరా చేయడం వంటి దుశ్చర్యలు ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించాయి. ఈ దుర్గతికి సానుభూతి చూపుతూ, ఇజ్రాయిల్, అమెరికాలను ఖండిస్తూ ప్రపంచంలో వివిధ దేశాల్లో జరిగిన నిరసనలు, ఊరేగింపులు, సభలు మానవత్వానికి చిహ్నాలు. ఈ వ్యాసం ఆ ఉద్యమాలను తేదీలతో సహా వివరిస్తుంది.యుద్ధం ప్రారంభమైన వెంటనే, 2023 అక్టోబర్ 8న అమెరికాలోని న్యూయార్క్, చికాగో, లాస్ ఏంజిల్స్ నగరాల్లో వేలాది మంది పాలస్తీనా అనుకూలవాదులు ఊరేగింపులు నిర్వహించారు. "ఫ్రీ పాలస్తీన్" అంటూ నినాదాలు చేస్తూ, ఇజ్రాయిల్ దాడులను ఖండించారు. అక్టోబర్ 9న యూరప్‌లో లండన్‌లో 10,000 మంది పైగా ప్రదర్శనకారులు ఇజ్రాయిల్ ఎంబసీ వద్ద ఆందోళన చేపట్టారు. ఫ్రాన్స్‌లో పారిస్‌లో అక్టోబర్ 12న జరిగిన నిరసనలు పోలీసులతో ఘర్షణలకు దారితీశాయి. మధ్యప్రాచ్యంలో జోర్డాన్‌లో అమ్మాన్‌లో అక్టోబర్ 13న వేలాది మంది ఇజ్రాయిల్ ఎంబసీ వద్ద ఆందోళన చేపట్టారు, ఆకలి, నీటి కొరతతో మరణిస్తున్న పాలస్తీనా పిల్లలకు సానుభూతి చూపారు. టర్కీలో ఇస్తాంబుల్‌లో అక్టోబర్ 14న 50,000 మంది పైగా ఊరేగింపు నిర్వహించారు, అమెరికా మద్దతును ఖండించారు.అక్టోబర్ 15న ఆస్ట్రేలియాలో సిడ్నీ, మెల్‌బోర్న్‌లో ప్రదర్శనలు జరిగాయి. ఆసియాలో ఇండోనేషియాలో జకార్తాలో అక్టోబర్ 20న 100,000 మంది పైగా అమెరికా ఎంబసీ వద్ద నిరసన చేపట్టారు, గాజాలో ఆకలి మరణాలను హైలైట్ చేశారు. నవంబర్ 4న లండన్‌లో 300,000 మంది పైగా భారీ ఊరేగింపు నిర్వహించారు, ఇది బ్రిటన్ చరిత్రలో అతిపెద్ద పాలస్తీనా అనుకూల ఉద్యమాల్లో ఒకటి. వాషింగ్టన్ డీసీలో నవంబర్ 4న 100,000 మంది మార్చ్ చేసి, అమెరికా ఆయుధ సరఫరాలను ఆపాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 2023లో జర్మనీలో బెర్లిన్‌లో వేలాది మంది చలికాలంలోనూ నిరసనలు చేపట్టారు.2024లో ఉద్యమాలు మరింత తీవ్రమయ్యాయి. జనవరి 13న లండన్‌లో 500,000 మంది ఊరేగింపు జరిగింది, గాజాలో ఔషధాల కొరత వల్ల మరణిస్తున్న మహిళలు, వృద్ధులపై దృష్టి సారించారు. అమెరికాలో ఫిబ్రవరి 2024లో క్యాంపస్ ఆందోళనలు ప్రారంభమయ్యాయిబీ కొలంబియా యూనివర్సిటీలో విద్యార్థులు టెంట్ క్యాంపులు వేసి, ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెంచుకోవాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2024లో యూఎస్ విశ్వవిద్యాలయాల్లో 2,000 మంది పైగా విద్యార్థులు అరెస్టయ్యారు. మే 2024లో డబ్లిన్‌లో ఐర్లాండ్ ప్రజలు భారీ నిరసనలు చేపట్టారు. జూన్ 2024లో ఫ్రాన్స్‌లో పారిస్‌లో 100,000 మంది మార్చ్ చేశారు.మధ్యప్రాచ్యంలో 2024 జూలైలో యెమెన్‌లో సనాలో వేలాది మంది ఊరేగింపులు జరిగాయి. ఆగస్టు 2024లో మొరాకోలో రబాట్‌లో 50,000 మంది పైగా అమెరికా మద్దతును ఖండించారు. సెప్టెంబర్ 2024లో టర్కీలో అంకారాలో ప్రదర్శనలు తీవ్రమయ్యాయి. అక్టోబర్ 7, 2024న యుద్ధం ఒక సంవత్సరం పూర్తి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయిబీ రోమ్‌లో 20,000 మంది, బెర్లిన్‌లో 15,000 మంది పాల్గొన్నారు.2025లో ఉద్యమాలు మరింత విస్తరించాయి. జనవరి 2025లో వాషింగ్టన్ డీసీలో 200,000 మంది మార్చ్ చేసి, గాజాలో ఆకలి మరణాలను హైలైట్ చేశారు. ఫిబ్రవరి 2025లో లండన్‌లో పాలస్తీనా సాలిడారిటీ క్యాంపెయిన్ (పీఎస్‌సీ) నిర్వహించిన ఊరేగింపులో 400,000 మంది పాల్గొన్నారు. మార్చి 2025లో ఇండోనేషియాలో జకార్తాలో 150,000 మంది అమెరికా ఎంబసీ వద్ద నిరసన చేపట్టారు. ఏప్రిల్ 6, 2025న మొరాకోలో రబాట్, కాసాబ్లాంకాలో లక్షలాది మంది ఊరేగింపులు నిర్వహించి, అమెరికా మద్దతును ఖండించారు. మే 23, 2025న ఇజ్రాయిల్‌లోనే యుద్ధ వ్యతిరేక ఆందోళనలు పెరిగాయి, వేలాది మంది "నో సోల్జర్స్, నో ఆక్యుపేషన్" అంటూ నినాదాలు చేశారు.జూన్ 13, 2025న లండన్‌లో ఎమర్జెన్సీ ప్రొటెస్ట్ జరిగింది, ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడులను ఖండిస్తూ. జూలై 30, 2025న ఫ్రీడమ్ ఫ్లోటిల్లా కోయలిషన్ సభ్యులు గాజా సీజ్‌ను బ్రేక్ చేయడానికి ప్రయత్నించి, ఇజ్రాయిల్ జైలులో హంగర్ స్ట్రైక్ చేపట్టారు. ఆగస్టు 23, 2025న ఆస్ట్రేలియాలో సిడ్నీలో వేలాది మంది ఇజ్రాయిల్ స్పెషల్ ఎన్వాయ్‌పై నిరసన చేపట్టారు. సెప్టెంబర్ 5, 2025న లండన్‌లో ఎమర్జెన్సీ ప్రొటెస్ట్ జరిగింది, ఇజ్రాయిల్ ప్రెసిడెంట్ యూకే పర్యటనను వ్యతిరేకిస్తూ.సెప్టెంబర్ 11, 2025న లండన్‌లో మరో ఎమర్జెన్సీ ప్రొటెస్ట్ జరిగింది. అక్టోబర్ 7, 2025న యుద్ధం రెండు సంవత్సరాల సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయిబీ ఇండోనేషియాలో జకార్తాలో 1,000 మంది పైగా అమెరికా ఎంబసీ వద్ద మార్చ్ చేశారు. అక్టోబర్ 9, 2025న పాకిస్తాన్‌లో లాహోర్‌లో టెహ్రీక్-ఇ-లబ్బైక్ (టీఎల్‌పీ) నిరసనలు ఘర్షణలకు దారితీశాయి, అమెరికా-ఇజ్రాయిల్ ఒప్పందాన్ని ఖండిస్తూ. అక్టోబర్ 10న లండన్‌లో పీఎస్‌సీ టుమారో మార్చ్ జరిగింది. అక్టోబర్ 11, 2025న లండన్‌లో సెంట్రల్ లండన్‌లో 12 గంటల నుండి భారీ మార్చ్ జరిగింది, రెండు సంవత్సరాల జెనోసైడ్‌ను ఖండిస్తూ. అక్టోబర్ 11న పాకిస్తాన్‌లో లాహోర్‌లో టీఎల్‌పీ ప్రదర్శనకారులు అమెరికన్ కాన్సులేట్‌ను చుట్టుముట్టారు. అక్టోబర్ 13, 2025న పాకిస్తాన్‌లో మురిద్కే, లాహోర్‌లో 180 మంది గాయపడ్డారు, ఇస్లామాబాద్‌కు మార్చ్ చేస్తూ. ఈ ఉద్యమాలు గాజా ప్రజల బాధలపై ప్రపంచ దృష్టిని సారించాయి.ఈ నిరసనలు కేవలం ఆందోళనలు మాత్రమే కాక, మానవ హక్కులు, అంతర్జాతీయ చట్టాలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాయి. గాజాలో పిల్లలు ఆకలితో, మహిళలు ఔషధాల లేమితో, వృద్ధులు నీటి కొరతతో మరణిస్తుంటే, ఇజ్రాయిల్ సీజ్, అమెరికా మద్దతు దుశ్చర్యలుగా ముద్రవేయబడ్డాయి. యూఎన్, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు ఈ మరణాలను జెనోసైడ్‌గా వర్ణించాయి. ప్రపంచవ్యాప్త ఉద్యమాలు సీజ్‌ఫైర్, సహాయం పెంచడం కోసం పోరాడుతున్నాయి. ఈ గళాలు గాజా, పాలస్తీనాలో శాంతి,భూ భాగాలు సంరక్షణ,పూర్వం స్థితికి మార్పును తీసుకురావాలని ఆశిస్తున్నాం.ప్రపంచ దేశాలు విరివిగా విరాళాలు ఇచ్చి అంతర్జాతీయ శాంతి సంఘాన్ని ఏర్పాటు చేసి ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో పూర్వస్థితికి తీసుకురావాలి.అక్కడ ప్రజలకు విద్య, వైద్యం, ఔషధాలు, రక్షణ, గృహ నిర్మాణం, మొదలైన చర్యలను అంతర్జాతీయ సంస్థలు పూనుకొని తమ మానవత్వాన్ని చాటుకోవాలి. ఇజ్రాయిల్ అమెరికా దేశాల నేతలను (నెతన్యాహు, డోనాల్డ్ ట్రంప్ లపై యుద్ధ నేరాన్ని మోపాలి,

ఈ మారణహోమానికి బాధ్యులను చేయాలి. అంతర్జాతీయ కోర్టులో విచారణ జరిపించి తగిన శిక్షలు, పెనాల్టీ వేయాలి.గాజా, పాలస్తీనా విముక్తి, స్వతంత్ర దేశంగా ఐక్యరాజ్యసమితి గురించి, దాన్ని పర్యవేక్షణలో ఏర్పాటు చేయాలి.పాలస్తీనా ఒక సార్వభౌమాధికారం కలిగిన స్వతంత్ర దేశంగా ప్రపంచ ప్రజలు చూడాలి .

# టపాసుల పట్ల అవగాహన ఏదీ?




టపాసులకు ఆద్యులు చైనీయులు. క్రీ.పూ. 200 సం. లోనే వెదురు (బాంబూ) టపాకాయలు వాడినట్లు ఆధారాలు ఉన్నాయి. దాన్ని చైనా బాషలో బాజు అంటారు. పేలుతున్న వెదురు అని అర్థం. తుపాకి మందు కని పెట్టేంత వరకు వెదురు టపాసులనే చైనా వారు వాడేవారు. క్రీ.శ. 600ల ప్రాంతంలో చైనా వారు తుపాకి మందుని కనిపెట్టారు. గన్ పౌడర్ లేక బ్లాక్ పౌడర్ రసాయన ప్రేలుడు పదార్థం. ఇది గంధకం, చార్కోల్, పోటాషియం నైట్రేట్ ల మిశ్రమం. దీన్ని సాల్ట్ పౌడర్ అంటారు. ఇది మండినప్పుడు 427 నుంచి 464డిగ్రీల ఉష్ణం వెలువడుతుంది. దీని తరువాత చేసేవారు అందుకే టపాసులకు బాజు పేరు స్థిరపడి పాయింది. క్రీ.శ. 900వ సం.లో చైనా నుండి టపాసులు ఇంగ్లాండు అరబ్బు దేశాలు, భారత దేశానికి చేరుకున్నాయి. మనదేశంలో టపాకాయల పరిశ్రమ తమిళనాడులోని శివకాశిలో విస్తరించివుంది. దేశంలోని టపాకాయల ఉత్పత్తిలో 70% శివకాశిలోని 1000కి పైగా పరిశ్రమలలో తయారవు తున్నది. పరిశ్రమలలో పనిచేసే వారు ముఖ్యంగా పసిపిల్లలు. వారిలో 4 నుంచి 16 సం.లోపు వారు 30% మంది వున్నారు. అందులో 90% మంది ఆడ పిల్లలు, పేద పిల్లలు, వెనుకబడిన తరగతివారు. చేతులకు ఎలాంటి రక్షణ కవచాలు (గ్లౌజులు) లేకుండా ప్రమాదకర రసాయన పదార్థాలలో టపాసులు తయారు చేస్తున్నారు పిల్లలు. రసాయనాల వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు, చర్మ వ్యాధులతో బాధ పడుతున్నారు. ప్రభుత్వ చట్టాలు ఎన్ని వున్నా పిల్లలు చేసే ఈ చాకిరీని అరికట్టలేక పోతున్నారు. 1991లో శివకాశిలో ఓ ఫ్యాకల్టీలో జరిగిన ప్రేలుడు వల్ల 39 మంది చనిపోయారు. 65 మంది గాయపడ్డారు. 2009, జూలైలో జరిగిన ప్రమాదంలో 40 మంది చనిపోయారు. ఆగస్టు 2011లో ఫ్యాక్టరీ ప్రమాదంలో 7 మంది చనిపోగా ఐదుగురు గాయపడ్డారు. సెప్టెంబర్ 2012 ప్రమాదంలో 40 మంది చనిపోగా 38 మంది గాయ పడ్డారు. ఇవి అధికారిక లెక్కలు కాగా, నిజానికి ఎక్కువగానే ప్రమాదాలు జరిగి వుంటాయి. టపాకాయలు కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం, రసాయన కాలుష్యం చాలా ఎక్కువగా వుంది. టపాసులు కాల్చినప్పుడు శబ్దం 140 డెసిబెల్స్ దాటుతోంది. ఆరోగ్య పరంగా శబ్దాలు 125 డెసిబెల్స్ దాట కూడదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టపాకాయల శబ్ద తీవ్రత 125 డెసిబెల్స్ దాట కూడదు. కానీ టపాకాయల తయారీ కంపెనీలు నియమాన్ని పాటించడం లేదు. ఈ శబ్దాల వల్ల తాత్కాలిక చెవుడు, శాశ్వత చెవుడు ఏర్పడు తున్నది. అధిక శబ్దం వల్ల వినికిడి సమస్యలు, రక్తపోటు, గుండెపోటు, నిద్రలేమి లాంటి సమస్యలు వస్తున్నాయి. ఎన్నో రకాల ప్రమాదాలు పొంచి వున్నాయి. టపాకాయలు కాల్చడంలో అగ్ని ప్రమాదాలు కోకొల్లలు. చేతిలో చిచ్చుబుడ్డి పేలడం, ఒళ్ళుకాలడం, బట్టలు కాలి పోవడం జరుగుతూనే వుంటాయి. చాలా మంది ఆ వెలుగు చూడలేక కళ్ళు పోగొట్టుకున్న సందర్భాలు అనేకం. దీపావళి సందర్భంగా టపాకాయలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు. టపాకాయలు కాల్చేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదాలు సంభవిస్తాయి. బాణ సంచాలను ఇంటిలో కాల్చ కూడదు. ఇంటికి దూరంగా బహిరంగ ప్రదేశాలలో కాల్చడం వల్ల ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. టపాకాయలు కొన్నిసార్లు అవి పేలకుండా ఆగిపోతాయి. వాటిని వెంటనే వెళ్లి పట్టుకోవడం లాంటివి చేయకూడదు. ముందుగా వాటిపై నీటిని పోయడం వల్ల వాటి నుంచి ఎలాంటి ప్రమాదం జరిగే అవకాశం ఉండదు. టపాకాయలు కాల్చేటప్పుడు ముఖ్యంగా ఆల్కహాల్ శానిటైజర్ లను వాడి టపాకాయలను వెలిగించ కూడదు. శానిటైజర్ లకు తొందరగా మండే స్వభావం ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దీపావళి రోజు శానిటైజర్ లను వాడక పోవడం మంచిది. టపాకాయలపై ఇచ్చిన సలహాలు సూచనలను ఖచ్చితంగా చదివి పాటించాలి. మంటలు అంటుకునే ప్రదేశాలు... కరెంటు తీగలు, ఎండు గడ్డి, పూరి గుడిసెలు ఉన్న ప్రదేశాలలో బాణా సంచాలు కాల్చ కూడదు. టపాకాయలను కాల్చి వాటిని అలాగే రోడ్డు మీద పడేయడం వల్ల ఆ దారి వెంట వెళ్లే వారికి వాటి నుంచి ప్రమాదం కలగవచ్చు. ఒక బకెట్లో ఇసుక పెట్టుకొని అందులో కాల్చిన కాకర పువ్వులను, టపాకాయలను వేయడం మంచిది. బాణా సంచాలను కాల్చేటప్పుడు ముందస్తు జాగ్రత్తగా ఒక బకెట్ నిండా నీటిని పక్కన ఉంచుకోవాలి. చిన్నపిల్లలకు పెద్దవారే దగ్గరే ఉండి జాగ్రత్తగా టపాకాయలను కాల్పించాలి. వీలైనంత వరకు అందరూ కూడా కాటన్ దుస్తులను ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బాణసంచా కాల్చిన తర్వాత పిల్లలు టపాకాయలను కాల్చిన చేతులతోనే ముక్కు, చెవులు, కళ్లను రుద్దుకుంటారు. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. గొంతులో నీళ్ల పోసుకుని గార్గిలింగ్ చేయాలి. గాయం అయితే దాని మీద పదిహేను నిమిషాల పాటు చన్నీరు, వేడి నీరు పోయరాదు. తర్వాత ధారగా పోయాలి లేదా నీటి కుళాయి కింద పెట్టాలి. గాయమైన అరగంట లోపల ఈ చికిత్స జరగాలి. ఇలా చేయడం వల్ల వేడి తగ్గిపోతుంది. కంటికి చువ్వలాంటిది తగిలి గాయం అయినప్పుడు వెంటనే చేత్తో కానీ కంటిని రుద్దుతారు. చాలా ప్రమాదం. గాయం తీవ్రత పెరగడానికి, గాయం విస్తరించ డానికి కారణం అవుతుంది. కంటికి వస్త్రంతో గట్టిగా కట్టు కట్టకూడదు. ఇలా చేస్తే కంట్లో గుచ్చుకున్న నలుసు మరింత లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. కాబట్టి గాయమైన కంటిని కప్పు లేదా షీల్డుతో కప్పి డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళాలి. రసాయనాలు కంట్లో పడితే కంటిని పరిశుభ్రమైన నీటితో కడగాలి. కంటిని రుద్దకుండా దోసిలితో నీటిని తీసుకుని కంటికి తగిలేటట్లు చేస్తూ శుభ్రం చేయాలి. టపాసుల వినియోగాన్ని తగ్గించాలి. అధిక శబ్దాలు వెలువరించే టపాసులు కాల్చకూడదు. టపాసులు పర్యావర ణానికి ప్రమాద కారకాలు. టపాసుల కోసం డబ్బు వృథా చేయవద్దు. వెలుగులు నిం'దీపాల'తో దీపావళి చేసుకుందాం. పర్యావరణ పరిరక్షణ దీపావళిని జరుపుకుందాం.

చిన్నపిల్లలకు పెద్దవారే దగ్గరే ఉండి జాగ్రత్తగా టపాకాయలను కాల్పించాలి.వీలైనంత వరకు అందరూ కూడా కాటన్ దుస్తులను ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.బాణసంచా కాల్చిన తర్వాత పిల్లలు టపాకాయలను కాల్చిన చేతులతోనే ముక్కు, చెవులు, కళ్లను రుద్దుకుంటారు. చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. గొంతులో నీళ్లు పోసుకుని గార్గిలింగ్ చేయాలి. గాయం అయితే దాని మీద పదిహేను నిమిషాల పాటు చన్నీరు, వేడి నీరు పోయరాదు. తర్వాత ధారగా పోయాలి లేదా నీటి కుళాయి కింద పెట్టాలి. గాయమైన అరగంట లోపల ఈ చికిత్స జరగాలి. ఇలా చేయడం వల్ల వేడి తగ్గిపోతుంది. కంటికి చువ్వలాంటిది తగిలి గాయం అయినప్పుడు వెంటనే చేత్తో కానీ కంటిని రుద్దుతారు. చాలా ప్రమాదం. గాయం తీవ్రత పెరగడానికి, గాయం విస్తరించ డానికి కారణం అవుతుంది. కంటికి వస్త్రంతో గట్టిగా కట్టు కట్టకూడదు. ఇలా చేస్తే కంట్లో గుచ్చుకున్న నలుసు మరింత లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల...

## దీపావళి.... లక్ష్మీ పూజ



దీపమాలికలతో లక్ష్మికి నీరా జనమీయబడే దినం కావటం వల్ల దీపావళి అని నామాంకిత యైనది. నరకలోక వాసులకై దీప ం ఆవళి కల్పించే దినం కనుక దీపావళి అని వాడుక లోని వచ్చింది. దీపావళి అంటే దీపాల సమూహం. హిందూ మత సంప్రదాయానికి దీపావళి పర్వం ఒక చిహ్నం. రాక్షస రాజు బలి చక్రవర్తిని పాతాశానికి విష్ణువు అణగ దొక్కిన దినం కనుక ఒక మహోత్సవంగా పరిగణింప బడుతున్నది. శ్రీరాముడు పట్టాభిషిక్తుడైన దినం కావున ప్రధా న్యత సంతరించుకుంది. విక్రమశక స్థాపకుడైన విక్రమార్క చక్రవర్తి పట్టాభిషేక దినం కూడా ఇదే. లక్ష్మీదేవి ఈనాడు భూలోకానికి దిగి వచ్చి ఇల్లిల్లూ తిరుగుతుందని ప్రజల విశ్వాసం. మధ్యాహ్నం పిండివంటలతో భోజనం, అనంతరం లక్ష్మీదేవి తమ ఇంటికి రావడానికి దారి చూపేందుకే దీపాలంకరణలు. వామనమూర్తి బలిచక్రవర్తిని పాతాళానికి అణచివేసి, ఆయన కారాగారంలో ఉన్న దేవతలను విడుదల చేశారు. అలా విడుదలైన వారిని లక్ష్మీదే వితో పాటు క్షీరసాగరానికి తీసుకెళ్ళారు. ఆ ఆనందానికి స్మారకంగా పండువ ఏర్పడింది. లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైనది. అందుకే దీపావళి పర్వది నాన లక్ష్మీపూజ ప్రధాన కార్యంగా మారింది. పెళ్ళి అయిన కొత్త అల్లుళ్ళను హిందువులు పండగకు తప్పక ఆహ్వానిస్తారు. అల్లుని రాక సందర్భంగా సంతోష సూచకంగా బాణాసంచా కాలుస్తారు. భోజన సమయంలో కొత్త దుస్తులు ఇచ్చి గౌరవిస్తారు. మామతో అల్లుడు కలిసి పంక్తి భోజనం చేస్తారు. రకర కాల పిండి వంటలు వడ్డిస్తారు. ఆశ్వయుజ అమావాస్య విక్రమ సంవత్సరానికి ఆఖరి రోజు. మహారాష్ట్ర ప్రజలు పెదిపూజన్ అంటారు. వారు లక్ష్మీ సరస్వతు లను పూజిస్తారు. ఈ నాటి సాయంత్రం జమా ఖర్చులు సరి చూసుకుని, కొత్త పుస్తకాలు పెట్టుకుంటారు. వాటికి పూజ చేస్తారు. నౌకర్లకు బహుమతులు ఇస్తారు. సాయంత్రం దీపాలు వెలిగిస్తారు. దీపావళి నాటి రాత్రి లక్ష్మీపూజ చేసిన తర్వాత నిద్ర పోకుండా ఉండి, అర్ధరాత్రి దాటాక చేటల మీద కర్రలు కొట్టి, డిండిమం అనే వాయిద్యం వాయించాలని శాస్త్ర వచనం. ఆ వాద్యాలే ఇప్పుడు టపాకాయలుగా కాల్చడం జరుగుతున్నది. నరకాసురుడి చావుకి సంతోషించి, భూలోక వాసులు బాణాసంచా కాలుస్తూ వస్తున్నట్లు వాడుక. ఉల్కా – దర్శనం, అగ్గిపుల్లలు, కాకర పువ్వొత్తులు, దీపపు – కడ్డీలు, చిచ్చుబుడ్లు, మతాబులు, తారాజువ్వలు, చేటలు, డిండిమలు, తాటాకు టపాకాయలు ఫిరంగి కాయలు, నేల టపాకాయలు పేల్చుట జరు గుతున్నది. దీపావళి నాటి నుండి నెల రోజులు పెట్టే దీపాలతో క్రిమికీటకాదులు నశిస్తాయి. మందుల కాల్పుల వల్ల దీపాల వెలిగింపు వల్ల వాయువులో కీటకాదులను నశింప చేసే శక్తి ఉంది. దీపావళి నాడు సైతం పాప క్షయార్థం సూర్యోదయానికి ముందే తైలాభ్యంగన స్నానం చేయాలి. ప్రదోష కాలమందు దీపాలను ఉంచాలి. దీపావళి నాటి లక్ష్మీ పూజ వల్ల ఉన్న లక్ష్మిని తొలగించి, లక్ష్మి దేవిని ప్రసన్నం చేసుకోవడానికి దోహదం చేస్తుందని నమ్మకం. దీపావళి అమావాస్య మొదలు నెల రోజులు ఆకాశదీపం పెట్టే వారికి అనంత పుణ్యమని శాస్త్రాధారం.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ బందు సంపూర్ణం.





జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కిష్టయ్య జేఏసీ పిలుపువేరకు మండలంలోని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వ్యాపార దుకాణాలు పెట్రోల్ పంపులు పాఠశాలలు బ్యాంకులు సంపూర్ణ బంధు పాటించారు. జాతీయ రహదారి ఎన్ హెచ్ 365 రహదారిపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించుకుంటూ బీసీలకు రాష్ట్ర ప్రభుత్వము ప్రకటించిన విధంగా తక్షణమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకట నర్సయ్య, ఉమ్మడి జిల్లా మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల అధికార ప్రతినిధి తక్కలపల్లి బాబురావు, జిల్లా నాయకులు గుగులోతు లక్ష్మణ్ నాయక్, వల్లేపు శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోరే సుధాకర్, మండల యూత్ ప్రెసిడెంట్ కోరే రాము, గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చిక అశోక్ గౌడ్, ఎస్ కే యాకూబ్ పాషా, పై%శీ%డ్ల యాదగిరి, మేకల కుమారస్వామి, ముచ్చ యాదగిరిరావు జాటోతు రమేష్, బంధారపు శ్రీనివాస్ గౌడ్, నాయకులు మర్రి రామస్వామి, ఆబోతు అశోక్, వల్లె సోమయ్య, భాదవత్.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ రాజకీయ డ్రామా ఆడుతుంది.

- ♦ బీసీలకు బిజెపి పార్టీతోనే న్యాయం జరుగుతుంది.
- ♦ బీసీ బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన బిజెపి.
- ♦ బిజెపి మండల అధ్యక్షుడు రాదారపు అశోక్.





ఖానాపురం, అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని రాజకీయ పబ్బం గడుపుకోవడానికి మాత్రమే బీసీ రిజర్వేషన్ డ్రామా కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతుందని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు రాధారపు అశోక్ అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కిష్టయ్య జేఏసీ పిలుపుమేరకు మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలోని బంద్ సంపూర్ణంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు బిజెపి పార్టీతోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ జల్లి మధు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి అనబతుల విజయ్, సీనియర్ నాయకులు నార్లపురం పాపయ్య, శ్యామ మల్లా రెడ్డి, తేజావత్ లవన్ నాయక్, బానోతు అనిల్ నాయక్, అజ్మీరా రమేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవంగా బీసీల ఉద్యమం బంద్ విజయవంతం



జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):రాష్ట్ర బీసీ కుల సంఘాల జేఏసీ పిలుపు మేరకు మహాదేవపూర్ మండల కేంద్రంలో శనివారం బీసీ బంద్ విజయవంతం గా జరిగిందని బీసీ ఐక్య వేదిక కాటారం డివిజన్ నాయకులు సముద్రాల తిరుపతి తెలిపారు.ఈ బంద్ కు బీసీ కుల సంఘాల నాయకులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో మేమెంతో మా కంత వాటా ఇవ్వాల్సిందేనని నినదించారు.సామాజిక విప్లవంగా బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని,పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు సమ వాటా దక్కేవరకు బీసీ ఐక్యతారాగాన్ని వినిపిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ నాయకులు శ్రీపతిబాపు,అక్బర్ ఖాన్,పోత వెంకటస్వామి, కారెంగుల బాపురావు,సిరంగి రవీందర్,సల్మాన్ ఖాన్,జాగృతి మహేష్, నలబూగ ధర్మయ్య,బెల్లంపల్లి సురేష్,దుర్గం ఉద్యోగుల సంఘం నాయకులు విక్రమ్ సింగ్, దడిగేల శంకరయ్య, ఆరెందల అంకన్న,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీలతో చెలగాటమాడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు .

జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్.

అక్టోబర్ 18 భూపాలపల్లి వుదయం ప్రతినిధి. బీసీలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని బీసీలకు అన్యాయం చేస్తున్నాయని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ఆరోపించారు. శనివారం ఆయన టేకుమట్ల మండల కేంద్రంలో మాట్లాడుతూ శనివారం జరిగిన సకల జనుల బీసీ బంద్ లో బిజెపి కాంగ్రెస్ పార్టీలు పాల్గొనడం తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రేక్షక పాత్ర వహించడం సరైనది కాదు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టసభల్లో ఆమోదం తెలిపి రాష్ట్ర గవర్నర్ సంతకం కోసం పంపగా గవర్నర్ సంతకం చేయకుండా అడ్డుకున్నది బిజెపి పార్టీ అని మళ్లీ బీసీ బందులో బిజెపి పాల్గొనడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు.

# పూలే అంబేద్కర్‌ను అర్థం చేసుకుంటేనే రాజ్యాధికారం సాధ్యం

- ♦ బీసీ రిజర్వేషన్ అమలు కాకుంటే మరో తెలంగాణ ఉద్యమమే
- ♦ రిజర్వేషన్ ఎవరు ఇస్తరో ఎవరుతీసుకుంటరో ఆలోచించాలే
- ♦ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

జయశంకర్ భూపాలపల్లి (మంథని)అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో బీసీ రిజర్వేషన్‌లు తీసుకువచ్చి బీసీల చేతుల్లో పెట్టాలని లేకుంటే మరో తెలంగాణ ఉద్యమంలా మారుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు.



42శాతం రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ సంఘాల జేఏసీ పిలుపుమేరకు శనివారం మంథనిలో చేపట్టిన బంద్‌లో ఆయన పాల్గొన్నారు. ముందుగా మహాత్మా జ్యోతిరావుపూలేకు నివాళులు అర్పించి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు, అనంతరం వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బంద్‌లో పాల్గొన్న వారితో కలిసి సహపంక్తి బోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు మేమెంతో మాకంత అని మహాత్మాజ్యోతీరావు పూలే సంకల్పించారని, పూలేను అర్థం చేసుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికి గొప్ప రాజ్యాంగం అందించారన్నారు. అయితే పూలే, అంబేద్కర్‌ను అర్థం చేసుకోకపోవడం మూలంగానే అనేక అనర్థాలు జరుగుతున్నాయని, వారిని అర్థం చేసుకున్న నాడే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ కోసం బీసీ సంఘాల జేఏసీ పిలుపుమేరకు అన్ని రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నాయకులు రోడ్డు మీదకు వచ్చి బంద్ మద్దతు తెలుపడం సంతోషకరమన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనకపోతే తెలంగాణ ద్రోహులుగా మిగిలిపోతామని ప్రతి ఒక్కరు ఉద్యమంలో ముందుకు వచ్చారని, అదే తరహాలో ఈనాడు బంద్‌కు సహకారిస్తున్నారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ అసలు బీసీ రిజర్వేషన్‌లు ఇచ్చే వారు ఎవరు తీసుకునే వారు ఎవరనే అయోమయం నెలకొనెలా అధికార పార్టీలు పాల్గొంటున్నాయన్నారు. బీసీ రిజర్వేషన్‌లు కేంద్రం ఇస్తుందా రాష్ట్రం ఇస్తుందా అని ఆలోచించకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మద్దతుపై బీసీ సమాజం సూక్ష్మంగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉ ందన్నారు. ఒకరిపై ఒకరు నెపం మోపి బీసీలు ఒక్కటి కాలేరనే ఆలోచనతో బీసీవర్గాల్లో చిచ్చు పెట్టి రిజర్వేషన్‌లు ఆపేందుకు కుట్రలు జరుగుతున్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. అందరూ బాపనోళ్లు అయితే రొయ్యల మొలతాడు ఏడ పోయినట్లు అన్న చందంగా అన్ని పార్టీల నాయకులు బీసీ బంద్‌లో పాల్గొంటే అసలు రిజర్వేషన్‌లు ఎవరు అమలు చేయాలనే ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంఘాల ఏర్పడిన జేఏసీ ఎవరో ఒకరిపై గురి పెట్టకపోతే అయోమయపరిస్థితులకు దారి తీస్తుందని ఆయన వాపోయారు. తెలంగాణ ఉద్యమంలో ఎలాగైతే ప్రభుత్వాల మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నామో అదే రీతిలో బీసీ రిజర్వేషన్‌లు సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ రోడ్లపై కాకుండా పార్లమెంట్‌లో గళమెత్తాలని, అలాగే ప్రధాని మోడీ బీసీల గురించి ఆలోచన చేయాలన్నారు. వీళ్లిద్దరు కలిసి మాట్లాడుకుంటే బీసీ రిజర్వేషన్‌లు సునాయమవుతాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ సంఘాల పిలుపుమేరకు నియోజకవర్గంలో బంద్‌కు సహకరించిన వ్యాపార సంస్థలు, అన్ని రాజకీయ పార్టీ ల నాయకులు, ప్రజలు, మేధావులకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆరెస్ నాయకులు కార్యకర్తలు బీసీ సంఘం ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడ విజేతలతో ముఖ్య అతిథులు

- ♦ న్నిస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా!
- ♦ డి వై ఎస్ ఓ అశోక్ కుమార్
- ♦ ఏసీపీ నర్సిం హ రావు
- ♦ టెన్నిస్ విజేతలు నాగయ్య, శ్రీధర్, రడం శ్రీనివాస్, సాత్విక్



హనుమకొండ, అక్టోబర్ 18(వుదయం జిల్లా ప్రతినిధి) : హనుమకొండలో టెన్నిస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని హనుమకొండ జిల్లా క్రీడాభివృద్ధికారి(డి వై ఎస్ ఓ) గుగులోతు అశోక్ కుమార్, హనుమకొండ ఏసీపీ నర్సింహ రావు అన్నారు. శనివారం హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్ స్టేడియంలోని టెన్నిస్ గ్రౌండ్ లో ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ జేఎన్ఎస్ స్టేడియంలోని టెన్నిస్ కోర్టులో ఫ్లడ్ లైట్లు,క్ల కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హనుమకొండలో విస్తరిస్తున్న టెన్నిస్ క్రీడకు కావలసిన మౌలిక వసతుల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో ఘనంగా టెన్నిస్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నల్లా సురేందర్ రెడ్డి ఈరోజు పోటీలకు పూర్తిగా సహాయం అందించడం అభినందనీయం అన్నారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నల్ల సురేందర్ రెడ్డి, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ జిల్లాలోని ఔత్సాహిక క్రీడాకారులను వెలుగులో తీసుకొచ్చేందుకు హనుమకొండలో ప్రతినెల ఒక టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ పాట్రన్ కే. రవిచంద్ర మాట్లాడుతూ హనుమకొండ టెన్నిస్ కోర్టులో మౌలిక వస్తువులకు ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు, ఈ పోటీలో ప్రథమ బహుమతి నాగయ్య(ఏసీపీ), శ్రీధర్ (ఆర్ ఐ) జోడి ప్రథమ స్థానంలో నిలవగా, రడం శ్రీనివాస్, తిప్పాని సాత్విక్ జంట ద్వితీయ స్థానంలో నిలిచారు. హనుమకొండ టెన్నిస్ కోశాధికారి సిరికొండ సుదర్శన్, ఉపాధ్యక్షులు వెంకట్ నారాయణ, మల్లారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుమాండ్ల వెంకట్, వినీల్, శివ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ వర్గానికి అన్నయ్య ఏం జరిగినా వెన్నంటే ఉండి పోరాటం చేస్తాం

జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):ఏ వర్గానికి అన్యాయం జరిగినా వారి వెన్నంటే ఉండి మద్దతు పలుకుతూ పోరాటం చేస్తామని పలిమెల మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు శనివారం బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం నిర్ణయంతో మంథని నియోజకవర్గ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాలతో గ్రామగ్రామాన తిరిగి దుకాణాలను బంద్ ను చేయించినట్లు తెలిపారు ఏ వర్గానికి చెందిన ప్రజలు,అన్యాయానికి గురైనా బాధితులకు అండగా ఉండేది ఒక్క



బిఆర్ఎస్ పార్టీయేనని ఈ సందర్భంగా నాయకులు అన్నారు.పలిమెల మండలంలో బీసీల కోసం మద్దతుగా అందరు సంపూర్ణంగా బంద్ పాటించేలా అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు మండలంలోని కిరాణం షాప్ లా యజమానులను , పాఠశాలలను అంగన్వాడీ కేంద్రాలను, ఫర్టిలైజర్ తదితర షాప్ లు అన్నీ బంద్ పాటించడం జరిగిందని అన్నారు బీసీలకు రాజ్యాంగ బద్ధంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు లంగారి రవీందర్, ముకునూర్ మాజీ సర్పంచ్ ఆలం సత్యనారాయణ, మడే సత్యనారాయణ,మట్టి సత్యం,మోతె కిష్టయ్య,గట్టయ్య, బొచ్చు తిరుపతి,మేకల రాజక్క కమ్మల రంజిత్, ప్రశాంత్, పడాల.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ బందు సంపూర్ణం.





ఖానాపురం, అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కిష్టయ్య జేఏసీ పిలుపుమేరకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వ్యాపార దుకాణాలు పెట్రోల్ పంపులు పాఠశాలలు బ్యాంకులు సంపూర్ణ బంధు పాటించారు. జాతీయ రహదారి ఎన్ హెచ్ 365 రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వము బీసీల 42 శాతం ప్రకటించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్ మోహన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోడె%శీ% ఎల్లగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లే శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ఎస్కె లాల్ సాబ్, మండల కార్యదర్శి కోరే రాములు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె ముస్తాఫా, కిసాన్ సెల్ మండల ఉపాధ్యక్షుడు పల్నాటి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు బొమ్మగాని నవీన్ గౌడ్, ఆరే సంపత్ కుమార్, పిండి కుమార్, ఎస్.కె కమాలుద్దీన్, లింగిడి వెంకటేశ్వర్లు, కొనుకటి రాజు, నాయకులు మారబోయిన రాములు, భూక్యా నరసింహనాయక్, జాటోత్ పూల్యానాయక్ శివరాత్రి వెంకన్న, వరదయ్య, రవికుమార్ , మల్లికార్జున్, నాగరాజు, రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు



జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేజయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు దీపావళి పండుగ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే శనివారం టపాసుల విక్రయదారుల షాపులను పర్యవేక్షించారు అదేక్రమంలో ప్రజలకు, విక్రయదారులకు ముఖ్య సూచనలు చేశారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ టపాసులు విక్రయించాలనుకునేవారు తెలంగాణ ఎక్సప్లసివేస్ యాక్ట్, 1884 మరియు ఎక్సప్లసివేస్ రూల్స్, 2008 ప్రకారమే సరైన లైసెన్స్ పొందడం తప్పనిసరి. లైసెన్స్ లేకుండా విక్రయించవద్దుబీ లైసెన్స్ లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి అని హెచ్చరించారు టపాసుల షాపులు జనం రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ట్రాఫిక్ బిజీ ఏరియా, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌ల పక్కలో, పెట్రోల్ బంకుల సమీపంలో ఏర్పాటుచేయకూడదని సురక్షిత, అనుమతించబడిన ప్రాంతాల్లోనే షాపులు ఏర్పాటు చేయాలి అని అన్నారు తహసిల్దార్, ఫైర్ సర్వీస్, పోలీస్ శాఖ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే లైసెన్స్ ఉన్న వ్యాపారులు షాపులు నిర్వహించాలని తెలిపారు లైసెన్స్ గడువు ముగిసిందైతే వెంటనే రీన్యువల్ తీసుకుని ఆ తర్వాతే విక్రయాలు కొనసాగించాలని సూచించారు.భద్రతా ప్రమాణాలు పాటించకుండా టపాసులు విక్రయించినట్లు నిరూపితమైన సందర్భాల్లో కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి ఉండాలని భద్రతా నియమాలు పాటించి, ఈ దీపావళిని ఆనందంగా ప్రమాద రహితంగా జరుపుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబుకు సన్మానం



జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబును మహదేవపూర్ లోని ఆయన నివాసంలో శనివారం తెలుగుదేశం పార్టీ నేతలు అజ్మీర రాజు నాయక్,అందె భాస్కరాచారి శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట రాజబాబు 1978 నుండి మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు అనుచరుడుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీలో అంచలంచలుగా ఎదిగాడన్నారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అండదండలతో రెండు సార్లు మహదేవాపూర్ సర్పంచ్ గా, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా ప్రస్తుతం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నియామకం కావడం బీసీలకు పెద్దపీట వేసినట్లు అయిందన్నారు. బాల్యం నుండి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేసిన రాజబాబు ఈ ప్రాంతంలో అందరితో సత్సంబంధాలు కొనసాగిస్తూ పార్టీలకతీతంగా అందరిని కలుపుకు పోయో మృదుస్వబావి.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ బందు సంపూర్ణం.





జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కిష్టయ్య జేఏసీ పిలుపువేరకు మండలంలోని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వ్యాపార దుకాణాలు పెట్రోల్ పంపులు పాఠశాలలు బ్యాంకులు సంపూర్ణ బంధు పాటించారు. జాతీయ రహదారి ఎన్ హెచ్ 365 రహదారిపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించుకుంటూ బీసీలకు రాష్ట్ర ప్రభుత్వము ప్రకటించిన విధంగా తక్షణమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకట నర్సయ్య, ఉమ్మడి జిల్లా మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల అధికార ప్రతినిధి తక్కలపల్లి బాబురావు, జిల్లా నాయకులు గుగులోతు లక్ష్మణ్ నాయక్, వల్లేపు శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోరే సుధాకర్, మండల యూత్ ప్రెసిడెంట్ కోరే రాము, గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చిక అశోక్ గౌడ్, ఎస్ కే యాకూబ్ పాషా, పై%శీ%డ్ల యాదగిరి, మేకల కుమారస్వామి, ముచ్చ యాదగిరిరావు జాటోతు రమేష్, బంధారపు శ్రీనివాస్ గౌడ్, నాయకులు మర్రి రామస్వామి, ఆబోతు అశోక్, వల్లె సోమయ్య, భాదవత్.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ రాజకీయ డ్రామా ఆడుతుంది.

- బీసీలకు బిజెపి పార్టీతోనే న్యాయం జరుగుతుంది.
- బీసీ బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన బిజెపి.
- బిజెపి మండల అధ్యక్షుడు రాదారపు అశోక్.





ఖానాపురం, అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని రాజకీయ పబ్బం గడుపుకోవడానికి మాత్రమే బీసీ రిజర్వేషన్ డ్రామా కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతుందని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు రాధారపు అశోక్ అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కిష్టయ్య జేఏసీ పిలుపుమేరకు మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలోని బంద్ సంపూర్ణంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు బిజెపి పార్టీతోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ జల్లి మధు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి అనబతుల విజయ్, సీనియర్ నాయకులు నార్లపురం పాపయ్య, శ్యామ మల్లా రెడ్డి, తేజావత్ లవన్ నాయక్, బానోతు అనిల్ నాయక్, అజ్మీరా రమేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవంగా బీసీల ఉద్యమం బంద్ విజయవంతం



జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):రాష్ట్ర బీసీ కుల సంఘాల జేఏసీ పిలుపు మేరకు మహాదేవపూర్ మండల కేంద్రంలో శనివారం బీసీ బంద్ విజయవంతం గా జరిగిందని బీసీ ఐక్య వేదిక కాటారం డివిజన్ నాయకులు సముద్రాల తిరుపతి తెలిపారు. ఈ బంద్ కు బీసీ కుల సంఘాల నాయకులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మేమెంతో మా కంత వాటా ఇవ్వాల్సిందేనని నినదించారు. సామాజిక విప్లవంగా బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని,పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు సమ వాటా దక్కేవరకు బీసీ ఐక్యతారాగాన్ని వినిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ నాయకులు శ్రీపతిబాపు,అక్బర్ ఖాన్,పోత వెంకటస్వామి, కారెంగుల బాపురావు,సిరంగి రవీందర్,సల్మాన్ ఖాన్,జాగృతి మహేష్, నలబాగ ధర్మయ్య,బెల్లంపల్లి సురేష్,దుర్గం ఉద్యోగుల సంఘం నాయకులు విక్రమ్ సింగ్, దడిగేల శంకరయ్య, ఆరెందల అంకన్న,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీలతో చెలగాటమాడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు .

జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్.

అక్టోబర్ 18 భూపాలపల్లి వుదయం ప్రతినిధి. బీసీలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని బీసీలకు అన్యాయం చేస్తున్నాయని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ఆరోపించారు. శనివారం ఆయన టేకుమట్ల మండల కేంద్రంలో మాట్లాడుతూ శనివారం జరిగిన సకల జనుల బీసీ బంద్ లో బిజెపి కాంగ్రెస్ పార్టీలు పాల్గొనడం తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రేక్షక పాత్ర వహించడం సరైనది కాదు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టసభల్లో ఆమోదం తెలిపి రాష్ట్ర గవర్నర్ సంతకం కోసం పంపగా గవర్నర్ సంతకం చేయకుండా అడ్డుకున్నది బిజెపి పార్టీ అని మళ్లీ బీసీ బందులో బిజెపి పాల్గొనడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు.

# పూలే అంబేద్కర్‌ను అర్థం చేసుకుంటేనే రాజ్యాధికారం సాధ్యం

- బీసీ రిజర్వేషన్ అమలు కాకుంటే మరో తెలంగాణ ఉద్యమమే
- రిజర్వేషన్ ఎవరు ఇస్తరో ఎవరుతీసుకుంటరో అలోచించాలే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

జయశంకర్ భూపాలపల్లి (మంథని)అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో బీసీ రిజర్వేషన్‌లు తీసుకువచ్చి బీసీల చేతుల్లో పెట్టాలని లేకుంటే మరో తెలంగాణ ఉద్యమంలా మారుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ సంఘాల జేఏసీ పిలుపుమేరకు శనివారం మంథనిలో చేపట్టిన బంద్‌లో ఆయన పాల్గొన్నారు. ముందుగా మహాత్మా జ్యోతిరావుపూలేకు నివాళులు అర్పించి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు, అనంతరం వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బంద్‌లో



పాల్గొన్న వారితో కలిసి సహపంక్తి బోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు మేమెంతో మాకంత అని మహాత్మాజ్యోతీరావు పూలే సంకల్పించారని, పూలేను అర్థం చేసుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికి గొప్ప రాజ్యాంగం అందించారన్నారు. అయితే పూలే, అంబేద్కర్‌ను అర్థం చేసుకోకపోవడం మూలంగానే అనేక అనర్థాలు జరుగుతున్నాయని, వారిని అర్థం చేసుకున్న నాడే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ కోసం బీసీ సంఘాల జేఏసీ పిలుపుమేరకు అన్ని రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నాయకులు రోడ్డు మీదకు వచ్చి బంద్ మద్దతు తెలుపడం సంతోషకరమన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనకపోతే తెలంగాణ ద్రోహులుగా మిగిలిపోతామని ప్రతి ఒక్కరు ఉద్యమంలో ముందుకు వచ్చారని, అదే తరహాలో ఈనాడు బంద్‌కు సహకారిస్తున్నారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ అసలు బీసీ రిజర్వేషన్‌లు ఇచ్చే వారు ఎవరు తీసుకునే వారు ఎవరనే అయోమయం నెలకొనెలా అధికార పార్టీలు పాల్గొంటున్నాయన్నారు. బీసీ రిజర్వేషన్‌లు కేంద్రం ఇస్తుందా రాష్ట్రం ఇస్తుందా అని ఆలోచించకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మద్దతుపై బీసీ సమాజం సూక్ష్మంగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరిపై ఒకరు నెపం మోపి బీసీలు ఒక్కటి కాలేరనే ఆలోచనతో బీసీవర్గాల్లో చిచ్చు పెట్టి రిజర్వేషన్‌లు ఆపేందుకు కుట్రలు జరుగుతున్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. అందరూ బాపనోళ్లు అయితే రొయ్యల మొలతాడు ఏడ పోయినట్లు అన్న చందంగా అన్ని పార్టీల నాయకులు బీసీ బంద్‌లో పాల్గొంటే అసలు రిజర్వేషన్‌లు ఎవరు అమలు చేయాలనే ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంఘాల ఏర్పడిన జేఏసీ ఎవరో ఒకరిపై గురి పెట్టకపోతే అయోమయపరిస్థితులకు దారి తీస్తుందని ఆయన వాపోయారు. తెలంగాణ ఉద్యమంలో ఎలాగైతే ప్రభుత్వాల మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నామో అదే రీతిలో బీసీ రిజర్వేషన్‌లు సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ రోడ్లపై కాకుండా పార్లమెంట్‌లో గళమెత్తాలని, అలాగే ప్రధాని మోడీ బీసీల గురించి ఆలోచన చేయాలన్నారు. వీళ్లిద్దరు కలిసి మాట్లాడుకుంటే బీసీ రిజర్వేషన్‌లు సునాయమవుతాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ సంఘాల పిలుపుమేరకు నియోజకవర్గంలో బంద్‌కు సహకరించిన వ్యాపార సంస్థలు, అన్ని రాజకీయ పార్టీ ల నాయకులు, ప్రజలు, మేధావులకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ నాయకులు కార్యకర్తలు బీసీ సంఘం ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడ విజేతలతో ముఖ్య అతిధులు

- న్నిస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా!
- డి వై ఎస్ ఓ అశోక్ కుమార్
- ఏసీపీ నర్సిం హ రావు
- టెన్నిస్ విజేతలు నాగయ్య, శ్రీధర్, రడం శ్రీనివాస్, సాత్విక్



హనుమకొండ, అక్టోబర్ 18(వుదయం జిల్లా ప్రతినిధి) : హనుమకొండలో టెన్నిస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని హనుమకొండ జిల్లా క్రీడాభివృద్ధికారి(డి వై ఎస్ ఓ) గుగులోతు అశోక్ కుమార్, హనుమకొండ ఏసీపీ నర్సింహా రావు అన్నారు. శనివారం హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్ స్టేడియంలోని టెన్నిస్ గ్రౌండ్ లో ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ జేఎన్ఎస్ స్టేడియంలోని టెన్నిస్ కోర్టులో ఫ్లడ్ లైట్లు,క్ల కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హనుమకొండలో విస్తరిస్తున్న టెన్నిస్ క్రీడకు కావలసిన మౌలిక వసతుల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో ఘనంగా టెన్నిస్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నల్లా సురేందర్ రెడ్డి ఈరోజు పోటీలకు పూర్తిగా సహాయం అందించడం అభినందనీయం అన్నారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నల్ల సురేందర్ రెడ్డి, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ జిల్లాలోని ఔత్సాహిక క్రీడాకారులను వెలుగులో తీసుకొచ్చేందుకు హనుమకొండలో ప్రతినెల ఒక టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. హనుమకొండ టెన్నిస్ అసోసియేషన్ పాట్రన్ కే. రవిచంద్ర మాట్లాడుతూ హనుమకొండ టెన్నిస్ కోర్టులో మౌలిక వస్తువులకు ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు, ఈ పోటీలో ప్రథమ బహుమతి నాగయ్య(ఏసీపీ), శ్రీధర్ (ఆర్ ఐ) జోడి ప్రథమ స్థానంలో నిలవగా, రడం శ్రీనివాస్, తిప్పాని సాత్విక్ జంట ద్వితీయ స్థానంలో నిలిచారు. హనుమకొండ టెన్నిస్ కోశాధికారి సిరికొండ సుదర్శన్, ఉపాధ్యక్షులు వెంకట్ నారాయణ, మల్లారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుమాండ్ల వెంకట్, వినీల్, శివ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ వర్గానికి అన్యాయ్య ఏం జరిగినా వెన్నంటే ఉండి పోరాటం చేస్తాం

జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):ఏ వర్గానికి అన్యాయం జరిగినా వారి వెన్నంటే ఉండి మద్దతు పలుకుతూ పోరాటం చేస్తామని పలిమెల మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు శనివారం బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం నిర్ణయంతో మంథని నియోజకవర్గ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాలతో గ్రామగ్రామాన తిరిగి దుకాణాలను బంద్ ను చేయించినట్లు తెలిపారు ఏ వర్గానికి చెందిన ప్రజలు,అన్యాయానికి గురైనా బాధితులకు అండగా ఉండేది ఒక్క



బిఆర్ఎస్ పార్టీయేనని ఈ సందర్భంగా నాయకులు అన్నారు. పలిమెల మండలంలో బీసీల కోసం మద్దతుగా అందరు సంపూర్ణంగా బంద్ పాటించేలా అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు మండలంలోని కిరాణం షాప్ లా యజమానులను , పాఠశాలలను అంగన్వాడీ కేంద్రాలను, ఫర్టిలైజర్ తదితర షాప్ లు అన్నీ బంద్ పాటించడం జరిగిందని అన్నారు బిసీలకు రాజ్యాంగ బద్ధంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు లంగారి రవీందర్, ముకునూర్ మాజీ సర్పంచ్ ఆలం సత్యనారాయణ, మడే సత్యనారాయణ,మట్టి సత్యం,మోతె కిష్టయ్య,గట్టయ్య, బొచ్చు తిరుపతి,మేకల రాజక్క కమ్మల రంజిత్, ప్రశాంత్, పడాల.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీసీ బందు సంపూర్ణం.





ఖానాపురం, అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కిష్టయ్య జేఏసీ పిలుపుమేరకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వ్యాపార దుకాణాలు పెట్రోల్ పంపులు పాఠశాలలు బ్యాంకులు సంపూర్ణ బంధు పాటించారు. జాతీయ రహదారి ఎన్ హెచ్ 365 రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వము బీసీల 42 శాతం ప్రకటించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్ మోహన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోడె%శీ% ఎల్లగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లే శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి ఎస్కె లాల్ సాబ్, మండల కార్యదర్శి కోరే రాములు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె ముస్తాఫా, కిసాన్ సెల్ మండల ఉపాధ్యక్షుడు పల్నాటి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు బొమ్మగాని నవీన్ గౌడ్, ఆరే సంపత్ కుమార్, పిండి కుమార్, ఎస్.కె కమాలుద్దీన్, లింగిడి వెంకటేశ్వర్లు, కొనుకటి రాజు, నాయకులు మారబోయిన రాములు, భూక్యా నరసింహనాయక్, జాటోత్ పూల్యానాయక్ శివరాత్రి వెంకన్న, వరదయ్య, రవికుమార్ , మల్లికార్జున్, నాగరాజు, రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు



జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేజయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు దీపావళి పండుగ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే శనివారం టపాసుల విక్రయదారుల షాపులను పర్యవేక్షించారు అదేక్రమంలో ప్రజలకు, విక్రయదారులకు ముఖ్య సూచనలు చేశారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ టపాసులు విక్రయించాలనుకునేవారు తెలంగాణ ఎక్స్ప్లసివేస్ యాక్ట్, 1884 మరియు ఎక్స్ప్లసివేస్ రూల్స్, 2008 ప్రకారమే సరైన లైసెన్స్ పొందడం తప్పనిసరి. లైసెన్స్ లేకుండా విక్రయించవద్దుబీ లైసెన్స్ లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి అని హెచ్చరించారు టపాసుల షాపులు జనం రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ట్రాఫిక్ బిజీ ఏరియా, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌ల పక్కలో, పెట్రోల్ బంకుల సమీపంలో ఏర్పాటుచేయకూడదని సురక్షిత, అనుమతించబడిన ప్రాంతాల్లోనే షాపులు ఏర్పాటు చేయాలి అని అన్నారు తహసిల్దార్, ఫైర్ సర్వీస్, పోలీస్ శాఖ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే లైసెన్స్ ఉన్న వ్యాపారులు షాపులు నిర్వహించాలని తెలిపారు లైసెన్స్ గడువు ముగిసిందైతే వెంటనే రీన్యువల్ తీసుకుని ఆ తర్వాతే విక్రయాలు కొనసాగించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా టపాసులు విక్రయించినట్లు నిరూపితమైన సందర్భాల్లో కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి ఉండాలని భద్రతా నియమాలు పాటించి, ఈ దీపావళిని ఆనందంగా ప్రమాద రహితంగా జరుపుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబుకు సన్మానం



జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి):జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబును మహదేవపూర్ లోని ఆయన నివాసంలో శనివారం తెలుగుదేశం పార్టీ నేతలు అజ్మీర రాజు నాయక్,అందె భాస్కరాచారి శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట రాజబాబు 1978 నుండి మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు అనుచరుడుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీలో అంచలంచలుగా ఎదిగాడన్నారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అండదండలతో రెండు సార్లు మహదేవాపూర్ సర్పంచ్ గా, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా ప్రస్తుతం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నియామకం కావడం బీసీలకు పెద్దపీట వేసినట్లు అయిందన్నారు. బాల్యం నుండి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేసిన రాజబాబు ఈ ప్రాంతంలో అందరితో సత్సంబంధాలు కొనసాగిస్తూ పార్టీలకతీతంగా అందరిని కలుపుకు పోయో మృదుస్వబావి.

# మధిరలో అఖిలపక్షపార్టీల ఆధ్వర్యంలో బీసీ బంద్ సంపూర్ణం



మధిర,అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఇటీవల జీవో విడుదల చేయడం జరిగింది ఆ జీవోను హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేయడంతో రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ తెలంగాణ బీసీ బంద్ కు పిలుపునిచ్చిన తరుణంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో మధిర మండల,పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని బీసీ బందును విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్,మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిరియాల వెంకటరమణ గుప్తా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఓబీసీలకు 42% రిజర్వేషన్ కల్పించడానికి కట్టుబడి ఉందన్నారు. 100 సంవత్సరాల పైబడి స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆర్థిక,సామాజిక, విద్య,రాజకీయ సర్వే నిర్వహించాం. సర్వే వివరాలు తో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్ కు పంపాము. గత టిఆర్ఎస్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో స్థానిక ఎన్నికల సమయంలో స్థానిక సంస్థలలో 50 శాతం పెంచకుండా క్యాబ్ విధిస్తూ చట్టం తీసుకువచ్చింది.ఆ చట్టాన్ని తొలగిస్తూ ఆర్డినెన్స్ ఇచ్చాం. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు,విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్ కు పంపినాము.అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్ కు పంపిన ఇలా అన్ని దశల్లో అవసరమైన చర్యలు చేపడితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొన్ని నెలలుగా బీసీ చట్టం అమల్లోకి రాకుండా అడ్డుకుంటుంది అని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా అడ్డుకున్నది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రమేనని బిజెపి నైజం రాష్ట్ర ప్రజలకే కాదు దేశం మొత్తానికి తెలిసింది అన్నారు.ఈ కార్యక్రమంలో మధిర మండల టౌన్ బీసీ సెల్ నాయకులు చిలువేరు బుచ్చి రామయ్య, బిట్రఉద్దండయ్య, ఏ.ఎం.సి డైరెక్టర్ అద్దంకి రవికుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాణావత్ వెంకటరమణ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్నాటి రామారావు,ఆవుల కిరణ్ కుమార్,తలుపుల వెంకటేశ్వర్లు,బుల్లెద్దు రాజేంద్ర, పత్తేపురపు సంగయ్య,మాగం ప్రసాద్, కోటా దేవిడ్,ఆలకృష్ణ, గొర్రె ముచ్చు విజయరావ్, ఐఎన్టియుసి జిల్లా నాయకులు వేల్పుల అనంత రాములు, మైనార్టీ నాయకులు జహంగీర్, నూర్ మొహమ్మద్, మహమ్మద్ రహీం,షేక్ బాజీ గౌసుద్దీన్, ఫయాజు, కరిముల్లా జాకీర్ హుస్సేన్ స్థానిక సురేష్,దూదేకుల జానీ తదితరులు పాల్గొని బందును విజయవంతం చేశారు.

# కార్తీక మాసంలో సత్తుపల్లి నుండి ప్రత్యేక డీలక్స్ బస్సులు



సత్తుపల్లి అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి ): కార్తీక మాసం సందర్భంగా సత్తుపల్లి డిపో నుండి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అన్నవరం మరియు పంచారామాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి. సునీత తెలిపారు. శనివారం డిపో మేనేజర్ కార్యాలయంలో సత్తుపల్లి ఎంవిఐ శ్రీనివాస్ తో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు సత్తుపల్లి నుండి అన్నవరం , పంచారామాలకు డీలక్స్ బస్సు బయలుదేరి కార్తీక సోమవారం పుణ్యక్షేత్రాలకు చేరుకుంటుందని అన్నారు. అన్నవరం పెద్దలకు చార్జి 570 రూపాయలు, పిల్లలకు చార్జి 330 నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. (ఒకవైపు మాత్రమే). పంచారామాలకు పెద్దలకు చార్జి 1500 రూపాయలు ,పిల్లలకు చార్జి 770 రూపాయలుగా నిర్ణయించినట్లు ఆమె వివరించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 4న కూడా డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు ఆమె తెలిపారు. 30 మంది భక్తులు ఎవరైనా ఉన్నట్లయితే వారికి ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వివరించారు. ప్రయాణికులే దైవంగా భావించి ప్రయాణికుల సౌకర్యార్థం సత్తుపల్లి డిపో నుండి అన్నవరం, పంచారామాలు అయిన పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు.సత్తుపల్లి డిపో పరిధిలోని భక్తులు ఈ సదా అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనివాస్ రావు, అసిస్టెంట్ మేనేజర్ పి విజయ శ్రీ, మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ రాములు, ఆనంద్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో ప్రశాంతంగా బీసీల బంద్

**–బీసీల బంద్ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కుల సంఘాలు**

**–బీసీ బంద్ నేపథ్యంలో మూతపడిన వర్తక వాణిజ్య వ్యాపార సముదాయాలు**



మధిర,అక్టోబర్ 18(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ బందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో అఖిలపక్ష పార్టీలు బీసీ బందుకు మద్దతు తెలిపి బంధు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈరోజు ఉదయం నుండి మధిర ఆర్టీసీ బస్టాండ్ నుండి బస్సులు నిలిపివేశారు ఆర్టీసీ డిపో ముందు అఖిలపక్ష పార్టీలు ధర్నా నిర్వహించారు. మధిర ప్రధాన వీధులలో వర్తక వాణిజ్య వ్యాపారాలను మూసివేశారు వ్యాపారస్తులు కూడా బీసీ బందుకు సహకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, టిడిపి,సిపిఎం, సిపిఐ, బిజెపి పార్టీలతోపాటు ఎమ్మార్పీఎస్ మాల మహానాడు ఇతర కుల సంఘాలు మద్దతు తెలిపి బందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీ నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో బీసీ రిజర్వేషన్ బిల్లును పెట్టి ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిర్యాల వెంకటరమణ గుప్తా, బెజవాడ రవిబాబు సిపిఐ, శీలం నాగేశ్వరరావు, రామ నర్సయ్య సిపిఎం, టిడిపి నాయకులు నాగలవంచ శ్రీను, జిల్లా గౌడ సంఘ అధ్యక్షులు యార్లగడ్డ నరసింహారావు యర్రగుంట రమేష్ మున్నూరు కాపు నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ళ కృష్ణ, టౌన్ సెక్రెటరీ దేవిశెట్టి కృష్ణ లంకిమళ్ళ నాగేశ్వరరావు ఆవుల కిరణ్, తలుపుల వెంకటేశ్వర్లు, దూదేకుల జానీ, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాలిక సురేష్, కర్ణాటిరామారావు, బీసీ సెల్ చిలువేరు బుచ్చయ్య, బిట్రా వుద్దండయ్య మైనార్టీ సెల్ షేక్ జహంగీర్, దండిశెట్టి సంపత్ జానీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మేకల రాజా, వేల్పుల పవన్ కళ్యాణ్, పార్శపు ఎనుక, కాంగ్రెస్ నాయకులు సంగయ్య మోదుగు బాబు, ఆవుల కృష్ణ, చెన్నం స్వామి బాణావతి రమణ నాయక్ వేల్పుల అనంతరామయ్య ఐఎన్టీసీయు అధ్యక్షుడు నూరుద్దీన్ కృష్ణ నాసిం నాగులవంచ శ్రీనివాసరావు టిడిపి, విశ్వబ్రాహ్మణ సంఘ రాష్ట్ర కార్యదర్శి బాణాల శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

# రోగుల పట్ల సేవా భావాన్ని కలిగి ఉండాలి

♦ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

♦ ఖమ్మం వైద్య కళాశాలలో నిర్వహించిన 2025 సంవత్సరపు వైట్ కోట్ సెర్మనిలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ఖమ్మం ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): వైద్య వృత్తి పవిత్రమైనదని, రోగుల పట్ల సేవా భావాన్ని వైద్యులు కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం నిర్వహించిన 2025 సంవత్సరపు వైట్ కోట్ సెర్మనిలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వైద్య కళాశాలలో సీటు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. 3 సంవత్సరాల క్రితం వైద్య కళాశాలను ఖమ్మం జిల్లాకు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.ప్రజలు వైద్యుల పట్ల అపార నమ్మకంతో తమ రోగాలకు చికిత్స చేయించుకునేందుకు వస్తారని, ప్రతి ఒక్కరూ వైద్యులను దైవ స్వరూపంగా చూస్తారని కలెక్టర్ తెలిపారు. ఇటీవల కాలంలో తమ కుటుంబంలోని ఒక సభ్యులకు కీలకమైన సర్జరీ నిమ్స్ ఆసుపత్రిలో విజయవంతంగా జరిగిందని, వైద్యులు లేకుండా మనకు ప్రియమైన వారి ప్రాణాలు కాపాడటం కష్టం అవుతుందని అన్నారు.కోయంబత్తూర్ కు చెందిన అరవింద్ అనే ఆప్తమాలజిస్ట్ తన కెరీయర్ లో వేల మందికి చికిత్స అందించి కంటి చూపు కాపాడారని, అదే విధంగా ఇక్కడ ఉన్న వైద్యులు కూడా సేవా భావంతో ఉండాలని అన్నారు. వైద్య కోర్సులో ప్రాక్టికల్ పరిజ్ఞానం కోసం క్షేత్రస్థాయిలో పి. హెచ్.సి. లలో పని చేస్తున్నప్పుడు మన దగ్గరికి రోగులు వస్తున్నారని దృక్పథంతో పని చేయాలని అన్నారు. విద్యార్థులు రీసెర్చ్ పై దృష్టి సారించాలని, ఫీల్డ్ విజిట్ లో మనకు స్థానికంగా అధికంగా కనిపించే వ్యాధులు, అతుల్ ఘవాండే అనే రచయిత రాసిన చెక్ లిస్ట్ మేనిఫెస్టో అనే పుస్తకం విద్యార్థులు చదవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్న ఒత్తిడిని తట్టుకుంటూ మన విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు చెక్ లిస్ట్ ఎలా తయారు చేసుకోవాలి వంటి అంశాలు క్షుణ్ణంగా ఆ పుస్తకంలో పొందుపర్చారని అన్నారు. ప్రజలకు మన పట్ల ఉన్న నమ్మకాన్ని ఎప్పుడూ నిలబెట్టుకోవాలని కలెక్టర్ తెలిపారు. వైద్యులు నైతిక విలువలను తప్పనిసరిగా పాటించాలని, రోగులు మనతో చెప్పే అంశాలను అనవసరంగా ఇతరులకు తెలియజేయరాదని అన్నారు. మనం చేస్తున్న వృత్తి పట్ల మనకు సంపూర్ణ పట్టు సాధిస్తే మనకు వృత్తి పట్ల అభిరుచి పెరుగుతుందని అన్నారు. వైద్యులు ఎప్పటి కప్పుడు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. 5 సంవత్సరాల ఎంబిబిఎస్ కోర్సు సమయంలో చదువు పట్ల శ్రద్ధ పెట్టాలని, తల్లిదండ్రుల ఆశలను పిల్లలు నెరవేర్చాలని, ప్రతి ఒక్కరూ మంచి వైద్యులుగా ఎదిగి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. శంకర్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, డా. రాజేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాల్ లు డా. సరిత, డా. సృజన, డా. వేణు, డా. కిరణ్ కుమార్, డా. రాంప్రసాద్, వైద్య కళాశాల ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం

♦ పెద్దపల్లి జిల్లా కోర్టు యందు నిర్వహణ



పెద్దపల్లి,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు యందు ఈ రోజు సిపిఆర్ (కార్డియో పల్మనరీ రెసుసిటేషన్) పై అవగాహన కార్యక్రమం శ్రీమతి సునీత కుంచాల, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, పెద్దపల్లి సహకారంతో జిల్లా కోర్టు సిబ్బందికి, అడ్వకేట్ ల కొరకు నిర్వహించడం జరిగింది అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా డా. మౌనిక, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రామగుండం పాల్గొని సిపిఆర్ చేసే విధానంపై ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ ఇచ్చారు. అనంతరం పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డా. వాణిశ్రీ మాట్లాడుతూ, "జీవన శైలి లో మార్పులు తెచ్చుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి, తక్కువ క్రొవ్వు ఉన్న ఆహారం తీసుకోవాలి, ఉప్పు వాడకాన్ని తగ్గించాలి, అధిక బరువు నియంత్రణలో పెట్టు కోవాలి అని సూచించారు. " ఎవరికైనా గుండె ఆకస్మికంగా ఆగితే వెంటనే శ్వాస ఉన్నదో లేదో పరిశీలించాలి, నాడి పనిచేయడం లేదు అని గమనించిన వెంటనే 108 కు సమాచారం ఇచ్చి, సిపిఆర్ చేయడం ద్వారా పునర్జీవితం కల్పించవచ్చు. ఈ పరిజ్ఞానం అందరూ నేర్చుకోవడం ద్వారా గుండె ఆగిన వారి గుండెను పునర్ పని చేసేలా చేసే ఒక ప్రక్రియ అని అన్నారు. జిల్లా జడ్జి శ్రీమతి కె.సునీత, గారు మాట్లాడుతూ కోర్టు సిబ్బంది, అడ్వకేట్ లు ఈ ప్రక్రియ యందు అవగాహన పెంపొందించు కోవాలి అని అన్నారు. ఈ కాలంలో జీవన శైలి మార్పుల వల్ల గుండె స్ట్రోక్ చాలా మందికి వస్తుంది. ఎవరికైనా గుండె ఆగిన సందర్భం లో సరియైన సమయంలో స్పందించి సి పి ఆర్ చేసి ప్రాణాలను రక్షించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ, సెక్రటరీ శ్రీమతి కె.స్వప్న రాణి , ప్రోగ్రామ్ అధికారి డా. ఆర్. రాజమౌళి, డా. బి. కిరణ్ కుమార్, డా. మమత, న్యాయవాదులు మరియు జిల్లా న్యాయ స్థాన కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ ఘన మద్దతు





సత్తుపల్లి అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): సత్తుపల్లిలో తెలంగాణ బీసీ సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన బీసీ బంద్ కు బీఆర్ఎస్ పార్టీ ఘన మద్దతు తెలిపింది. సత్తుపల్లి పట్టణంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బీసీ హక్కుల కోసం బంద్ కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కూసంపూడి మహేష్ మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ న్యాయసమ్మతమని పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం తెలంగాణ అభ్యున్నతికి ముఖ్యమైన అడుగు అవుతుందని తెలిపారు. బీసీ వర్గాలు నిలదొక్కుకోవాలంటే రిజర్వేషన్లు తప్పనిసరి అంటూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ డిమాండ్ పై స్పందించాలని కోరారు. బీసీ వర్గాల సమగ్రమైన అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. బీసీ సమాజం హక్కుల సాధనలో బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు ఇసుక దొరక్క ఇబ్బందులు

**–పట్టించుకునే నాథుడే లేడా?**



గద్వాల,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఉచిత ఇసుక పంపిణీ చేస్తుండగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రెండు నియోజకవర్గాలలో మాత్రం అధికార పార్టీకి చెందిన నాయకుల రాజకీయానికి లబ్ధిదారులకు ఇసుక పంపిణీ జరగక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుంగభద్ర నదిలో తుమ్మిళ్ళ దగ్గర ఇసుక రీచ్ ను దక్కించుకున్న ఏపీ కాంట్రాక్టర్ తన దారికి రాకుండా ఎటువంటి అంతరాయం లేకుండా పథక ప్రారంభంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక సరఫరా చేస్తూ వచ్చాడు.

అయితే తనను కలవకుండా, వాటా ఇవ్వకుండా ఇసుక రీచ్ పనులను కొనసాగిస్తుండగా రోడ్లు దెబ్బతింటాయనే కారణంతో ఓ మాజీ ప్రజా ప్రతినిధి స్థానిక అనుచరుల చేత టిప్పర్లను నిలిపి వేయించారని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు 7.25 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక దీంతో ఇసుక రవాణా గత 6 రోజులుగా నిలిచిపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుకను రవాణా చేసే టిప్పర్లు రాజోలి మండలం తుమ్మిళ్ళ రీచ్ దగ్గరే ఉండిపోవాల్సి వచ్చింది. లబ్ధిదారులు ఆన్లైన్ లో ఇసుకకు బుక్ చేసుకుంటున్నారు. కాంట్రాక్ట్ ఒప్పందం మేరకు 7.25 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను వివిధ పథకాలు, అవసరాలకు సరఫరా చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పథకాలకు, ఇతర ఆన్లైన్ బుకింగ్ లకు సరఫరా చేస్తుండగా అధికార పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధికి మింగుడు పడడం లేదు. కొన్నాళ్లు తమ వారి వాహనాలే వాడాలని కండిషన్ పెట్టగా, అందులో కొన్ని టిప్పర్లకు బిల్లింగ్ లేకుండా అనుమతి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారనే విమర్శలు ఉన్నాయి. నేడు ఏకంగా తన పర్సంటేజ్ కోసం అనేక వాహనాలను నిలిపివేయించాడని టిప్పర్ల యజమానులు వాపోతున్నారు. ఏకంగా నేటికీ ఆరు రోజులు కావడంతో ఇసుకరా సరఫరా చేయాలని కలెక్టర్కు సైతం లబ్ధిదారులు మొరపెట్టుకున్నారు ప్రభుత్వ లక్ష్యాలకు మైనింగ్ శాఖ తిలోదకాలు ప్రభుత్వ పథకాలకు ఎటువంటి అంతరాయం లేకుండా ఇసుక సరఫరా అయ్యేలా చూడాల్సిన మైనింగ్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఎస్ బాస్ అనే పరిస్థితిలో కాలం వెళ్ల దీస్తున్నారని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. రాజోలి మండలంలోని పలు గ్రామాలలో అనధికారికంగా ప్రైవేట్ వ్యక్తులు ఇసుక డంపులు నిలువ చేసుకొని టిప్పర్ ఇసుకను స్థానికంగా 20 వేలకు, దూర ప్రాంతాలకు 40 వేలకు పైగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు అనుమతుల పేరుతో ప్రైవేట్ గా అమ్ముకుంటూ అక్రమ దందాతో కొందరు కోట్లకు పడగలెత్తుతున్నారు పట్టించుకునే నాథుడే లేడా? ఈ వ్యవహారమంతా అధికారులకు తమకేమీ పట్టనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఆ అధికారి సైతం ఎవరికి అందుబాటులో ఉండడని కేవలం కొందరికి మాత్రమే ఫోన్ లో అందుబాటులో ఉంటారనే విమర్శ ప్రజల్లో బలంగా ఉంది. జిల్లా కేంద్రంలో సైతం మొరం టిప్పర్లు యతేచగా ప్రభుత్వ గుట్టలను వ్యతిరేక తవుతున్న పట్టించుకునే నాథుడే లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సహజ వనరులను అధికార పార్టీ ముసుగులో రాజకీయ నాయకుల కనుసన్నలలో కొందరు అక్రమార్కులు మట్టి ఇసుక రవాణా చేస్తున్న బైండింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసి అరికట్టాల్సింది పోయి ప్రభుత్వానికి వచ్చే రాయల్టీని సైతం పట్టించుకోకుండా కొందరి రాజకీయ నాయకుల అనుచరులు చేసే దందాను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

# తెలంగాణ బంద్ లో బిజెపి పార్టీ బైక్ ర్యాలీ



మంథని, అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): తెలంగాణ లోని బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్టసభలలో విద్యా, ఉద్యోగ ఉపాధి రంగాలలో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని ప్రధాన డిమాండ్ తో బీసీ సంఘాల ఐక్యవేదిక అఖిలపక్ష పార్టీల ప్రజా సంఘాల ఇచ్చిన తెలంగాణ బంధు పిలుపులో భాగంగా శనివారం బిజెపి పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు బిజెపి మంథని పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌక్ నుండి బిజెపి శ్రేణులు అధిక సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పురవీధుల గుండా వ్యాపార వాణిజ్య సంస్థలు విద్యాసంస్థలు ఆటోలు హోటల్ లు అన్ని దుకాణాల సముదాయాలను బంద్ చేయించారు. అనంతరం పాత పెట్రోల్ బంక్ దగ్గర రాస్తారోకో నిర్వహించి బీసీల రిజర్వేషన్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించ. ఈ కార్యక్రమంలో బిజెపి మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్, బీసీ నాయకులు పెండ్యాల రామ్ కుమార్, నాయకులు బూడిద తిరుపతి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండపాక సత్య ప్రకాష్, రాపర్తి సంతోష్ , అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్ , ఓబిసి మోర్చ మండల అధ్యక్షులు రేపాక శంకర్, సీనియర్ నాయకులు చిలివేరి సతీష్ , బోయిని నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శిలు సామల అశోక్, ఎడ్ల సాగర్, పట్టణ ఉపాధ్యక్షులు ఆకుల అరుణ్, బొల్లంపల్లి లక్ష్మణ్ మండల ఉపాధ్యక్షుడు సుంకరి రాకేష్, పట్టణ కార్యదర్శి పార్వతి విష్ణు, పట్టణ కోశాధికారి వొడ్నాల శ్రీనివాస్, బిజెపి నాయకులు గుడ్ల గురువేష్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలి


♦ బీసీ సంఘాల జేఏసీ



హుజురాబాద్ ఇల్లందకుంట ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): బీసీల రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఇల్లందకుంట మండల కేంద్రంలో బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత బంద్ జరిగింది. ఈ బంద్‌లో బీసీ సంఘాలతో పాటు కాంగ్రెస్, సీపీఐ, యం.ఆర్.పి.ఎస్. ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పెద్ది కుమార్, ఇంగ్లే రామారావు, అన్నం ప్రవీణ్, గుండ్ల గణపతి, తిరుమల మాట్లాడుతూ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు 42% శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, కుల గణన పూర్తి చేసి, రాష్ట్ర శాసన సభలో ఆమోదం పొందిన బిల్లును గవర్నర్ కేంద్రానికి పంపి 3 నెలలు గడుస్తున్నా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రిజర్వేషన్లు బీసీల న్యాయమైన హక్కని, ఇది ఎవరికీ వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు లేకపోవడం వలన బీసీలు వెనుకబాటుకు గురవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి, పార్లమెంటులో చట్టం చేసి, 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరి శ్రీనివాస్, మాదారపు రత్నాకర్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేస్తున్నది బీజేపీయే

♦ సీపీఎం మండల కార్యదర్శి శీలం అశోక్



హుజురాబాద్/జమ్మికుంట,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ, బీసీలను మోసం చేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి శీలం అశోక్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, గవర్నర్‌కు పంపిన బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించకపోవడం సిగ్గుచేటని అన్నారు.42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మోత్కులగూడెం చౌరస్తా నుండి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శీలం అశోక్ మాట్లాడుతూ, కేంద్రం బిల్లును ఆమోదించకుండానే బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు.రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందకపోవడం వలన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్ బిల్లును వెంటనే తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని ఆయన కేంద్ర బీజేపీ సర్కార్‌ను డిమాండ్ చేశారు. గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్‌ను ఆమోదించకుండా కాలయాపన చేయడం వల్లే జీవో నెంబర్ 9 అమలు నిలబడలేదని, దీనికి పూర్తి బాధ్యత బీజేపీ వహించాలని అన్నారు. తెలంగాణలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లును ఆమోదింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు జక్కుల రమేష్ యాదవ్, దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# బిజినెస్



## ఫిజికల్ షేర్ల బదిలీ సులువు!

ఇప్పటికీ చాలా మంది దగ్గర ఫిజికల్ షేర్లు ఉండి ఉండొచ్చు. వీటిని డీమ్యాట్‌లోకి మార్చడానికి మదుపర్లు పడే కష్టాలు ఎక్కువే. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి సెబీ ప్రతిపాదనలు చేస్తోంది. 2019 ఏప్రిల్ 1 కన్నా ముందు, వీటి బదిలీకి దరఖాస్తు పెట్టుకున్న వాటిలో కన్ఫర్మేషన్ (ఎల్‌ఓసీ) జారీ చేయడాన్ని తొలగిస్తోంది. 2019 ఏప్రిల్ 1కి ముందు దరఖాస్తు ప్రస్తుత ప్రక్రియలో ఉన్న లెటర్ ఆఫ్ అమలు చేయనుంది. ఇందుకు అమలవుతున్న ప్రక్రియలోని అనవసర అంశాలను తొలగించాలని సెబీ నిర్ణయించింది. 'పాత షేర్ల బదిలీకి నిబంధనలను తాత్కాలికంగా సడలించాలని' ప్రతిపాదించింది. ఈ మినహాయింపు నిర్దిష్ట కాలం వరకే ఉంటుంది. కంపెనీ లేదా రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్(ఆర్‌టీఏ) తనిఖీ పూర్తయితే, ఆ షేర్లు నేరుగా మదుపర్లకు చెందిన డీమ్యాట్ ఖాతాలో జమ అవుతాయి. ఈ ప్రతిపాదనతో పాటు చేసుకున్న వారికి, ఒకవేళ అవి తిరస్కరణకు గురి అయిన పక్షంలో మరోసారి అవకాశం ఇస్తూ 2021 మార్చి 31 వరకు సెబీ గడువు ఇచ్చింది. వేర్వేరు కారణాల వల్ల మదుపర్లు కొందరు ఆ సమయాన్ని వినియోగించుకోలేకపోయారు. మళ్లీ ఈ ఏడాది జులై 7 నుంచి 2026 జనవరి 6 వరకు బదిలీ పత్రాలను తిరిగి సమర్పించ డానికి అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే.

## జియోకు 3 నెలల్లో రూ. 2.59 లక్షల కోట్ల ఆదాయం

దేశంలోని దిగ్గజ కంపెనీలు వరుసగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 రెండో త్రైమాసికం2 (జులై- సెప్టెంబర్) ఫలితాల్ని ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా ఐటీ దిగ్గజకంపెనీలు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తర్వాత టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్ ఇలా అన్నీ వరుసగా ఫలితాల్ని ప్రకటించేశాయి. ఇప్పుడు ఇతర కంపెనీల వంతు వచ్చింది. అక్టోబర్ 17న దేశంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా అతిపెద్ద కంపెనీ.. దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రెండో త్రైమాసికం ఫలితాల్ని వెల్లడించింది. ఇక్కడ మరోసారి రిలయన్స్.. మార్కెట్ అంచనాల్ని మించి రాణించడం విశేషం. సమీక్షా త్రైమాసికంలో రిలయన్స్ నికర లాభం రూ. 18,165 కోట్లుగా వచ్చింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ నికర లాభం రూ. 16,563 కోట్లుగా ఉండగా.. ఇది 10 శాతం పెరిగింది. కంపెనీ కార్యకలాపాల ఆదాయం ఇదే సమయంలో రూ. 2.59 లక్షల కోట్లుగా వచ్చింది. కిందటేడాది ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ. 2.35 లక్షల కోట్లుగా ఉండగా.. ఇక్కడ కూడా 10 శాతం వృద్ధి నమోదు చేసింది. ప్రాఫిట్ ఆఫ్టర్ టాక్స్ విషయానికి వస్తే మాత్రం మార్కెట్ అంచనాలు తప్పడం గమనార్హం. ఇది రూ. 18,643 కోట్లుగా వచ్చింది. ఇక టాప్ లైన్.. అంచనాల్ని మించి రూ. 2.51 లక్షల కోట్లుగా నమోదైంది. స్థూల ఆదాయం కూడా వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ. 2.83 లక్షల కోట్లుగా ఉంది. కంపెనీ ఎబిటా విషయానికి వస్తే.. అంటే ఇక్కడ వడ్డీ, పన్ను కలుపుకొని ఆదాయం చూస్తే రూ. 50,367 కోట్లుగానే ఉంది. ఇది వార్షిక ప్రాతిపదికన 15 శాతం ఎగబాకింది. ఎబిటా మార్జిన్ 17.8 శాతంగా ఉంది. ఇది అంతకు ముందు ఇదే సమయంతో పోలిస్తే 80 బేసిస్ పాయింట్ల మేర పెరిగింది. సెగ్మెంట్ల వారీగా చూస్తే.. జియో ప్లాట్‌ఫామ్స్ ఆదాయం 14.9 శాతం పెరిగి.. రూ.7,379 కోట్లుగా నమోదైంది. జియో ఆర్పు (యూజర్ నుంచి నెలకు సగటు ఆదాయం) రూ.211.4కు పెరిగింది. అంతకు ముందు ఇదే సమయంలో ఇది రూ. 195.1గా ఉండేది. రిలయన్స్ రిటైల్ విభాగం రిలయన్స్ రిటైల్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 18శాతం పెరిగింది. ఆయిల్ టు కెమికల్స్ విభాగం ఆదా యం స్వల్పంగా 3.2 శాతం పెరిగింది. ఆయిల్ అండ్ గ్యాస్ సెగ్మెంట్ ఆదాయం 2.6 శాతం తగ్గింది. ఫలితాల నేపథ్యంలో.. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ ధర పుంజుకుంది. శుక్రవారం రోజు 1.49 శాతం పెరిగి రూ. 1419.10 వద్ద సెషన్ ముగించింది. ఇంట్రాడేలో రూ.1423.30 వద్ద గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 19.17 లక్షల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ.1551 కాగా.. కనిష్ట ధర రూ. 1114.85గా ఉంది.




## ఎంఇఐఎల్‌కు కువైట్ కంపెనీ భారీ ఆర్డర్

కువైట్ ఆయిల్ కంపెనీ (కెఒసి) నుంచి భారీ ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) వెల్లడించింది. కెఒసి నుంచి ఏకంగా 225.5 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1984 కోట్లు) విలువైన ఈ ప్రాజెక్ట్ ఆర్డర్‌తో మరో అంతర్జాతీయ మైలురాయిని అధిగమించామని ఆ సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. కెఒసి బూస్టర్ స్టేషన్ బిఎస్ 171 సమీపంలో ఈ ప్లాంట్ ను 790 రోజుల్లో ఎంఇఐఎల్ నిర్మించి ఆ తరువాత ఐదు సంవత్సరాల పాటు నిర్వహించడానికి ఒప్పందం కుదర్చుకుంది. బిల్డ్ ఓన్ ఆపరేట్ పద్ధతిలో వెస్ట్ కువైట్ ఆయిల్‌ఫీల్డ్స్‌లో కొత్త గ్యాస్ స్వీటెనింగ్, సల్ఫర్ రికవరీ ఫెసిలిటీ (ఎన్‌జిఎస్‌ఎఫ్ ) రూపకల్పన, నిర్మాణ, నిర్వహణ, సంరక్షణ బాధ్యతలను ఎంఇఐఎల్ చేపట్టనుంది. ఎస్‌ఆర్‌యులో నాలుగు శాతం హైడ్రోజన్ సల్ఫైడ్, 10 శాతం వరకు కార్బన్ డైఆక్సైడ్ ఉన్న 120 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ ఫీట్ల (ఎంఎంఎస్‌సిఎఫ్‌డి) సౌర్ గ్యాస్‌ను శుద్ధి చేసే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంఇఐఎల్ ఏర్పాటు చేయనుంది. సహజ వాయువులోని తేమను తొలగించి, పర్యావరణానుకూలమైన, శుభ్రమైన, వినియోగానికి సురక్షితమైనదిగా మార్చే గ్యాస్ స్వీటెనింగ్ ప్రక్రియను నిర్మించనుంది. "పశ్చిమ కువైట్‌లోని ఈ వ్యూహాత్మక గ్యాస్ స్వీటెనింగ్ ఫెసిలిటీ నిర్మాణంలో భాగస్వామ్యం అవ్వడం మాకు గర్వకారణం. ఈ ప్రాజెక్ట్ మా సంస్థ పర్యావరణ భద్రత, సాంకేతిక నాణ్యత, ఆపరేషనల్ సామర్థ్యానికి ప్రతిబింబం. ప్రపంచస్థాయి ఇంధన మౌలిక సదుపాయాలను అందించడంలో మా సమర్థతను ఇది మరింత బలోపేతం చేస్తుంది" అని ఎంఇఐఎల్ డైరెక్టర్ పి దొరయ్య పేర్కొన్నారు.

## ఇకపై 36 నెలలు ఆగాల్సిందే.. పీఎఫ్‌లో మారిన ఈ రూల్స్

ఉద్యోగుల కోసం ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పుడు జాబ్ పోయినా, పీఎఫ్ డబ్బులు తీసుకోవడం చాలా ఈజీ అయింది. జాబ్ లేకపోతే పీఎఫ్ డబ్బుల్లో 75శాతం వరకు వెంటనే తీసుకోవచ్చు, మిగిలిన 25శాతం ఒక సంవత్సరం తర్వాత తీసుకోవచ్చు. అయితే పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి మాత్రం 36 నెలలు ఆగాల్సి ఉంటుంది. ఉద్యోగులకు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ మరో గుడ్ న్యూస్ తెలిపింది. పీఎఫ్ విషయంలో కీలక మార్పులు చేసింది. ఈ రూల్స్ మనీ విత్ డ్రాను మరింత ఈజీగా మార్చనున్నాయి. జాబ్ కోల్పోయిన ఉద్యోగుల కోసం ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకుంది. ఒక వ్యక్తికి ఉద్యోగం పోయి, ఖాళీగా ఉంటే, వాళ్ళు తమ పీఎఫ్ డబ్బుల్లో 75శాతం వరకు వెంటనే తీసేసుకోవచ్చు. ఇంకా ఉద్యోగం దొరకకపోతే మిగిలిన 25శాతం డబ్బును ఒక సంవత్సరం తర్వాత తీసుకోవడానికి అవకాశం ఉంది. ఇక్కడ నిరాశ కలిగించే విషయం ఏంటంటే.. జాబ్ పోయిన తర్వాత మీ పెన్షన్ స్కీమ్ డబ్బులు తీసుకోవాలంటే ఇకపై కేవలం 2 నెలలు కాదు.. ఏకంగా 36 నెలలు ఆగాల్సి ఉంటుంది. భవిష్యత్తులో మీకు లేదా మీ కుటుంబానికి పెన్షన్ ప్రయోజనాలు దక్కేలా చూసేందుకే ఈ మార్పు అని ప్రభుత్వం చెబుతోంది. ఆర్థిక భద్రతను ప్రోత్సహించాలనేదే తమ లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది.




## విదేశీ మారకం నిల్వల్లో పతనం

భారతదేశ విదేశీ మారకం నిల్వల్లో మరోమారు తగ్గుదల చోటు చేసుకుంది. అక్టోబర్ 10తో ముగిసిన వారంలో 2.18 బిలియన్ డాలర్లు తగ్గి 697.78 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. ఇది ఇంతక్రితం వారం అక్టోబర్ 3న నమోదైన 699.96 బిలియన్లతో పోల్చితే తగ్గుదలను సూచిస్తుందని పేర్కొంది. ఫారెక్స్ నిల్వలలో ప్రధాన భాగం అయినా విదేశీ కరెన్సీ ఆస్తులు సమీక్షా వారంలో 5.61 బిలియన్ డాలర్లు తగ్గి 572.10 బిలియన్లకు పరిమితమయినట్టు ఆర్బీఐ తెలిపింది. ఈ ఆస్తులలో యూరో, యెన్, పౌండ్ వంటి కరెన్సీలు డాలర్‌తో పోలిస్తే విలువలో హెచ్చు తగ్గులు చెందడం ఈ తగ్గుదలకు కారణం. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడంతో ఈ విలువ తగ్గింది. అదే సమయంలో బంగారం నిల్వలు 3.60 బిలియన్లు పెరిగి 102.37 బిలియన్లకు చేరాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్) 18.68 బిలియన్ డాలర్లకు తగ్గాయని వెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారతదేశ నిల్వలు 36 మిలియన్ డాలర్లు తగ్గి 4.63 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి.




# ఆట

## ట్రావిస్ హెడ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

భారత్ - ఆస్ట్రేలియా మధ్య సమరానికి మరికొద్ది గంటలే మిగిలున్నాయి. అక్టోబర్ 19 నుంచి ఆసీస్ వేదికగా మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు నుంచి రోహిత్ - కోహ్లి భవిష్యత్ ఏంటి అనేది అభిమానుల్లో పెద్ద చర్చే జరుగుతోంది. ఈ ఇద్దరూ 2027 వన్డే వరల్డ్ కప్ ఆడతారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఈ ఊహాగానాల నడుమ ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. మొదటి వన్డేకు రెండు రోజుల ముందు, పెర్త్ ఆప్టస్ స్టేడియంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ట్రావిస్ హెడ్, భారత ఆల్ రౌండర్ అక్షర్ పటేల్‌తో కలిసి మాట్లాడాడు. రోహిత్ - విరాట్‌ల గురించి ప్రశ్న రాగానే హెడ్ ప్రశంసల వర్షం కురిపించాడు. 'వీరిద్దరూ అద్భుతమైన ఆటగాళ్లు. భారత్ కోసం ఎన్నో విజయాలను అందించారు. విరాట్ కోహ్లి నిస్సందేహంగా ప్రపంచంలోనే ఉత్తమ వైట్ బాల్ ప్లేయర్. రోహిత్ కూడా అంతే. ఓపెనర్‌గా ఆయన చేసిన కృషి గొప్పది' అని హెడ్ అన్నాడు. తర్వాత కొంచెం నవ్వుతూ అక్షర్ వైపు తిరిగి చూస్తూ 'నాకు అనిపిస్తోంది వీరిద్దరూ 2027 వరల్డ్‌కప్ వరకు ఆడతారని. వీరిద్దరూ ఇంకా ఆ టోర్నీ కోసం సిద్ధమవుతున్నారు. ఈ ఇద్దరు ఇంకా ఆడుతుండటం ఆటకే మేలని నేను భావిస్తున్నాను' అని చెప్పడంతో అక్షర్ పటేల్ చిరునవ్వు చిందించాడు. తన వంతుగా అక్షర్ పటేల్ స్పందిస్తూ 'వీరిద్దరూ వరల్డ్ క్లాస్ ప్లేయర్లు. వాళ్లకు ఏం చేయాలో బాగా తెలుసు. వాళ్లు సిద్ధంగా ఉన్నారు. ప్రొఫెషనల్‌గా వ్యవహరించడం వాళ్ల ప్రత్యేకత. ఫిట్‌నెస్ టెస్టులు కూడా పూర్తి చేశారు. మొదటి వన్డేకు అందరూ రెడీ. గిల్ నాయకత్వంలో ఉన్నప్పటికీ, రోహిత్ - కోహ్లి ఉండటం జట్టుకు ధైర్యం ఇస్తుంది' అని పేర్కొన్నాడు. భారత జట్టు గురువారం ఉదయం ఆస్ట్రేలియా చేరుకుంది. రోహిత్, కోహ్లి ఇద్దరూ ఇప్పటికే రెండు సాధన సెషన్లలో పాల్గొన్నారు. ప్రాక్టీస్ సెషన్‌లలో ఈ ఇద్దరు గౌతమ్ గంభీర్‌తో చర్చల్లో పాల్గొన్నట్లు సమాచారం. కెప్టెన్సీ కోల్పోయిన తర్వాత రోహిత్ తన ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టగా, టెస్టులకు రిటైర్మెంట్ ఇచ్చిన తర్వాత కోహ్లి కూడా తన కమ్ బ్యాక్ గట్టిగా ఇవ్వాలని కసిగా ఉన్నాడు.



## మొహ్సిన్ నఖ్వీకి మద్దతు పలికిన మహమ్మద్ యూసుఫ్



పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహమ్మద్ యూసుఫ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచాడు. ఆసియా కప్ 2025 ట్రోఫీ వివాదంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీకి మద్దతు పలికాడు. భారత జట్టు ప్రవర్తనను తప్పుబడుతూ, వారికి ట్రోఫీ ఇవ్వకపోవడమే సరైన చర్య అని వ్యాఖ్యానించాడు. ఆసియా కప్ ఫైనల్ గెలిచిన తర్వాత బహుమతి ప్రదానోత్సవం సందర్భంగా టీమిండియా, ఏసీసీ అధ్యక్షుడు కూడా అయిన మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించేందుకు నిరాకరించింది. దీంతో నఖ్వీ ట్రోఫీని భారత జట్టుకు అందజేయకుండా తనతో పాటే తీసుకెళ్లారు. ఈ ఘటనపై పాకిస్థాన్‌కు చెందిన 'సమా టీవీ' ఛానెల్‌తో యూసుఫ్ మాట్లాడాడు. "ఛైర్మన్ (మొహ్సిన్ నఖ్వీ) చేసింది పూర్తిగా సరైనదే. ఆయన సరైన నిర్ణయమే తీసుకున్నారు" అని యూసుఫ్ అన్నాడు. "ఏసీసీ, ఐసీసీ నిబంధనల ప్రకారం, ఆయన అక్కడ ఏసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్నారు. ఆయన చేతుల మీదుగానే ట్రోఫీని తీసుకోవాలి. ఆ సమయంలో మీరు తీసుకోలేదు. మరిప్పుడెందుకు ఆ తొందర? ట్రోఫీ గుర్తుకువచ్చినప్పుడు ఆయన ఆఫీసుకు వెళ్లి తెచ్చుకోవాల్సింది" అని పేర్కొన్నాడు. అంతటితో ఆగకుండా భారత జట్టుపై యూసుఫ్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. "మైదానంలో మీరు మీ సినిమాలు తీసుకుంటూ బిజీగా ఉన్నారు. నేను ఆ రోజే చెప్పాను. వాళ్లు సినిమా ప్రపంచం నుంచి బయటకు రావడం లేదు. ఇది క్రీడ, ఇది క్రికెట్. ఇక్కడ సినిమాలు నడవవు. సినిమాల్లో రీటేక్‌లు ఉంటాయి కానీ, క్రీడల్లో అలా కాదు.

## తోటి ప్లేయర్ల మృతిపై స్పందించిన రషీద్ ఖాన్, రహ్మతుల్లా

శుక్రవారం అర్ధరాత్రి పాకిస్తాన్ వైమానికదళం చేసిన దాడిలో ముగ్గురు ఆఫ్ఘాన్ క్రికెటర్లు సహా 8 మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా ఈ ఎయిర్ స్ట్రైక్ లో మృతి చెందినది ఆఫ్ఘాన్ ప్లేయర్లే అని ఆ దేశ క్రికెట్ బోర్డు అధికారికంగా ధృవీకరించింది. దీంతో పాకిస్తాన్ తీరుపై ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వస్తుంది. ఇదిలా ఉంటే తోటి ప్లేయర్ల మృతిపై ఆ దేశ స్టార్ ప్లేయర్ రషీద్ ఖాన్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆయన తన ట్వీట్‌లో "పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్‌పై జరిపిన వైమానిక దాడుల్లో పౌరులు మరణించడం నాకు చాలా బాధ కలిగించింది. ప్రపంచ వేదికలపై తమ దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కలలు కన్న మహిళలు, పిల్లలు, ఆశావహ యువ క్రికెటర్ల ప్రాణాలను బలిగొన్న విషాదం ఇది. పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం పూర్తిగా అనైతికం, అనాగరికం. ఈ అన్యాయమైన, చట్టవిరుద్ధమైన చర్యలు మానవ హక్కుల తీవ్ర ఉల్లంఘనను సూచిస్తాయి. ఈ పరిణామాల మధ్య పాకిస్తాన్‌తో జరగబోయే మ్యాచ్‌ల నుండి వైదొలగాలనే నిర్ణయాన్ని నేను స్వాగతిస్తున్నాను. ఈ క్లిష్ట సమయంలో నేను నా దేశ ప్రజలతో నిలబడతాను, నాకు నా జాతీయ గౌరవం అన్నింటికంటే ముందుండాలి" అని రాసుకొచ్చాడు. అలాగే మరో ప్లేయర్ రహ్మతుల్లా ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. ఆయన తన ట్వీట్‌లో "ఈ అణచివేతల ద్వారా అమాయక పౌరులను, మన దేశీయ క్రికెట్ ఆటగాళ్లను ఊచకోత కోయడం దారుణమైన, క్షమించరాని నేరం. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అమరవీరులకు స్వర్గంలో అత్యున్నత స్థానాన్ని ప్రసాదిస్తారు. నేరస్థులను అవమానించి, వారిని తన కోపానికి గురిచేస్తారు. పాకిస్తాన్ మా ఆటగాళ్లను, పౌరులను చంపడం గౌరవం కాదు. ఇది అత్యంత అవమానకరం. ఈ రోజు పాక్ దుష్చర్యను ఆఫ్ఘనిస్తాన్ అంతటా ఆగ్రహాన్ని రేకెత్తించింది. చాలామంది దీనిని పౌరులపైనే కాకుండా దేశ క్రీడా స్ఫూర్తిపై కూడా దాడిగా అభివర్ణించారు.



## ఆటగాడిగా కామెంటేటర్‌గా కన్నా ఎక్కువ ఒత్తిడి ఉంటుంది

భారత క్రికెట్ జట్టు చీఫ్ సెలెక్టర్ పదవి తన కెరీర్‌లోనే అత్యంత కఠినమైన సవాలు అని మాజీ పేసర్ అజిత్ అగార్కర్ అన్నాడు. ఆటగాడిగా, కామెంటేటర్‌గా పనిచేసినప్పటికన్నా సెలెక్టర్‌గా తీవ్రమైన ఒత్తిడి ఉంటుందని అభిప్రాయపడ్డాడు. ఎన్‌డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2025లో అగార్కర్ ఈ కీలక వ్యాఖ్యలు చేశాడు. తన క్రికెట్ ప్రయాణంలోని మూడు దశలను పోలుస్తూ అగార్కర్ మాట్లాడాడు. "ఈ మూడింటిలో కామెంటేటర్ పనే చాలా తేలిక. సరైన సమయంలో సరైన పదాలు మాట్లాడితే చాలు, పని పూర్తవుతుంది. ఇక ఆటగాడిగా దొరికే సంతృప్తి మరెక్కడా ఉండదు. మైదానంలో ఉన్నప్పుడు మన ప్రదర్శన మన చేతుల్లోనే ఉంటుంది. గెలుపోటములను మన ఆటతీరే నిర్దేశిస్తుంది" అని వివరించాడు. అయితే, సెలెక్టర్ బాధ్యత వీటన్నిటికీ పూర్తి భిన్నంగా ఉంటుందని పేర్కొన్నాడు. "సెలెక్టర్‌గా ఒకసారి 15 మంది సభ్యులతో జట్టును ఎంపిక చేశాక, మాచేతుల్లో ఏమీ ఉండదు. మేం తీసుకునే ఒక్కో నిర్ణయం ఆట గాళ్ల కెరీర్‌ను తీవ్రంగా ప్రభా వితం చేస్తుంది. అందుకే ఇది చాలా పెద్ద బాధ్యత. మేం అందరినీ సంతోషపెట్టలేం. కానీ మాకు అందుబాటులో ఉన్న సమాచారంతో అత్యుత్తమ జట్టును ఎంపిక చేసేందుకు ప్రయత్నిస్తాం" అని వివరించాడు. భారత్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఎక్కువ సంఖ్యలో ఉండటం కూడా సెలక్షన్ ప్రక్రియను మరింత సవాలుగా మారుస్తోందని అగార్కర్ తెలిపాడు. దేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ వల్ల నిర్ణయాలపై విమర్శలు రావడం సహజమేనని అంగీకరించాడు.





## ఆల్‌టైమ్ రికార్డుకు ఒక్క అడుగు దూరంలో కోహ్లీ!

స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ సుమారు ఏడు నెలల సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ నెల 19న ఆస్ట్రేలియాతో జరగబోయే తొలి వన్డే మ్యాచ్‌తో కింగ్ కోహ్లీ తిరిగి భారత జెర్సీలో కనిపించనున్నాడు. అభిమానులందరూ అతడి ఆటను చూడటానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్న వేళ, ఈ సిరీస్ విరాట్‌కు ఒక అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. క్రికెట్ చరిత్రలోనే 148 ఏళ్లలో ఏ ఆటగాడు అందుకోని మైలురాయిని చేరుకోవడానికి విరాట్ కోహ్లీ కేవలం ఒకే ఒక్క సెంచరీ దూరంలో ఉన్నాడు. ఏడు నెలల సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి వస్తున్నప్పటికీ, ఆస్ట్రేలియాతో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో కోహ్లీ ఒక సెంచరీ సాధిస్తే, సింగిల్ ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన ప్లేయర్‌గా చరిత్రకెక్కుతాడు. ప్రస్తుతం ఈ అరుదైన రికార్డును క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో విరాట్ కోహ్లీ పంచుకుంటున్నాడు.



# పాలకంటే ఎక్కువ కాల్షియం అందించే గింజలు..!



ప్రస్తుతం చాలామందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ఎముకల బలహీనత ఒకటి. ముఖ్యంగా చలికాలంలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఉరుకులూ.. పరుగుల జీవితంలో పోషకాహారాన్ని విస్మరించడం, పలు కారణాలవల్ల శరీరంలో కాల్షియం లోపించడం వల్ల ఈసమస్య తలెత్తుతుంది. అయితే అలాంటి ప్రాబ్లంరాకుండా ముందుగానే నివారించగల సహజ సిద్ధమైన చక్కటి పరిష్కారం ఒకటుంది. అదే అధిక కాల్షియం కలిగిన ఆహారం తీసుకోవడం.ఎముకల బలహీనత వల్ల శరీరం శక్తి హీనంగా మారుతుంది. ఏ పనులూ చేసుకోలేకపోతారు. అలసట, ఇతర అనారోగ్యాలు సైతం వేధిస్తాయి. అలా జరగకుండా కాల్షియం ఉండే ఆహారం, పానీయాలు తీసుకోవాలి. పాలల్లో సహజంగానే ఇది ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రతిరోజూ పాలు తాగడం మంచిదని నిపుణులు చెబుతుంటారు. అయితే పాలకంటే కూడా ఎక్కువ కాల్షియం నువ్వుల్లో ఉంటుందని కూడా పోషకాహార నిపుణులు అంటున్నారు. 100 గ్రాముల నువ్వుల్లో దాదాపు 975 మి.గ్రా. కాల్షియం ఉంటుంది. అంటే ఇది పాలకంటే 6 రెట్లు ఎక్కువ కాబట్టి ఆహారంలో భాగంగా ఈ గింజలను తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నువ్వుల్లో జింక్, మెగ్నీషియం వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కీళ్లకు బలాన్నిస్తాయి. కార్టిలేజ్ మరమ్మతును, ఎముక సాంద్రతను పెంచుతాయి. అంతేకాకుండా ఈ గింజల్లో కాపర్, విటమిన్ దీ6 ఉండటంవల్ల కీళ్లలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. జీవక్రియ శక్తిని మెరుగు పరుస్తాయి. నువ్వుల్లోని అమైనో ఆమ్లాలు కొలాజెన్ ఉత్పత్తికి దోహదం చేస్తాయి. ఇది ఎముకలు, చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. నువ్వుల్లోని యాంటీ ఆక్సిడెంట్లు ఎముకలను ఆక్సిడేటివ్ డ్యామేజ్, అలాగే ఏజ్ రిలేటెడ్ సమస్యల నుంచి రక్షిస్తాయి. నువ్వులను రోజువారీ కూరలలో ఉపయోగించవచ్చు. అలాగే స్మూతీలు లేదా సలాడ్‌లలోనూ ఉపయోగించవచ్చు. బెల్లంతో కలిపి స్నాక్‌గా కూడా తీసుకోవచ్చు. చపాతీలు, రొట్టెలలోనూ వీటిని జోడించవచ్చు. చియా సీడ్స్, ఆకుకూరలు, డ్రై ఫ్రూట్స్‌లోనూ ఇది లభిస్తుంది. మొత్తానికి అధిక కాల్షియం ఉండటంవల్ల ఎముకల ఆరోగ్యానికి నువ్వులు చాలామంచిదని పోషకాహార నిపుణులు అంటున్నారు.

## వాముతో కొవ్వు ఐస్‌లా కరిగిపోతుందా?

వాము గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. వామును మనం ఎన్నో రకాలుగా వంటల్లో ఉపయోగిస్తూ ఉంటాం. వాములో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా వాము తీసుకుంటే జీర్ణ సమస్యలు తలెత్తవు. వామునే కాకుండా వాము నీటని తీసుకోవడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించేస్తుంది. వాములో నియాసిన్, థయామిన్, సోడియం, పాస్పరస్, పొటాషియం, క్యాల్షియం, గుడ్ ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్, ప్రోటీన్ ఉంటాయి. వాము గురించి ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. వామును మనం ఎన్నో రకాలుగా వంటల్లో ఉపయోగిస్తూ ఉంటాం. వాములో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా వాము తీసుకుంటే జీర్ణ సమస్యలు తలెత్తవు. వామునే కాకుండా వాము నీటని తీసుకోవడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించేస్తుంది. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు



ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వాముని కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వాముని నేరుగా కూడా తీసుకోవచ్చు. వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది.

## జీడిపప్పులు లాభాలు..

జీడిపప్పు అంటే తెలియని వారుండరు. రుచికి తిరుగులేని ఈ డ్రై ఫ్రూట్‌ను అనేక వంటకాలలో, స్వీట్లలో వాడుతుంటారు. కేవలం రుచి మాత్రమే కాదు, జీడిపప్పులు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి.వీటిలో అనేక పోషకాలు, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. రోజూ పరిమితంగా జీడిపప్పు తినడం వల్ల కలిగే ప్రధాన లాభాలు చాలా ఉన్నాయి. జీడిపప్పులో మోనో-అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంలో సహాయపడతాయి. దీనివల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. అంతేకాకుండా, జీడిపప్పులో ఉండే మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడానికి సహాయపడుతుంది.జీడిపప్పులో మెగ్నీషియం, ఫాస్ఫరస్, కాపర్ (రాగి) వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల నిర్మాణం, దృఢత్వానికి చాలా అవసరం. ముఖ్యంగా కాపర్ ఎముకల ఆరోగ్యాన్ని కాపాడటం లో కీలక పాత్ర పోషిస్తుంది. రోజువారీ ఆహారంలో జీడి పప్పును చేర్చుకోవడం వల్ల ఆస్టియోపోరోసిస్ (ఎముకలు బలహీనపడటం) వంటి సమస్యలు రాకుండా నివారించవచ్చు. మెగ్నీ షియం, విటమిన్ ఇ మరియు బి - కాంప్లెక్స్ విటమిన్లు జీడిపప్పులో ఉంటాయి. ఈ పోషకాలు మెదడు కణాల పనితీరును మెరుగుపరచి, జ్ఞాపక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. మెదడు చురుకుగా ఉండటానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి జీడిపప్పులు తోడ్పడతాయి. జీడిపప్పులో జింక్, విటమిన్ ఇ మరియు యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇతర అనారోగ్యాల నుండి శరీరాన్ని రక్షించడంలో ఇవి కీలకంగా పనిచేస్తాయి. జీడిపప్పు ఐరన్ (ఇనుము), కాపర్ కు మంచి వనరు. ఇవి హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడి, రక్తహీనత సమస్యను నివారించడంలో సహాయపడతాయి. రక్తంలో ఐరన్ స్థాయిలు తక్కువగా ఉన్నవారు జీడిపప్పు తినడం ప్రయోజనకరం. జీడిపప్పులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, కాపర్ మరియు విటమిన్ ఇ చర్మానికి మంచి మెరుపుని అందించి, చర్మ కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించడానికి సహాయపడతాయి. కాపర్ జుట్టు సహజ రంగును కాపాడుతూ, జుట్టు పెరుగుదలకు కూడా తోడ్పడుతుంది. జీడిపప్పు లు ఆరోగ్యానికి చాలా మంచివే అయినప్పటికీ, వాటిలో కేలరీలు మరియు కొవ్వులు కూడా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, రోజుకు 5 నుండి 8 జీడిపప్పులు మితంగా తీసుకోవడం ఉత్తమం. అతిగా తింటే బరువు పెరిగే అవకాశం ఉంటుంది.



ఏదైనా ఆహారం అయినా సరే, మితంగా తీసుకుంటేనే దాని పూర్తి ప్రయోజనాలను పొందగలం. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు లేదా అలర్జీలు ఉన్నవారు జీడిపప్పులను రోజువారీ ఆహారంలో చేర్చుకునే ముందు వైద్యుడిని లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించడం మంచిది.

## సోయా బీన్స్ తినడం వల్ల కలిగే లాభాలు..

సోయా బీన్స్ ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిని తరచుగా ఆహారంలో భాగం చేసుకోవడం వలన అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ముఖ్యంగా శాఖాహారులకు ఇది అద్భుతమైన ఆహారం అని చెప్పవచ్చు. సోయా బీన్స్‌లో అధిక మొత్తంలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు (ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, ఫోలేట్, కాల్షియం) మరియు ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. మాంసంలో లభించే సంపూర్ణ ప్రోటీన్లకు ఇది మంచి ప్రత్యామ్నాయం. సోయా బీన్స్ రక్తంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ మరియు ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. దీని వలన రక్త ప్రసరణ మెరుగుపడి, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. సోయాలో ఉండే యాంటీఆక్సిడెంట్లు కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. సోయాబీన్స్‌లో ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉండటం వలన త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇది అతిగా తినకుండా నియంత్రించి, బరువు తగ్గడానికి దోహదపడుతుంది. సోయాబీన్స్‌లో కాల్షియం, ఐసోఫ్లేవోన్స్‌అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా ఉంచడంలో సహాయపడతాయి. వయస్సు పెరిగే కొద్దీ వచ్చే ఆర్థరైటిస్, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను నివారించడానికి తోడ్పడతాయి. సోయాలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది మరియు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. సోయాబీన్స్‌లో ఉండే ఐసోఫ్లేవోన్స్ అనేవి ఈస్ట్రోజెన్ హార్మోన్‌లా పనిచేస్తాయి. ఇది మహిళల్లో హార్మోన్ల సమతుల్యతను కాపాడటానికి, పీరియడ్స్ (నెలసరి) సమస్యలు, నొప్పి తగ్గించడానికి మరియు రుతువిరతి సమయంలో ఎదురయ్యే సమస్యల నుండి ఉపశమనం



పొందడానికి సహాయపడతాయి. విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వలన, సోయాబీన్స్ రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. సోయాబీన్స్‌ను తినే ముందు వాటిని 10-12 గంటల పాటు నీటిలో నానబెట్టి, బాగా శుభ్రం చేసి, ఉడికించి తీసుకోవడం వలన జీర్ణక్రియకు సంబంధించిన ఇబ్బందులు లేకుండా చూసుకోవచ్చు. సోయాలో ఉండే పోషకాలను పూర్తిగా పొందడానికి నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం.

## మెంతినీరు తాగడం వల్ల కలిగే లాభాలు..?

మన భారతీయ వంటశాలలో సులభంగా లభించే మెంతులు కేవలం వంట రుచిని పెంచడమే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. రాత్రిపూట నానబెట్టిన మెంతులను ఉదయం పరగడుపున ఆ నీటితో సహా తాగడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు పొందవచ్చు. మెంతులలో ఫైబర్, విటమిన్ సి, విటమిన్ డి, కాల్షియం, పొటాషియం, ఇనుము వంటి ముఖ్యమైన పోషకాలతో పాటు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మెంతి నీరు ఒక వరంలా పనిచేస్తుంది. దీనిలోని కరిగే ఫైబర్ రక్తంలో చక్కెర శోషణను ఆలస్యం చేస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడానికి కూడా సహాయపడుతుంది. మెంతుల నీటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలను తగ్గిస్తుంది. కడుపులో ఆమ్ల సమతుల్యతను కాపాడటంలో కూడా ఇది సహాయపడుతుంది. ప్రతిరోజూ తాగడం వల్ల పెద్ద జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయి. బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి మెంతి నీరు చాలా ఉపయోగపడుతుంది. దీనిలోని ఫైబర్ తక్కువ కేలరీలతో కడుపు నిండిన భావనను ఇస్తుంది. ఇది ఆకలిని అదుపు చేసి, అనవసరంగా తినాలనే కోరికను తగ్గిస్తుంది. అలాగే జీవక్రియను వేగవంతం చేసి కొవ్వు కరిగించడంలో సహాయపడుతుంది. మెంతి నీరు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ఇది గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. మెంతులలోని పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చర్మం నుండి విషాలను తొలగించి, మొటిమలు, నల్లటి వలయాలను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే, ఇందులో ఉండే ప్రోటీన్ జుట్టు మూలాలను బలోపేతం చేసి, జుట్టు రాలడాన్ని నివారిస్తుంది, చుండ్రు వంటి సమస్యలను తగ్గిస్తుంది. మెంతి నీరు మహిళలకు పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పి నుండి ఉపశమనం కలిగించడంలో సహాయపడుతుంది.



## కాల్చిన జామకాయ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు..

జామకాయ (జామపండు) పోషకాల గని. దీనిని కాల్చి తిన్నప్పుడు ఆరోగ్య ప్రయోజనాలు మరింత పెరుగుతాయని చాలా మంది నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా చల్లని స్వభావం కలిగిన జామకాయను కాల్చడం వలన అది వెచ్చగా మారి, దాని గుణాలు వృద్ధి చెందుతాయి. కాల్చిన జామకాయలో పీచు (ఫైబర్) పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. కాల్చడం వల్ల దీని పీచు మరింత మృదువుగా మారి, జీర్ణం చేసుకోవడం సులభమవుతుంది. గ్యాస్, అసిడిటీ, అజీర్ణం వంటి కడుపు సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. జామకాయ విటమిన్ 'సి'కి అద్భుతమైన మూలం. విటమిన్ 'సి' రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, శరీరాన్ని అంటువ్యాధులు, జలుబు, దగ్గు వంటి సమస్యల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. కాల్చిన జామకాయను ముఖ్యంగా జలుబు, దీర్ఘకాలిక దగ్గు ఉన్నప్పుడు తినడం వలన గొంతు ఉపశమనం పొందుతుంది. జామకాయలో పొటాషియం, కరిగిపోయే పీచు (సాల్యుబుల్ ఫైబర్) ఉంటాయి.



ఇవి రక్తపోటును నియంత్రించడంలో, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జామకాయ తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాల్చిన జామకాయను మితంగా తీసుకోవడం మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచి ఎంపికగా చెప్పవచ్చు. కాల్చిన జామకాయలో కాల్షియం, భాస్వరం (ఫాస్ఫరస్) వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి, బలానికి చాలా ముఖ్యమైనవి. కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం పొందడానికి కూడా ఇది తోడ్పడుతుంది. జామకాయలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మరియు విటమిన్లు (ముఖ్యంగా విటమిన్ ఏ, సి) ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, వృద్ధాప్య ఛాయలను ఆలస్యం చేస్తాయి. ఇది చర్మాన్ని కాంతివంతంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. జామకాయ తినడం వల్ల లాభమే తప్ప నష్టం లేదని చెప్పడంలో సందేహం అవసరం లేదు.



# సినిమా




## అందర్నీ థ్రిల్ చేసే 'జటాధర'

హీరో సుధీర్ బాబు నటిస్తున్న సూపర్ నేచురల్ ఫాంటసీ థ్రిల్లర్ 'జటాధార'. నవంబర్ 7న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో అగ్ర కథానాయకుడు మహేష్ బాబు ఈ చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేశారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మించాయి. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ,'ట్రైలర్ లాంచ్ చేసిన మహేష్ బాబుకి థాంక్యూ. చిన్నప్పుడు విన్న 'ఓ స్త్రీ రేపు రా', 'లంకె బిందెలు' విన్నప్పుడు చాలా థ్రిల్ ఫీల్ అవుతాం. వెంకట్ వచ్చి కథ చెప్పినప్పుడు అంతేగా థ్రిల్ అనిపించింది. ఆడియన్స్ కూడా థియేటర్స్‌లో అదే థ్రిల్ ఫీల్ అవుతారు. ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. చాలా మంచి ఎమోషన్స్ ఉంటాయి. తప్పకుండా చాలా ఎంజాయ్ చేస్తారు. సోనాక్షి చేసిన పెర్ఫార్మెన్స్ ఇంకెవరు కూడా మ్యాచ్ చేయలేరు. ధన పిశాచి పవర్ ఫుల్‌రోల్. శిల్పా క్యారెక్టర్ ఇందులో చూస్తే భయమేస్తుంది. సినిమా ఒక దమ్ బిర్యానిలా తయారైంది' అని తెలిపారు. 'ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా. చాలా స్పెషల్. ధన పిశాచి లాంటి రోల్ ఇప్పటివరకూ చేయలేదు. ఒక యాక్టర్‌గా ఇలాంటి క్యారెక్టర్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని హీరోయిన్ సోనాక్షి సిన్హా చెప్పారు. శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ,"బ్రహ్మ' వచ్చిన చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఈ సినిమాతో తెలుగులోకి రావడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని తెలిపారు. 'తెలుగు ఇండస్ట్రీ మాకు చాలా స్పెషల్. ఈ సినిమా పెద్ద సక్సెస్ అవుతుందని కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అని నిర్మాత ఉమేష్ చెప్పారు. నిర్మాత ప్రేరణ అరోరా మాట్లాడుతూ,'మాకు సపోర్ట్ చేసిన జీ స్టూడియోస్‌కి కృతజ్ఞతలు. సుధీర్ బాబుకి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయన వల్లే ఈ సినిమా తెలుగులో చేయగలిగాం' అని అన్నారు. మరో నిర్మాత శివిన్ నారంగ్ మాట్లాడుతూ,'ఇది బ్లాక్ బస్టర్ స్క్రిప్ట్. తప్పకుండా సినిమా మీ అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు.



## 'మీర్జాపూర్' సిరీస్‌లో ప్రముఖ నటి

ప్రముఖ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ మిర్జాపూర్ సీజన్ 4 అభిమానులు ఎదురుచూస్తున్నారు. మేకర్స్ కొన్ని రోజుల క్రితం కొత్త సీజన్ షూటింగ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీజన్ జనవరి 2026లో ప్రదర్శించబడుతుంది. దాని తీవ్రమైన కథాంశం, శక్తివంతమైన సంభాషణలు మరియు కల్ట్ ఫాలోయింగ్‌ను నిర్మించిన క్రైమ్ డ్రామా మరింత మలుపులు మరియు రక్తపాతాలతో తిరిగి రావడానికి సిద్ధంగా ఉంది. తాజాగా ఇప్పుడు లేటెస్ట్ రిపోర్ట్స్ ప్రకార, ఈ సిరీస్ లో ప్రముఖ నటి సోనాల్ చౌహాన్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఫిలిం సర్కిల్ లో వార్తలు వినిపిస్తున్నాయి. గుర్మీత్ సింగ్ దర్శకుడిగా మరియు పునీత్ కృష్ణ రచయితగా ఉన్న సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారం కానుంది. రితేష్



సిధ్వానీ మరియు ఫర్హాన్ అక్తర్, సహ నిర్మాతలు కాసిమ్ జగ్మాగియా మరియు విశాల్ రాంచందనీలతో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందు మరియు అభిషేక్ బెనర్జీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చిన యామీ గౌతమ్



బాలీవుడ్ బ్యూటీ యామీ గౌతమ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హక్'. 1985లో జరిగిన షాబానో కేసు ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమా.. ఫుల్ కోర్టు డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది.యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న దీనికి.. 'రాణా నాయుడు' అండ్ 'ది ట్రయల్' ఫేమ్ డైరెక్టర్ సుపర్ణ వర్మ దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా 'హక్' రిలీజ్ డేట్ ప్రకటించింది యామీ గౌతమ్. 'ఆమె తన హక్కుల కోసం పోరాడుతుంది..అతను తన నమ్మకాలను కాపాడుకుంటాడు.. ఈ నవంబర్ 7న హక్ సినిమా థియేటర్లలో విడుదలవుతోంది' అంటూ ఓ పోస్టర్ షేర్ చేసింది. ఇందులో యామీ కోర్టు రూమ్‌లో ఉండగా.. తన ఎదురుగా న్యాయమూర్తులు ఉన్నారు. కాగా.. ఈ చిత్రం నుంచి ఇటీవల వచ్చిన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఇందులో 'నేను కేవలం ముస్లిం మహిళను కాదు.. హిందూస్థాన్‌కు చెందిన ముస్లిం మహిళను. నేను ఈ దేశానికి చెందినదానిని.. అందుకే చట్టం ఈ దేశంలోని మిగిలిన వ్యక్తులతో ఎలా వ్యవహరిస్తుందో అలాగే నన్ను కూడా చూడాలి' వంటి డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి.

## అంత పెద్ద స్టేట్‌మెంట్ వద్దు బాస్


తమ సినిమాల ప్రమోషన్లలో భాగంగా మైక్ అందుకున్నపుడు ఆర్టిస్టులు, టెక్నీషియన్లు చాలా ఎగ్జైట్ అయిపోతుంటారు. ప్రేక్షకుల్లో హైప్ పెంచేందుకు, వాళ్లను థియేటర్లకు రప్పించేందుకు తమ సినిమాల గురించి కొంచెం ఎక్కువ చేసి మాట్లాడుతుంటారు. ఈ క్రమంలో పెద్ద పెద్ద స్టేట్మెంట్స్ కూడా ఇచ్చేస్తుంటారు. కానీ వాళ్లిచ్చిన హైప్‌కు తగ్గట్లు సినిమా ఉంటే.. ఓకే. కానీ తేడా కొడితే మాత్రం ఆ స్టేట్మెంట్లు బూమరాంగ్ అవుతుంటాయి. వాళ్ల ఇమేజ్‌ను, క్రెడిబిలిటీని బాగా డ్యామేజ్ చేస్తుంటాయి. ట్రోల్స్‌కు కూడా దారి తీస్తుంటాయి. గతంలో విశ్వక్సేన్ 'పాగల్' అనే సినిమా గురించి మాట్లాడుతూ.. కరోనా కారణంగా మూతపడ్డ థియేటర్లను కూడా ఈ సినిమా తెరిపిస్తుందని స్టేట్మెంట్ ఇచ్చాడు. కానీ ఆ సినిమాకు జనం లేక తొలి వారంలోనే షోలు క్యాన్సిల్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది.ఇక ఈ ఏడాది ఆరంభంలో నేచురల్ స్టార్ నాని 'కోర్టు' మూవీ గురించి ఒక పెద్ద స్టేట్మెంట్ ఇచ్చాడు. ఈ సినిమా నచ్చకపోతే తాను హీరోగా నటించే తర్వాతి సినిమాను చూడొద్దని అన్నాడు. ఐతే నాని ఊరికే మాట వదిలే రకం కాదు. 'కోర్టు' మీద పూర్తి ధీమా తోనే ఆ స్టేట్మెంట్ ఇచ్చాడు. జనాలకు ఆ సినిమా నచ్చింది. కాబట్టి 'హిట్-3'కి ఇబ్బంది లేకపోయింది. కానీ 'కోర్టు'లో లీడ్ రోల్ చేసిన ప్రియదర్శి.. నానిని అనుకరిస్తూ 'మిత్రమండలి' సినిమా విషయంలో ఇలాంటి ఛాలెంజే విసిరాడు. 'మిత్రమండలి' నచ్చకపోతే తన తర్వాతి సినిమా చూడొద్దు అనేశాడు. తీరా చూస్తే.. 'మిత్రమండలి'కి చాలా బ్యాడ్ టాక్ వచ్చింది.



## పంచాయతీ కార్యదర్శిగా నటుడు శివాజీ..

వెబ్ సిరీస్‌తో రీ ఎంట్రీ ఇచ్చిన ఒకప్పటి హీరో శివాజీ.. ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తూ సందడి చేస్తున్నాడు. ఇక ఇటీవల కోర్టుతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకోగా..ప్రజెంట్ నిర్మాతగా మారి మరో చిత్రానికి సిద్ధం అయ్యాడు. క్రైమ్ కామెడీ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందబోతున్న ఈ చిత్రంలో.. శివాజీ హీరోగా నటి స్తుండగా.. సీనియర్ బ్యూటీ లయ హీరోయిన్‌గా నటి స్తుంది. ఇప్పటికే ఈ సినిమాపై అఫీషి యల్ అనౌన్స్‌మెంట్ రాగా.. పూజా కార్య క్రమాలు కూడా పూర్తి చేసుకుంది. ఎస్ఎస్ఎస్ ప్రొడ క్షన్ నంబర్.2గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ఇందులో నుంచి మరో అప్డేట్ వచ్చింది. శ్రీ శివాజీ ప్రొడ క్షన్స్‌తో కలిసి ఈటీవీ విన్ కూడా ఇందులో నిర్మాణంలో భాగం అయినట్లు తెలుపు తూ.. శివాజీ పాత్రను రివీల్ చేశారు. 'నిజా యితీకి ప్రతి రూపం.. నటుడు శివాజీ పంచా యతీ కార్యదర్శి శ్రీరామ్‌గా రాబోతున్నా డు.. ఈటీవి విన్ అండ్ శివాజీల కాంబోలో మరో అందమైన మ్యాజిక్ కథ రూపొందుతోంది' అని తెలిపారు. అలాగే.. త్వరలో టైటిల్ అనౌన్స్‌మెంట్ ఉండనున్నట్లు పేర్కొన్నారు.



## మరో సినిమా ఆఫర్ రిజెక్ట్ చేసిన కృతి శెట్టి..

ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన అనతి కాలంలోనే ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది కృతి శెట్టి. డెబ్యూ మూవీ ఉప్పెనతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ. రీసెంట్‌గా కోలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చేసింది. ఇక రీసెంట్‌గా బాలీవుడ్‌లో కూడా ఓ ఆఫర్ రావడంతో.. అక్కడ ఎంట్రీకి రంగం సిద్ధం చేసుకుంది. బాలీవుడ్ సీనియర్ నటుడు గోవింద కుమారుడు యశ్వర్ధన్ అహుజా డెబ్యూ మూవీతోనే కృతి బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనుందని, దీనికి సాజిద్ ఖాన్ దర్శకత్వం చేస్తారంటూ వార్తలు వినిపించాయి. ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుందని టాక్ వచ్చింది. అయితే ఏమైందో ఏమో కానీ.. యశ్వర్ధన్ అహుజా సరసన నటించాల్సిన మూవీ నుంచి హీరోయిన్‌గా కృతి శెట్టి తప్పుకున్నట్లు తెలుస్తోంది. నిజానికి, గతంలో కూడా కృతి 'బేబీ' హిందీ రీమేక్‌లో హీరోయిన్‌గా దాదాపు ఖరారైంది, కానీ కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. ఇప్పుడు మరోసారి ఆమె బాలీవుడ్ మూవీ నుంచి తప్పుకోవడంతో.. కృతికి బాలీవుడ్ సెట్ కాదు కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.



# అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవు

♦ జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



కడప,అక్టోబర్ 18, (వుదయం ప్రతినిధి): జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు దీపావళి శుభాకాంక్షలు దీపావళి పర్వదినాన టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలో టపాసులు ఎక్కడైనా అక్రమంగా విక్రయిస్తున్నా, నిల్వ ఉంచినా డయల్ 112 గాని, స్థానిక పోలీసు స్టేషన్ లో గాని సమాచారం అందించాలి అని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా అటువంటి వారి పై ప్రేలుడు పదార్థాల చట్టం, ఐపిసి సెక్షన్స్ ప్రకారం చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్బంగా జిల్లా ఎస్.పి ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పర్వదినం రోజున జిల్లా ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. టపాసుల విక్రయదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి అని అన్నారు. లైసెన్స్ లు కల్గిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. సూచించిన బహిరంగ ప్రదేశాలలో, వారికి కేటాయించిన ప్రాంతంలో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్డులలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. లైసెన్స్ పొందిన పర్మనెంట్ గోడౌన్ లు, లైసెన్స్ పొందిన పర్మనెంట్ షాపులు, లైసెన్స్ పొందిన టపాసుల తాత్కాలిక విక్రయ షాపులు తూచా తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రమాదాలకు తావులేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విక్రయించాలని విక్రయదారులకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. షాపుకు, షాపుకు మధ్య నిర్దేశించిన దూరం తప్పనిసరిగా పాటించాలి. ప్రతి టపాసుల విక్రయ షాపులోనూ నీరు, ఇసుక, అగ్నిమాపక యంత్రాలు తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదన్నారు. పోలీసు నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. బాణ సంచాను అనుమతి లేకుండా నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా, తయారుచేసినా వాటిని వినియోగించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అటువంటి వారి పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. దీపావళి పర్వదినం రోజున జిల్లా ప్రజలు ఆనందంగా జరుగుపుకోవాలని, టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సురక్షితంగా పండుగ జరుపుకునేందుకు చేయాల్సిన, చేయకూడని అంశాలను ఎస్.పి వివరించారు. 1. చిన్నారులు తల్లితండ్రుల పర్యవేక్షణలోనే బాణాసంచా కాల్చాలి. 2. బాణాసంచా కాల్చేటపుడు కాటన్ దుస్తులు ధరించాలి. 3. రోడ్డు వెంబడి వెళ్ళే వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా టపాసులు కాల్చుకోవాలి. 4. ముందుజాగ్రత్తగా బకెట్ లలో నీరు అందుబాటులో ఉంచుకొని జాగ్రత్త వహించాలి. 5. లైసెన్స్ ఉన్న దుకాణంలోనే బాణాసంచా కొనుగోలు చేయాలి. బాణసంచా ప్యాకెట్ పై ముద్రించిన తయారీ తేది, ప్యాకెట్ పై తయారీదారు ముద్రించిన జాగ్రత్తలను పాటించాలి. 6. పెద్దలు టపాసులు కాల్చేటపుడు పిల్లలను దూరంగా ఉంచాలి. 7. ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలి. అనుకోని ప్రమాదం జరిగి గాయాలు అయితే తక్షణం సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి. 8. ఇంటిలోపల బాణాసంచా కాల్చకూడదు. 9. సగం కాలిన టపాసులను మళ్ళీ వెలిగించే ప్రయత్నం చేయడం, ముట్టుకోవడం ప్రమాదకరం. దయచేసి అలా చేయకండి. 10. గాజు సీసాలు, ఇనుప రేకులతో కూడిన డబ్బాలలో బాణసంచా కాల్చడం చాలా ప్రమాదకరం. దయచేసి అలా కాల్చకండి. 11. ఆస్పత్రుల వద్ద బాణాసంచా కాల్చరాదని జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ప్రజలకు సూచించారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ – 112 లేదా సంబంధిత పోలీసు స్టేషన్ కు సమాచారం అందించాలని, సమాచారం చేరవేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపియస్ తెలిపారు.

# సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక నైపుణ్యాలుగా మార్చే సురక్షితమైన ప్రయోగ

–శాలలే స్కిల్ ల్యాబ్ లు ... అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ & మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. చిట్టి నరసమ్మ.

కర్నూలు,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): వైద్య విద్యార్థులు రోగులకు సురక్షితమైన వైద్యాన్ని అందించాలంటే ముందుగా ఆచరణాత్మక నైపుణ్యాలను సురక్షిత ప్రదేశమైన ల్యాబ్ యందు ముందుగా నేర్చు కోవాలి అప్పుడే రోగులకు సురక్షితమైన వైద్యం అందుతుందని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ అన్నారు . శనివారం నాడు మెడికల్ కాలేజీ యందు మోర్టాన్ సెమినార్ హాల్ మరియు స్కిల్ ల్యాబ్ లను ఆమె ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కిల్ ల్యాబ్ వల్ల వైద్య విద్యార్థులు, సిబ్బంది నిజజీవితంలో రోగులపై ప్రయోగించే ముందు ప్రయోగించే ముందు నైపుణ్యాలను ఇక్కడ సాధన చేసుకోవచ్చని వారిని నైపుణ్యాలని మెరుగుపట్టుచుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా 1985 బ్యాచ్ వైద్యులు ఆర్థిక సహాయం అందించడం, అనస్థీషియా విభాగం తమ సొంత నిధులను వెచ్చించేందుకు ముందుకు రావడంతో కాలేజీ పరంగా కొంత నిదులను కేటాయించి తక్కువ కాలంలో పూర్తి చేయగలిగాలిమని దీనివల్ల ఎంతోమంది వైద్య విద్యార్థులతో పాటు అల్లైడ్ సైన్సెస్ విద్యార్థులకు నర్సింగ్ విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సహకరించిన 1985 బ్యాచ్ వైద్యులను అభినందించారు . ఈ



కార్యక్రమంలో అనస్థీషియా విభాగాధిపతి డా.జి. విశాల, డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ శ్రీరాములు, వైస్ ప్రిన్సిపల్ లు డా. సాయి డా.సుధీర్ , డా. రేణుక దేవి డా.విజయానంద్ బాబు, డా.సింధియా శుభప్రద, ప్రొఫెసర్ డా.రామ్ శివ నాయక్,1985 బ్యాచ్ వైద్యులు డా. అద్రూస్, డా. సుధీర్ కుమార్, డా. చంద్ర శేఖర్ అనస్థీ షియా విభాగపు అసోసియేట్, అసిస్టెంట్ లు, పీజీలు పాల్గొన్నారు.

# తైక్వాండోలో క్రీడాకారులు రాణించాలి రాష్ట్ర మంత్రి టీజీ భరత్




కర్నూలు,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని ఏ.క్యాంపు సమీపంలోని శిక్షణ కేంద్రంలో తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు మంత్రి టీజీ భరత్ బెల్ట్స్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్ద పెద్ద నగరాల్లో వేలు, లక్షల్లో కోచింగ్ కోసం డబ్బులు తీసుకుంటారన్నారు. మనకు తక్కువ ఖర్చుకే ఇలాంటి క్రీడల్లో శిక్షణ లభిస్తుందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్క తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. క్రీడాకారులు కూడా బెల్ట్స్ సాధించామని అంతటితో ఆగిపోకుండా మరింత కష్టపడాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల కోటాలో కూడా అవకాశాలు దక్కుతాయన్నారు. ప్రతి ఒక్కరికీ జీవితంలో వ్యాయామం ఎంతో అవసరమన్నారు. పుస్తకాలతోనే కుస్తీ పట్టకుండా వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఇక ఇటీవలె ప్రధాని నరేంద్ర మోడీ కర్నూలు పర్యటనకు వచ్చి కర్నూలు పేరును దేశ, ప్రపంచ వ్యాప్తంగా తెలిసేలా చేశారన్నారు. రానున్న రోజుల్లో కర్నూలుకు భారీగా పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. యువతకు ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ షబ్బీర్, కార్పొరేటర్ కైప పద్మలతా రెడ్డి, నాయకులు చంద్రమోహన్, వినోద్ చౌదరి, శేఖర్, ప్రమోద్, రామకృష్ణ, అనిల్, మల్లికార్జున గౌడ్, వెంకటేష్, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, కార్డియాలజిస్టు ఇందుప్రకాశ్, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ కృష్ణ, సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ లపై వైసీపీకి ప్రశ్నించే హక్కు లేదు

–యాజమాన్య కోట కింద సీట్లు అమ్ముకునేలా 108 జీవో ఇచ్చింది వైసీపీ కాదా.

–ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు



కర్నూలు,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):కర్నూలు లో మెడికల్ కాలేజీలపై ప్రశ్నించే నైతిక హక్కు వైసిపి కి లేదని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వైసిపి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతుందని అందులో భాగంగానే కోటి సంతకాల సేకరణ అంటూ ప్రభుత్వం పై బురదజల్లే కార్యక్రమానికి తెర లేపిందన్నారు. ఈ మేరకు ఆయన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆదేశాల మేరకు షరీన్ నగర్ లోని తన కార్యాలయంలో క్లస్టర్ ఇన్చార్జులు ఎన్వి రామకృష్ణ, పి యు మాదన్న ,జనార్ధన్ ఆచారితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ ద్వారా మెడికల్ కళాశాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పి పి అంటే అవగాహన లేని వైసిపి విష ప్రచారానికే పరిమితమై ప్రజలను మభ్య పెట్టేందుకు కోటి సంతకాలన సేకరణ పేరుతో ప్రభుత్వం పై బురద జల్లే కార్యక్రమానికి పూనుకుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం 108 జీవోలో 15% సెంట్రల్ పూల్ సీట్లు ఫోను మిగిలిన 85% సీట్లలో సగం కన్వీనర్ కోట ఫోను మిగిలిన సగం సీట్లను యాజమాన్య కోట ఎన్నారై కోట అంటూ జీవో ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఏడాదికి యాజమాన్య కోట కింద 12 లక్షలు ఎన్నారై కోట కింద 20 లక్షలు అమ్ముకోవడానికి జీవో ఇచ్చింది నిజమా కాదా అని ప్రశ్నించారు. కోర్సు పూర్తి చేయడానికి కోటి రూపాయలు ఖర్చు అయ్యే విధంగా జీవో ఇచ్చిన వైసిపి ఇప్పుడు నంగనాచి కబుర్లు చెబుతుందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన చూసి ఓర్వలేక వైసీపీ బురదజల్లే రాజకీయాలకు తెరతీసిందని విమర్శించారు ఈ కార్యక్రమంలో అర్బన్ నాయకులు శైలజ యాదవ్,నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎస్ ఫిరోజ్,నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్,రాములమ్మ నాయకులు పుల్లయ్య గౌడ్,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసిన జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్

నెహ్రూ కి వెండి కిరీటం, బంగారు వెంకటేశ్వర స్వామి( గోల్డ్ ప్లేట్ )తో సత్కరించిన తుమ్మలపల్లి రమేష్

కాకినాడ జిల్లా జగ్గంపేట,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): జగ్గంపేట పరిణయపంక్షన్ హాలులోభారీ ఏర్పాట్లమధ్యఈరోజు ఎం ఎల్ ఏ.జ్యోతులనెహ్రూ జన్మదినవేడుకలు అభిమానుల కోలాహలంమధ్యఘనంగా నిర్వహించారు. అధికార,ప్రతిపక్ష రాజకీయనాయకులుహాజరై నెహ్రూకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. పరిణయ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జగ్గంపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే మరియు టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ జన్మదిన వేడుకలకు జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే నెహ్రూ గారికి వెండి కిరీటం పెట్టి, శాలువా తో సత్కరించి, పూలమాలలు వేసి, ఘనంగా సత్కరించి,నెహ్రూ గారు పాలకమండలి సభ్యులు అయినందుకు 24 క్యారెట్ బంగారు వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్ల గోల్డ్ ప్లేట్లు బహుకరించారు. ఈ సందర్బంగా



నెహ్రూ మంచి ఆరోగ్యం తో అష్టైశ్వర్యాల తో ఉండాలని రమేష్ అన్నారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ ఎంపీటీసీ లు, జనసేన పార్టీ నాయకుల కార్యకర్తలు పాల్గొన్నారు

# కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన గాలిని అందిస్తాం

–విజయవాడ, వైజాగ్, గుంటూరుల్లో భూగర్భ డ్రైనేజీ మెరుగుకు చర్యలు

–13వ డివిజన్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామమోహన్

విజయవాడ ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించి ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన గాలిని అందించి వారి జీవన ప్రమాణాలను పెంచడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 13వ డివిజన్ ఆర్టీసీ కాలనీ రామాలయం ప్రాంతంలో 'స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ భారత్' కార్యక్రమం జరిగింది. మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొన్నారు. మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి చేపట్టిన 'స్వచ్ఛ భారత్'ను స్ఫూర్తిగా తీసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా ఒక థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెలలో 'క్లీన్ ఎయిర్' (స్వచ్ఛమైన గాలి) అనే థీమ్‌ను తీసుకున్నారని వెల్లడించారు. గాలిలో ఏర్పడే కాలుష్యం వల్ల ఊపిరితిత్తులకు వ్యాధి సోకి, ప్రతి ఏటా 80 లక్షల మంది చనిపోతున్నారని గుర్తుచేశారు. కాలుష్యంపై అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజలకు అవగాహన అధికమని చెప్పారు. కాలుష్యం లేకపోతే రోగాలు తగ్గుతాయని, కాలుష్యాన్ని తగ్గించడానికి మొక్కలు నాటాలని, పరిశుభ్రత పాటించాలని, సీఎన్‌జీతో పాటుగా సోలార్, విండ్ పవర్‌ను ఉపయోగించడం చేయాలని సూచించారు. అందువల్లనే ప్రభుత్వం 'సూర్యఘర్' పథకాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఎస్సీ,ఎస్టీ, బీసీలకు రాయితీలు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సోలార్ ఫ్యానల్స్‌ను అమర్చుకోవాలని సూచించారు. కాలుష్యాన్ని తగ్గించడానికి 2014%–%19 కాలంలో టీడీపీ ప్రభుత్వం క్రింద అనేక పథకాలను తీసుకువచ్చినట్లు, 2019వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఆ పథకాలను నిలుపుదల చేసినట్లు గద్దె రామమోహన్ గుర్తుచేశారు. ఆ పథకాలను కొనసాగించి ఉంటే ప్రజలు స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించేవారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వైజాగ్, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీని మెరుగు పరచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అదేశించారని, ఆ దిశగా తాము చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పీ.నారాయణ చెప్పారు. ప్రజలు కూడా జరుగుతున్న పరిణామాలను గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ఈ కాలనీ వాసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తారని చెప్పారు. అదే విధంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని కూడా ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. దీనితోపాటుగా సూర్య ఘర్ పథకంలో భాగంగా ప్రతి ఇంటిపై సోలార్ ప్యానల్స్‌ను అమర్చుకోవాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, సూర్యఘర్ పథకాల గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ తమకు ఎప్పటికపుడు తగిన సూచనలు ఇస్తూ తమను ముందుకు నడిపిస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. జీఎస్టీ అసిస్టెంట్ కమీషనర్ పుల్లయ్య మాట్లాడుతూ జీఎస్టీలో సంస్కరణల వల్ల నిత్యావసర వస్తువుల ధరలతో పాటుగా వ్యవసాయరంగానికి ఉపయోగపడే యంత్రాలు, సోలార్ పవర్ ప్యానల్స్, రైతులు ఉపయోగించే విద్యుత్ మోటార్లపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారన్నారు. కార్పోరేటర్ ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ జీఎస్టీలో సంస్కరణల వల్ల ప్రజలకు జరిగే మేలును ప్రజలకు తెలియజేయడానికి నియోజకవర్గంలో పలు చోట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు మేలు చేస్తోందన్నారు. సోలార్ పవర్‌ను ఉపయోగించడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమములో కార్పోరేషన్ అడిషనల్ కమీషనర్ చంద్రశేఖర్, జోనల్ కమీషనర్ షమ్మీ, ఈఈ సామ్రాజ్యం, ఏఎంవోహెచ్ గోపాల్ నాయక్, ఏపీసీపీడీసీఎల్ హరి, సీడీవో ఉమామహేశ్వరి, పీపీసీ అనుమ్మయి, పార్టీ నాయకులు గద్దె ప్రసాద్, నూతి శ్రీను, దాంగేకుమారి, మాదిరెడ్డి రవి, షేక్ ఫాతిమా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




# సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండాలి

– జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



కర్నూలు,అక్టోబర్ 18 వుదయం న్యూస్ బ్యూరో :– సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో సంక్షేమ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు ఉండవలసిన వసతుల పై జిల్లా కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...వసతి గృహాలలో విద్యార్థులకు పౌష్టికాహారము, సరైన గదులు, బాత్రూమ్స్, టాయిలెట్స్ తో పాటు మంచి వాతావరణం ఉండాలన్నారు. అవసరమైన అదనపు గదులు, టాయిలెట్ల నిర్మాణాలు లేదా మరమ్మత్తులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. వసతి గృహాలలో నిరంతరం కరెంటు సౌకర్యం , నీటి సదుపాయం ఉండాలన్నారు.. నీటి ట్యాంకులను 15 రోజులకు పరిశుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాలకు సరఫరా చేసే నీటి నమూనాలను సేకరించి పరీక్షలు ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఇంజనీర్ ను ఆదేశించారు. వసతి గృహాలలో రాత్రులలో అవసరమైన వెలుతురు ఉండే విధంగా లైట్లు, వసతి గృహాల పరిసరాలలో వీధి దీపాలు, పరిసరాలలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పిచ్చి మొక్కలు లేని విధంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వసతి గృహాలకు అవసరమైన మరమ్మతులు, నిర్మాణాలకు సొంత శాఖల ద్వారా నే కాకుండా సి ఎస్ ఆర్ ఫండ్స్ రూపంలో, ఎంపీ లాడ్స్ ద్వారా కూడా చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జెడి రాధిక , బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన , సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ హాస్టల్స్ కోఆర్డినేటర్ శ్రీదేవి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సబీహ పర్వీన్ ,డీఈవో శామ్యూల్ పాల్ , ఇన్ఫ్రాస్ట్రక్షన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగిరెడ్డి, అడిషనల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి రేవతి జోత్స్న , ఆర్డబ్ల్యూఎస్ డీఈ అమల, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ కోఆర్డినేటర్ పుష్పరాజ్ , వెల్ఫేర్ శాఖల సూపరింటెండెట్ లు పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలు సామాజిక రుగ్మతలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం

–ఏఎస్సై ఎండీ హిదాయత్ అలీహా



పెద్దవంగర, అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి):ప్రజలు మూఢనమ్మకాలను రూపుమాపాలని ఏఎస్సై ఎండీ హిదాయత్ అలీ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు పోచంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఏఎస్సై మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలోకి వచ్చినా.. ప్రజలు మూఢనమ్మకాల నుంచి బయటకు రాలేకపోతున్నారని చెప్పారు. టెక్నాలజీ యుగంలోనూ మూఢ విశ్వాసాలను వదలలేకపోకపోవడం బాధాకరం అన్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ మాయలు, మంత్రాలను నమ్మి ప్రజలు మోసపోతున్నారని, అలాంటి వాటిని నమ్మకూడదన్నారు. ప్రజలు మూఢనమ్మకాలను వీడి, శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, హెల్మెట్, సెల్‌ఫోన్, సైబర్ నేరాలు, షీటీం పనితీరు తదితరుల అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సుధాకర్, హరీష్, కళాజాత బృందం సతీష్, తిరుపతి, పృథ్వీ రాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

**–రెండు వారాలుగా దొరకని ఆచూకీ**

**–పట్టించుకోని భార్య.. తన కుమారుడి ఆచూకీ తెలపాలంటూ కన్నతల్లి ఆవేదన.**



అమలాపురం,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): ఉపాధి నిమిత్తం విశాఖ పట్నంలో ఉంటూ ఇంటికి వచ్చిన కుమారుడు తిరిగి వెళ్లిన క్రమంలో రెండు వారాలుగా కనిపించకుండా పోవడంపై అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది ఓ తల్లి.. అల్లవరం మండలం కొమరగిరిపట్నం కొడప గ్రామానికి చెందిన గెద్దం రమేష్(35) ఇంటి నుంచి వైజాగ్ వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి ఏమయ్యాడో తెలియని పరిస్థితి ఉందని తల్లి గెద్దం ధనలక్ష్మి కన్నీరు మున్నీరవుతోంది.. ఈ ఘటనపై తల్లి ధనలక్ష్మి చెప్పిన వివరాలిలా ఉన్నాయి. రమేష్ తన భార్య సుజాత ఇద్దరూ ఈనెల నాలువ తేదీన వైజాగ్ నుంచి కొమరగిరిపట్నం ఇంటికి రేషన్‌కార్డు తీసుకునే నిమిత్తం వచ్చారని, అయితే అదే రోజు రమేష్ భార్య సుజాత భర్తతో గొడవపడి సాయంత్రం వైజాగ్ తిరిగి వెళ్లిపోయిందని తెలిపింది. మరుసటి రోజు అయిన 5వ తేదీన రమేష్ తన భార్య వద్దకు వెళ్లిపోతానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరి వెళ్లాడని తెలిపింది. అయితే ఆరోజు అమలాపురం ఆర్టీసీ బస్ స్టాండ్‌లో రమేష్ టిక్కెట్టు రిజర్వేషన్ చేయించుకుని బస్ ఎక్కలేదని కండక్టర్ తనకు ఫోన్ చేసి తెలిపాడని రమేష్ భార్య సుజాత తనకు ఫోన్ చేసి చెప్పిందని, ఇదిలా ఉంటే అదే రోజు వేరొక వ్యక్తి తనకు ఫోన్ చేసి మీ అబ్బాయి బస్‌స్టాండ్‌లో మద్యం సేవించియున్నాడని, వైజాగ్‌కు వెళ్లేందుకు డబ్బులు లేనందున తనకు ఫోన్‌పే చేస్తే అతనికి ఇస్తానని చెప్పాడని, మా అబ్బాయికి ఒకసారి ఫోన్ ఇవ్వాలని కోరగా అతను ఫోన్ పెట్టేసి మరళా ఎత్తలేదని తల్లి ధనలక్ష్మి వాపోయింది.. అయితే తన కుమారుడు రమేష్ అటు భార్య సుజాత దగ్గరకు వెళ్లక, ఇటు ఇంటికి రాకపోగా కంగారు పడి అమలాపురం బస్‌స్టాండ్‌లోను, అమలాపురం పరిసర ప్రాంతాల్లోను వెతికించామని, అయినా ఆనాటి నుంచి ఇప్పటికీ తన కుమారుడు ఆచూకీ లభ్యం కాలేదని కన్నీరుమున్నీరవుతోంది.. ఇదిలా ఉంటే తన భర్త గురించి ఇప్పటికీ భార్య సుజాత ఆరా తీయకపోగా తన నుంచి ఎటువంటి బాధ్యత లేనట్లు వ్యవహరిస్తోందని తల్లి ధనలక్ష్మి వాపోయింది.. తన కుమారుడి అదృశ్యంపై అమలాపురం పట్టణ పోలీసులకు పిర్యాదు చేశానని, దీనిపై పోలీసులు స్పందించి తన కుమారుడి ఆచూకీ గురించి దర్యాప్తు చేపట్టాలని అభ్యర్థిస్తోంది..

# టౌన్ మోడల్ కాలేజీలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

♦ ప్రభుత్వ కళాశాలల విశిష్టత గురించి విద్యార్థులకు తెలియజేసిన ఎంపీ



కర్నూలు ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): ప్రభుత్వ కళాశాలల విశిష్టత గురించి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు విద్యార్థులకు తెలియజేశారు...కర్నూలు నగరంలోని టౌన్ మోడల్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు...ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గవర్నమెంట్ కాలేజీల్లో చదువుకున్న ఎంతో మంది నేడు గొప్ప గొప్ప స్థాయిలో ఉన్నారన్నారు...తాను ప్రభుత్వ కళాశాలలోనే చదువుకొని ఎంపీ స్థాయికి వచ్చానన్నారు.. గవర్నమెంట్ కళాశాలలో చదువుకుంటున్నామని విద్యార్థులు తమను తాము తక్కువ గా చూసుకోకూడదని, కష్ట పడి చదివి ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలన్నారు..గతంతో పోల్చుకుంటే ఇప్పుడు ప్రభుత్వ కళాశాలలోనూ అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయన్నారు.. ఇక రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు..అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎంపీ బహుమతులను అందజేశారు.. ..ఈ కార్యక్రమంలో ఆర్.ఐ.ఓ లాలెప్ప, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, టౌన్ మోడల్ స్కూల్ హెడ్ మాస్టర్ ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అమీన్ పీర్ దర్గా ఉర్సు మహోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

**ముఖ్యమంత్రిని కలిసిన కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి**



కడప, అక్టోబర్ 18, (వుదయం ప్రతినిధి): కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు మహోత్సవాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆహ్వానించారు. సీఎం చంద్రబాబును కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ అరిఫుల్లా హుస్సేనీ కలిసి ఆహ్వానం అందించారు. జాతీయ స్థాయిలో పేరొందిన ఈ ఉర్సు మహోత్సవాలు వచ్చే నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్నాయని... ఈ ఉర్సు మహోత్సవాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ముఖ్యమంత్రిని కోరారు. ఉర్సు మహోత్సవ ఏర్పాట్లు ఏ విధంగా జరుగుతున్నాయని సీఎం వారిని అడిగి తెలుసుకున్నారు. ఉర్సు మహోత్సవాలకు సహకారం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అమీన్ పీర్ దర్గా మేనేజర్ మొహమ్మద్ అలీ ఖాన్, బాఖీ ఉల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

# భీమా ఏజెంట్లు గా అవకాశం

ప్రొద్దుటూరు, అక్టోబర్ 18, (వుదయం ప్రతినిధి): తపాలా శాఖలో భాగమైన తపాలా జీవిత భీమా మరియు గ్రామీణ తపాలా జీవిత భీమా డైరెక్ట్ ఏజెంట్లుగా ప్రొద్దుటూరు డివిజన్ (ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, వేంపల్లి, దువ్వూరు,కొండాపురం, పెండ్లిమర్రి, వల్లూరు, కమలాపురం, ఎర్రగుంట్ల) లోని ప్రాంతాలలో పనిచేయుటకు దరఖాస్తులు చేసుకోవాలని తపాలా జీవిత భీమా %c% గ్రామీణ తపాలా జీవిత భీమా డెవలప్మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుండి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎస్సెస్సీ, ఆధార్, పాన్ కార్డు, 2 ఫోటోలతో ఆసక్తి గల అభ్యర్థులు 24 వ తేదీ స్థానిక మున్సిపల్ ఆఫీసు దగ్గర వున్న ప్రధాన తపాలా సూపరింటెండెంట్ వారి కార్యాలయం ప్రధాన తపాలా కార్యాలయంలో ఉదయం 10. గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ కు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని వివరించారు. ఎంపిక చెయ్యబడిన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ క్రింద 5000 రూపాయల రీఫండబుల్ డిపాజిట్ చేయాలని సూచించారు. ఎంపిక చెయ్యబడిన ఏజెంట్లకు, వారు చేయు పాలసీలకు ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్/ఇన్సెంటివ్ చెల్లించుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయం సమీపంలోని తపాలా సూపరింటెండెంట్ వారి కార్యాలయం, ప్రధాన తపాలా కార్యాలయం నందు కానీ, 8498977463 నెంబర్ ను కానీ సంప్రదించాలని తెలిపారు.

# గుర్రపు డెక్క తొలగింపుకు మందు పిచికారి



అవనిగడ్డ అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): ఘంటసాల మండల పరిధిలోని మల్లాయి చిట్టూరు నీటి సంఘం పరిధిలోని మల్లంపల్లి డ్రైన్ లో విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్క తొలగింపుకు శనివారం చర్యలు చేపట్టారు. నీటి సంఘం అధ్యక్షులు ఆవుల ధర్మ వెంకట నరసయ్య ఆధ్వర్యంలో ఇబ్బంది ఆధ్వర్యంలో గుర్రపు డెక్క తొలగింపుకు మందు పిచికారి చేయడం జరిగింది. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో యగు నుంచి వచ్చిన గుర్రపు డెక్క మల్లంపల్లి డ్రైన్ లో నిలిచి ఉండడంతో మందు పిచికారి చేసినట్లు ధర్మ వెంకట నరసయ్య తెలిపారు. ఈ పనులను గ్రామపంచాయతీ సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వరరావు పరిశీలించారు. మురుగునీరు పారుదల అయ్యేలా ఈ చర్యలు చేపట్టినట్లు నరసయ్య తెలిపారు.

# స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర




ప్రొద్దుటూరు, అక్టోబర్ 18, (వుదయం ప్రతినిధి):ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టి బి రోడ్ నందు "స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర "సందర్భంగా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యవంతమైన జీవనం గురించి పెప్పన్న వైద్యాధికారి డా హిమబిందు మరియు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ వెంకటేశ్వర్లుగార్లు, వారు మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం ఈ కార్యక్రమం జరుగుతుందని, మన నిత్య జీవిత ప్రయాణాన్ని పర్యావరణ రహితంగా సాగించాలని, పర్యావరణం పెంచడం కోసం మొక్కలు నాటి ఆరోగ్య వంతమైన వాతావరణాన్ని రూపొందిద్దాం అని, వాహన కాలుష్యాన్ని తగ్గిద్దాం అని, కాలుష్య రహిత వాతావరణంను తీర్చిదిద్దాలని, మనమందరం ఒకే బాటలో నడిచి స్వచ్ఛమైన గాలికోసం కృషి చేద్దామని, మనం జరుపుకొనే ఈ దీపావళి హానికర టపాసులు కాల్చకుండా సహజ దీపాల కాంతులతో పర్యావరణ రహిత దీపావళి గా జరుపుకొని ఆరోగ్యం గా వుండాలని తెలియచేసారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేటట్లు మా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో శోభారాణి, సి ఓ సుబ్బారెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' ర్యాలీని ప్రారంభించిన పురపాలక కమిషనర్



ఆదోని అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): ఆదోని పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని పురపాలక కమిషనర్ కృష్ణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మైదానంలో ఆయన మొక్కలు నాటారు. కార్యాలయంలో సిబ్బందితో కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీలో పురపాలక ప్రజారోగ్య అధికారి సందీప్, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేట ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు అందుబాటులో వైద్యం ఉన్నది



జగ్గంపేట,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం జగ్గంపేట గ్రామంలో గుర్రప్పాలెం రోడ్డులో గవర్నమెంట్ పాత ఆసుపత్రి ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆయుష్ విభాగ ప్రాంగణం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే శాస్త్రవతవరణఏర్పాటు చేయబడింది. ఈ ఆసుపత్రికి డాక్టర్ రేణుక మెడికల్ ఆఫీసరుగా,మరియు ఒక కాంపౌండర్ ,ఒక స్వీపరులనునియమించడంజరిగింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేణుక మాట్లాడుతూ మా వైద్య సేవలో ముఖ్యంగా మోకాళ్ళ నొప్పులు కీళ్ల నొప్పులు శ్వాస కోశ వ్యాధులకు సంబంధించిన వాటికి చర్మవ్యాధులైన దద్దుర్లు చర్మంపై వచ్చే మచ్చలు ,కిడ్నీ సంబంధమైన వ్యాధులు కిడ్నీలో స్టోన్స్ కరిగిపోవడానికి,అందరికీ కూడా అజీర్ణవ్యాధులైన గ్యాస్ట్రిక్ పోవడానికి, నొప్పి నివారణకు, కిడ్నీల వాపులకు, కిడ్నీలకు నీరు పట్టడం మొదలైన వ్యాధులకు ,కంటి వ్యాధులకు, రక్తహీనతకు స్త్రీలకు సంబంధించిన గర్భకోశవ్యాధులకు పీరియడ్స్ క్రమబద్ధముగా రాని వారికి బాలికలు రజస్వల తరువాత నెలసరి ఇబ్బందులధులు నెలసరి నొప్పులకు, అన్ని రకాల వయసుల వారికి అజీర్ణవ్యాధులకు గ్యాస్టిక్ ట్రబుల్స్ కు ముఖ్యంగా సయాటికా బాధలకు కడుపులో మంట మొదలైన అన్ని రకాల జబ్బులకు ఆయుర్వేద మందులు టాబ్లెట్లు, టానిక్కులు, పొడర్ల రూపంలో పూర్తి ఉచితంగా రోగులకు ఇవ్వడం జరుగుతుందని డాక్టర్ రేణుక తెలియజేశారు ఈ మందులు వాడకంతో ఎవరికి ఏ విధమైన సైడ్ ఎఫెక్టులు ఉండవని నిర్భయంతరముగా అందరూ వాడవచ్చని డాక్టర్ తెలియజేశారు.

# హోటల్ కార్మికుల సమస్యలపై డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు వినతి ఏఐటీయూసీ



కర్నూలు ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): కర్నూల్ నగరంలోని హోటల్ ఎలైట్ రివేరా ఫ్యామిలీ రెస్టారెంట్లో 15 మంది కార్మికులు రోజువారీ కూలీగా పని చేస్తున్నారు .గత 6 నెలల నుండి పెండింగ్ లో ఉన్న (3 లక్షల రూపాయలు) జీతాలు ఇప్పించాలని డిప్యూటీ లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు హోటల్ బేకరీ వంట మాస్టర్స్ యూనియన్ ఏఐటీయుసి ఆధ్వర్యంలో కలిసి లేబర్ కార్యాలయంలో ఏఐటీయుసి నగర సెక్రెటరీ జి.చంద్రశేఖర్ , హోటల్, బేకరీ, వంట మాస్టర్స్ యూనియన్ సెక్రెటరీ టి. రామాంజనేయులు ,ట్రెజరర్ రంగనాయకులు కార్మికులు కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఏఐటీయుసి నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒడిస్సా, బెంగాల్ ,జార?oడ్, అస్సాం నుండి వచ్చిన కార్మికులు కర్నూలు నగరంలో ఉన్న హోటల్ ఎలైట్ రివేరా ఫ్యామిలీ రెస్టారెంట్ నందు 15 మంది కార్మికులు పనిచేస్తున్నారు. కానీ యజమాన్యం వారు ఆరు నెలల నుండి పెండింగ్ లో ఉన్న జీతాలు ( 3.లక్షల రూపాయలు) ఈరోజు, రేపు ఇస్తామని కుంటి సాకులు చెప్తూ యజమాన్యం ఇంతవరకు కూడా కార్మికులకు జీతాలు ఇవ్వలేదు. కావున కార్మికులు అందరికీ పెండింగ్ లో ఉన్న జీతాలు ఇప్పించవలసిందిగా డిప్యూటీ లేబర్ కమిషనర్ యూనియన్ నాయకులు కోరడమైనది.. ఈ కార్యక్రమంలో అస్సాం, బీహార్, ఒడిశా, జార?oడ్ కార్మికులు సుల్తాన్ ,అల్లావుద్దీన్, జైదుల్, అరుణ్ కుమార్, మిరాజుల్ ,నాగరాజు, మెహతా, సైదుల్ భాష, అస్గర్ హుస్సేన్, జియాద్ ఉద్దీన్, యాహియా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం యర్రగుంట్ల శాంతినగర్‌లో ఎన్ఎస్ఎస్ ఆరోగ్య అవగాహన శిబిరం



కడప ,అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): యర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ప్రత్యేక శిబిరం ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్ కాలనీలో 6వ దినం ' ఆరోగ్య అవగాహన, వైద్య శిబిరం' ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరానికి కళాశాల ప్రిన్సిపల్ కనపర్తి త్రివిక్రమరెడ్డి ప్రధాన అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. తన ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ"ఆరోగ్యం అనే అంశం ప్రతి మనిషి జీవితానికి మూలస్తంభం. విద్యార్థులు, యువత ప్రజలలో ఆరోగ్య స్పూర్తిని పెంపొందించడమే నిజమైన 'సేవా భావం" అని అన్నారు. ఈ ప్రత్యేక శిబిరానికి ప్రత్యేక అతిథిగా హాజరైన యర్రగుంట్ల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి, శ్రీనాథ రెడ్డి వాలంటీర్లకు విస్తృతంగా హెల్త్ అవేర్నెస్ పైన అవగాహన కల్పించారు.

డెంగ్యూ, టిబి టైఫాయిడ్, కలరా, మలేరియా వంటి రుగ్మతల కారణాలు, నివారణ చర్యలు, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో లభ్యమయ్యే సౌకర్యాల గురించి వివరించారు. అలాగే అవసరమైతే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి మరియు కడప రిమ్స్ వంటి రిఫరల్ ఆసుపత్రుల ద్వారా చికిత్స పొందవచ్చని తెలిపారు. ఈ విషయాల పట్ల స్థానిక ప్రజలలో విస్తృతమైన ప్రచారాన్ని కల్పించవలసిందిగా ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్లు సంటెప్ప, వేణుగోపాల్ మాట్లాడుతూ, "నివారణే ఉత్తమ వైద్యం" అని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి యువత ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కలిసి 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా హెల్త్ సెంటర్ పరిసరాలను శుభ్రపరిచారు. పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద కార్యకర్తలు కాలనీలోని ప్రజలను కలసి ఆరోగ్య అవగాహన కరపత్రాలను పంపిణీ చేసి, పరిశుభ్రత మరియు ఆరోగ్యకర జీవన శైలిపై చైతన్యాన్ని కల్పించారు.అలాగే "హెల్త్ ఇస్ వెల్త్ ", "ప్రివెన్షన్ ఇస్ బెటర్ థాన్ క్యూర్ ", "హెల్త్ ఇండియా వెల్త్ ఇండియా " వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించి ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సమగ్ర కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. నాగమహేశ్వరరెడ్డి సమర్థవంతంగా నిర్వహించారు. ఆయన మార్గదర్శకత్వంలో వాలంటీర్లు ఆరోగ్య అవగాహన, పరిశుభ్రత, మరియు ప్రజా సేవా స్ఫూర్తిని ప్రతిబింబించారు. ఆరోగ్యంతోనే ఆనందం, పరిశు భ్రతతోనే ప్రగతి" అనే సందేశంతో ఈ ఆరోగ్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహణ పట్ల స్థానిక ప్రజలు హర్షం వెలిబుచ్చి కార్యక్రమం నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.

# సోలార్ విద్యుత్ వినియోగంలో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించాలి

**1957లోనే మండలి వెంకట కృష్ణారావు ఎంపీగా అవనిగడ్డకు విద్యుత్ తెచ్చారు**

**సోలార్ విద్యుత్ ప్రతి ఒక్కరికి ప్రయోజనకరం**

**–అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

**300వ పీఎం సూర్య ఘర్ మంజూరు పత్రాలు అందించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్**



అవనిగడ్డ అక్టోబర్ 18 (వుదయం ప్రతినిధి): సోలార్ విద్యుత్ వినియోగంలో నియోజకవర్గం రాష్ట్రంలో మొదటి స్థానం సాధించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. శనివారం అవనిగడ్డలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద పీఎం సూర్య ఘర్ 300వ ప్లాంట్ మంజూరు సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ 132/33 కేవీ సబ్ స్టేషన్ పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పీఎం సూర్య ఘర్ పథకం ప్రయోజనాలు, సబ్సిడీ వివరాల కరపత్రాలు ఆవిష్కరించారు. 300వ పీఎం సూర్య ఘర్ ప్లాంట్ లబ్దిదారు విస్సంశెట్టి శర్యాణికి సబ్సిడీ మంజూరు పత్రాలు అందచేశారు. అవనిగడ్డ సబ్ డివిజనులో 300వ సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్స్ ఏర్పాటు లక్ష్యం సాధించిన సందర్భంగా లబ్దిదారులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలు చవిచూసే దివిసీమలో గాలులు వీచిన ప్రతిసారి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా, అంతరాయము లేని విద్యుత్ సరఫరా కోసం ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వయంగా తమ ఇంటికి సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా కలిగిన ప్రయోజనం వివరించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం సూర్య ఘర్ పథకానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విస్తృత ప్రచారం కల్పిస్తున్నారని తెలిపారు. ఈ వథకాన్ని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించి తీర గ్రామాలతో సహా పీఎం సూర్య ఘర్ పథకం వినియోగదారుల సంఖ్యను 300లకు చేర్చిన విద్యుత్ శాఖ అధికారులను అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.78వేల సబ్సిడీ ఇస్తోందని, ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలో వాట్ల సోలార్ ప్లాంట్ ఉచితంగా ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ భీమా సుధాకర్, డీఈఈలు నడకుదుటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, డీసీటీఓ స్వరూపరాణి, ఏఈఈలు జి.వెంకటరాజు, తోట ప్రసాద్, గోపిచందు, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : SIRIKONDA MARIA, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.